సంపుటి : 78 సంచిక : 13 పుటలు : 52

జాగృతి

కలి 5127 - శ్రీ విశ్వావసు పుష్య బహుళ నవమి
12-18 జనవరి 2026
వెల : ₹20/-

నాటి సంక్రాంతిలో నేడు 'కాంతి' ఎంత!?

పంచపరివర్తన అంటే యుగధర్మాన్ని నిలుపుకోవడమే!

ఆర్ఎస్ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబళేతో ముఖాముఖి

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.250/-



వెల : ₹.100/-



వెల : ₹.400/-

వెల : ₹.300/-



వెల : ₹.151/-

వెల : ₹.800/900 : 999/1200

వెల : ₹.100/-

వెల : ₹.150/-

వెల : ₹.99/-



వెల:₹.1598/- సెట్



వెల:₹.449/-



వెల :₹.450/-



వెల : ₹.400/-



వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

కొండపై దీపానికి రాజకీయాలా?

స్టాలిన్ ప్రభుత్వానికి హైకోర్టు చీవాట్లు

డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మదురైలోని తిరుప్పరంకుండ్రం కొండలపై ఉన్న రాతిస్తంభం వద్ద దీపం వెలిగించాలని ఆదేశించిన సింగిల్ జడ్జి ఆదేశాలను మద్రాస్ హైకోర్టు (మదురై బెంచ్) జనవరి 6, మంగళవారం సమర్థించింది.

హజరత్ సుల్తాన్ సికిందర్ బాదుషా అవూలియా దర్గా కూడా ఉన్న తిరుప్పరంకుండ్రంపై పురాతన రాతి దీప స్తంభం వద్ద కార్తికదీపం వెలిగించవచ్చా లేదా అనే దానిపై కోర్టు ముందున్న అంశం కేంద్రీకృతమై ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, ఇతర అప్పీలుదారులు ఆచారం, శాంతిభద్రతల ఆందోళనలు, స్థలంపై పోటీ వాదనలను పేర్కొంటూ ఈ ఆచారాన్ని వ్యతిరేకించారు.

మునుపటి వ్యాజ్యాలలో ఈ అంశం నిశ్చయంగా నిర్ణయించనందున, సింగిల్ జడ్జి ఉత్తర్వును నిరోధించలేమని జస్టిస్ జి జయచంద్రన్, జస్టిస్ రామకృష్ణన్‌ల తో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. రాష్ట్ర అధికారులు, దర్గా సహా అప్పీలుదారులు ఏదైనా ఆగమశాస్త్రం దీపం వెలిగించడాన్ని నిషేధించిందని చూపించడానికి "బలమైన ఆధారాలను" సమర్పించడంలో విఫలమయ్యారని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను తీవ్రంగా ఖండించింది. సంవత్సరంలో ఒక నిర్దిష్ట దినాన దేవస్థానం ప్రతినిధులు రాతిస్తంభంపై దీపం వెలిగించడానికి అనుమతించడంతో ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తుందని వాదించడం "హాస్యాస్పదం, నమ్మడం కష్టం" అని ధర్మాసనం పేర్కొంది.

"రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా స్పాన్సర్ చేస్తేనే" శాంతి,భద్రతలకు విఘాతం కలుగుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఏ రాష్ట్ర ప్రభుత్వమూ తన రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకొని వెళ్లడానికి ఇంత స్థాయికి దిగజారుతుందని తాము భావించడంలేదని కూడా పేర్కొంది. ఆ స్తంభం దర్గాకు చెందినదనే వాదనలు మధ్యవర్తిత్వ ప్రయత్నాల చుట్టూ ఉన్న సందేహాలను మరింత పెంచాయని న్యాయమూర్తులు గుర్తించారు.

డిసెంబర్ 1న తిరుపరంకుండ్రంలోని అరుళ్మిగు సుబ్రమణ్యస్వామి ఆలయ మేనేజ్‌మెంట్‌ను కొండపై ఉన్న పురాతన రాతి దీపస్తంభం వద్ద కార్తికదీపం వెలిగించాలని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుపై ఈ అప్పీళ్లు తలెత్తాయి.

కార్తికదీపం రోజున ఆ ఉత్తర్వును పాటించకపోవడంతో, పిటిషనర్ భక్తులు స్వయంగా దీపం వెలిగించుకునేందుకు సింగిల్ జడ్జి అనుమతి ఇచ్చారు. అది కూడా జరగలేదు. ఆ తర్వాత మొదలైన కోర్టు ధిక్కార చర్యలు పెండింగ్‌లో పడ్డాయి. సింగిల్ జడ్జి ఆదేశాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు, దర్గా తమిళనాడు వక్ఫ్ బోర్డు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాయి. దీపం వెలిగించాలని కోరే చట్టపరమైన హక్కు భక్తులకు లేదని, ఆర్టికల్ 226 అధికారాలను ఉపయోగించి చాలా కాలంగా ఉన్న ఆచారాన్ని మార్చలేమని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. ఈ పిటిషన్ ప్రజాప్రయోజనవ్యాజ్యం కాదని, ప్రైవేట్ వ్యాజ్యం అని, కోర్టు దృష్టి పిటిషనర్ హక్కులు, ప్రతివాదుల చట్టబద్ధమైన బాధ్యతలకు పరిమితం కావాలని అడ్వకేట్ జనరల్ వాదించారు.

మదురై కలెక్టర్, పోలీస్ కమిషనర్ కూడా ఈ ఉత్తర్వును వ్యతిరేకించారు. దీపోత్సవం కూడా "ఊహాత్మక కల్పితం" అని వాదించారు. దర్గా ప్రాంగణం గుండా మెట్లు ఎక్కడం ద్వారా ఆ ప్రదేశానికి చేరుకోవడంలో ఆచరణాత్మక ఇబ్బందులను ఎత్తి చూపారు. సింగిల్ జడ్జి ఆదేశాలు సున్నితమైన ప్రాంతంలో శాంతికి భంగం కలిగిస్తాయని వారు వాదించారు.

ఈ వాదనలను డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించింది. తిరప్పరంకుండ్రం కొండలపై ఉన్న రాతి స్తంభం వద్ద దీపం వెలిగించడానికి మార్గం సుగమం చేసింది. ★



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలు, ఆచార సంప్రదాయాలు, మర్యాద మన్ననలు, ఆహారపు అలవాట్లు లాంటి వాటి మేలికలయిక సంస్కృతి.అది ప్రజల జీవనసారం. సంస్కృతి, సాహిత్యాలు జాతికి జీవనాధారాలు. సంస్కృతికి జీవం సామాజిక జీవనం. మరి...అవన్నీ సక్రమరీతిలో ఉన్నాయా? అని ప్రశ్నించుకుంటే... అన్ని రంగాలు కాలుష్యంతో కునారిల్లుతున్నాయనేందుకు వర్తమాన పరిస్థితులే నిదర్శనం. మర్యాదలు, మన్ననలు మంటగలసి పోతున్నాయి. విధాన నిర్ణయాలను అమలు చేయవలసిన ప్రజాప్రతినిధులు చట్టసభలు, బహిరంగ వేదికలపైనే పరస్పరం దూషించుకుంటున్న విచిత్ర సన్నివేశం. రాజ్యాంగపదవుల గౌరవాన్ని మరచి, వాటిని అధిష్ఠించిన వారిని ఏకవచనంతో సంబోధిస్తూ, అశ్లీల పదాలను నిస్సిగ్గుగా, యథేచ్ఛగా వాడేస్తున్నారు.అధికార విపక్ష నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుతోంది.

సాంకేతికత, సమాచార విప్లవంతో సమాంతరంగా సాంస్కృతిక విధ్వంసమూ కొనసాగుతోంది. సాంకేతిక ప్రగతిని కాదనే వారు ఉండరు. కానీ హద్దుమీరితేనే తంటా. స్మార్ట్ ఫోన్‌ల వాడకం అధికమవుతున్న కొద్ది విశృంఖలత్వం శ్రుతి మించి యువతపైన, సంస్కృతిపైన తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలా మంది యూట్యూబర్లు కట్టుతప్పుతున్నారు. నచ్చని వారిపై కొందరు చేసే జుగుప్సాకర వ్యాఖ్యాలను యథాతథంగా ప్రసారం చేస్తున్నారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ...' అన్న శ్రీరామచంద్రుని హితోక్తి స్ఫూర్తితో...'ఏ దేశమేగినా ఎందుకాలిడిన... ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైన... పొగడరా నీ తల్లి భూమి భారతిని...' అన్నారు మాన్యులు రాయప్రోలు వారు. ఆ జాతీయతా స్ఫూర్తి గీతాన్ని అనుసరించేందుకు ఎందరో జాతీయనేతలు యత్నించారు, యత్నిస్తున్నారు. అదే సమయంలో... కొందరు విదేశీగడ్డపైనే స్వదేశం గురించి చిన్నతనంగా మాట్లాడడం బాధాకరం.

సాంస్కృతిక విస్మృతి/కాలుష్యం పెచ్చరిల్లుతోంది. ఒక పరమార్థంతో ఏర్పడిన పండుగల నిర్వహణలో ఆర్భాటాలకే చోటెక్కువ. ఉదాహరణకు, వినాయక చవితి అంటే పందిళ్లలో అసభ్యనృత్యాలు... శబ్దకాలుష్యం. సంక్రాంతి అంటే కోడిపందాలు అనే భావన కుదురుకుంటోంది. జనంలో భక్తి భావం పెరుగుతున్నట్టు అనిపిస్తున్నా,

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు పుష్య బహుళ నవమి

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

'పంచపరివర్తన అంటే యుగధర్మాన్ని నిలుపుకోవడమే!'

ధారావాహిక నవల

18 గణపతిదేవుడు

- మత్తి భానుమూర్తి

20లో

ప్రత్యేక వ్యాసం

నాటి సంక్రాంతిలో నేడు 'కాంతి' ఎంత!?

26లో

జాగృతి

సంపాదకీయం

మరోవంక సాంస్కృతిక, ఆధ్యాత్మికత,సనాతన ధర్మం హననయత్నాలు ముమ్మరమవు తున్నాయి. పురాణ పురుషులను, కించ పరచడం, ఇతిహాసాలు, ప్రవచనకారులపై, భగవత్ ప్రసాదాలపై విపరీత వ్యాఖ్యానాలు, దేవీదేవతా విగ్రహాల ధ్వంసం, రథాల దహనాలు, సర్వసాధారణ మయ్యాయి. దేవుడి సొమ్ముపై దళారులు కన్ను. పరకామణిలో హస్త లాఘవం.ఆయా సంఘటనలకు సంబంధించి పట్టుబడిన నిందితులు 'మతిస్థిమితం' లేని వారిగా క్షమార్హులు కావడం వింత, విచిత్ర పరిణామం. మతిస్థిమితం లేని వారికి హిందూ దేవాలయాలు, దేవతామూర్తులే ఎందుకు లక్ష్యమవుతున్నారు? అన్నది జవాబులేని ప్రశ్న. లౌకికి రాజ్యంలో

ఈ భోగిమంటలలో..

సాగుతున్న ఈ విపరీత ధోరణిని గట్టిగా ఖండించే వారు కరవయ్యారు. అరకొరగా నిలదీసిన వారి మాటలను లెక్కపెట్టని దయనీయత.

మనిషి మాతృ,భాషాబంధాలతో పుడతాడని పెద్దల మాట. ఈ బంధాలకు వర్తమానంలో గల విలువ ఏ పాటిదో ఆత్మపరిశీలన అవసరం. ఆర్థిక సంబంధాల ముందు హార్ధిక సంబంధాలు వెలవెలబోతున్నాయి. కట్టుబొట్టు కట్టుతప్పుతున్నాయి. కన్నవారిని నిరాదరించే 'వృశ్చిక' సంతతిలానే, వావివరుసలు మరచి,అవసరమైతే అయిన వారిని అంతమొందించేందుకు కూడా వెనుకాడని ఘనుల గురించిన కథనాలు మాధ్యమాల్లో పుంఖానుపుంఖాలు. మాతృభాషాభిమానం మసక బారుతోంది. 'సొంత భాషను ప్రేమించు,పరభాషను గౌరవించు' అనే భాషాభిమానుల పిలుపు బధిర శంఖారావమే. పరభాషకు పట్టం కట్టడమే పరమావధిగా కనిపిస్తోంది. చిన్నారులకు ఉగ్గుపాలతో ఆంగ్లం నేర్పే సంస్కృతి బలపడుతోంది.'సనాతనుల దృష్టిలో సంస్కృతం నేర్చినవాళ్లే చదువుకున్నవారు. అధునాతనుల దృష్టిలో ఇంగ్లిషు నేర్చుకున్న వాళ్లే చదువుకున్న వాళ్లు. ఆ సనాతనులు, ఈ అధునాతనులు తెలుగువాళ్లే' అని విఖ్యాత కథకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి దశాబ్దాల క్రితమే అమ్మభాష దుస్థితిపై, భాషా కాలుష్యంపై కలత చెందారు. ఈ కాలుష్యానికి మాధ్యమాలూ తమ వంత పాత్ర పోషిస్తున్నాయడంలో మొహమాటపడక్కరలేదు.అందులోనూ టీవీ చానళ్ల పాలెక్కువన్నది నిష్కర సత్యం.

'మా పిల్లలకు తెలుగు (మాతృభాష) రాదు' అని ప్రకటించుకోవడం కన్నవారు మిన్నగా భావించుకుంటున్నారు. 'నేటి యువతరంలో చాలా మందికి తమ మాతృభాష ఏమిటనేది కూడా తెలియదు.మాతృభాష నిర్లక్ష్యానికి కచ్చితంగా తల్లిదండ్రులే బాధ్యత వహించవలసి ఉంటుంది'అని ఆర్ఎస్ఎస్ సర్ కార్యవహ దత్తాత్రేయ హోసబళే చెప్పడం కాదనలేని నిజం.

విద్యారంగం వ్యాపారమయమై, మార్కులు...ర్యాంకులే పరమావధిగా భావిస్తున్నవేళ, బలవంతపు చదువులతో ఎందరో విద్యార్థులు బతుకులు చాలి స్తున్నారు. తాము భావిపౌరులకు మార్గదర్శకులమన్న భావన కొందరు గురువుల్లో లోపిస్తోంది. 'గురువులకు పరువులేదు. విద్యాలయాలకు విలువలేదు. గురజాడ అంటే బెజవాడ పక్కన ఊరు అనుకుంటారే తప్ప ఆయనో మహాకవి అనే అవగాహనలేదు....' అని దాదాపు అయిదున్నర దశాబ్దాల క్రితం నాటి ప్రయోగాత్మక చలనచిత్రంలోని సంభాషణలు నేటి స్థితికి చాలా వరకు అద్దం పడుతున్నాయి. ఈ దురాచారాలు, దుశ్చర్యలను,వివిధ రంగాల్లో వేళ్లూనుకున్న కాలుష్యాన్ని భోగిమంటలకు ఆహుతి చేయాలి. భోగి మంటలంటే...కేవలం నిరుపయోగ వస్తువులు,చెత్తాచెదారాన్ని దహనం చేయడమే కాదు. మనసుల్లో పేరుకున్న వికారాలను, అరిషడ్వర్గాలను, అజ్ఞానం, మూఢత్వాలను దహింప చేయడమే భోగి మంటల పరమార్థం. ★

40లో

కథ

సమన్యాయం

- సి.యమున

నీటి వాటాలపై శుష్కప్రియాలు.. శూన్యహస్తాలు (తెలంగాణ) - 14
తెలుగును వెలిగిద్దాం (ఆంధ్రప్రదేశ్) - 16
ఇజ్రాయెల్ పటిష్ట వ్యూహం!! (అంతర్జాతీయం) - 24
యువతరమే భావికి వరం (ప్రత్యేక వ్యాసం) - 28
డోన్యి-పోలో-తులోమ్ రుక్కో... (గళమెత్తిన గతం) - 30
రాజకీయాలు, రాయబారాలు (ఆర్ఎస్ఎస్-100) - 32
వికసిత భారతాన్ని విస్పష్టం చేసిన విజ్ఞాన సమ్మేళనం (వేదిక) - 34
తృణముల్ తత్తరపాటు! (జాతీయం) - 38
అప్పుడు అనంద్..ఇప్పుడు అర్జున్! (క్రీడ) - 43
ఈ సంక్రాంతి విజేత ఎవరో!? (సినిమా) - 50



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది వేళ స్వయంసేవకులు అంకితమైన కొత్త సామాజికోద్యమం పంచపరివర్తన. ఈ ఉద్యమం ఉద్దేశం యుగధర్మాన్ని నిలుపుకోవడం అన్నారు సర్‌కార్యవాహ దత్తాత్రేయ హొసబళే. హిందూత్వం అంటే రామమందిర నిర్మాణమో, కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చిన 370 అధికరణం రద్దు మాత్రమే అనుకోరాదని, అమ్మభాష, కుటుంబం, పౌరవిధి, సామాజిక సమరసత, మన ఆర్ష వాఙ్మయం చెప్పే పర్యావరణ పరిరక్షణ... వీటన్నిటిని గౌరవించడమేనని, అదే యుగధర్మమని, ఆ ధర్మాన్ని ఆచరించాలని హొసబళే అన్నారు. వందేమాతర గేయం పుట్టి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ప్రత్యేక చర్చను

యుగధ

హిందూ ఐక్యత అన్న మూలసూత్రంతో సమంగా ఆర్ఎస్ఎస్ కార్యాచరణలో పంచపరివర్తనకు ప్రాముఖ్యం ఇవ్వబోతున్నట్టు కనిపిస్తున్నది. ఆ పంథా ఎలా ఉంటుందో వివరిస్తారా? ఫలితాలు ఎలా ఉంటాయని అనుకోవచ్చు?

మొత్తంగా చూసినప్పుడు పంచపరివర్తన అనేది కొత్త విషయమేమీ కాదు. సంఘం దీనికి సంబంధించిన కార్యాచరణను ఇప్పటికే చేపట్టింది. కానీ సంఘ శతాబ్ది తరుణంలో మన సమాజంలో పరివర్తనను ఆశించి ఆ ఐదు సూత్రాలను ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టాలని సంఘం భావించింది. ఇందులో ఉన్న అన్ని అంశాలు లేదంటే, కనీసం నాలుగు అంశాలు-సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, కుటుంబప్రబోధన్ అంటే కుటుంబ నిర్వహణకు సంబంధించి కౌన్సెలింగ్, కుటుంబ వ్యవస్థ, స్వదేశీ భావనపై స్వయంసేవకులు పని చేస్తున్నారు. అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యాచరణ దేశవ్యాప్తంగా జరుగుతున్నప్పటికీ కొద్దిమందికి మాత్రమే పరిమితమైపోయింది. ఇక పంచపరివర్తనలో ఐదవ విషయానికి వస్తే.. అదే పౌరకర్తవ్యభావన, పౌరుల విధి. ఈ ఐదవ అంశాన్ని మేం ఇటీవల జోడించాం. స్వయంసేవకులు శాఖకు వెళుతున్నప్పటికీ వారు పౌరకర్తవ్యభావన, పౌరుల విధిని అనుసరిస్తున్నారు. కానీ ఈ ఐదింటిని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టాలంటే మనం వీటన్నింటిని కలిపి యుగధర్మంగా భావించాలి. అసలు హిందూత్వాన్ని ఎలా నిర్వచించాలి? హిందూత్వం అంటే అయోధ్యలో మందిర నిర్మాణమో, లేదా ఆర్టికల్ 370ని తొలగించడమో మాత్రమే కాదు. ఇది ఇలాగే కొనసాగితే హిందూత్వం అంటే ఇదే కాబోలు అని ప్రజలు అనుకుంటారు. కానీ అది సరికాదు. అలాగే హిందూత్వం అజెండా అఖండ భారత్ కానే కాదు. కనుక హిందూత్వం అనేది ఒక అజెండా కాదు. అది ఒకరి యావత్ జీవితాన్ని ఆవరించి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో నేటి సమాజానికి కావలసినది ఏమిటి? ఒక వ్యక్తి స్థాయిలో, సమాజం స్థాయిలో, జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో ఏమి కావాలి? దీనికి సమాధానంగా జీవితంలో, ముఖ్యంగా భౌతికజీవితంలో కొన్ని అంశాలను గురించి మేం ఆలోచించాం. పౌరకర్తవ్య భావన, పౌరుల విధిని చూసినప్పుడు

నిర్వహించడం హర్షణీయమని, వందేమాతరం జాతీయ భావన విలువలను ప్రజలకు అలవరుస్తుందని అన్నారు. పొరుగు దేశాలలో తలెత్తిన జెన్‌జీ అలజడి గురించి వ్యాఖ్యానిస్తూ, ఆ పేరు మాత్రమే కొత్తదనీ, నవతరం కొత్త ఆలోచనలతో వస్తుంటుందనీ గుర్తు చేశారాయన. ప్రతీ నవతరానికి కొన్ని ఆకాంక్షలు ఉంటాయి, అలాంటి ఆకాంక్షలను సమాజం లేదా ప్రభుత్వం నెరవేర్చాలి. లేనిపక్షంలో నవతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. అయితే పొరుగుదేశం తరహాలో భారత్‌లో ఉన్నట్టుండి ఉద్యమం పుట్టుకొస్తుందని తానైతే అనుకోవడం లేదని అన్నారు. ఇవాళ సమాజాన్ని క్షోభ పెడుతున్న సామాజిక మాధ్యమాల విషయంలో స్వీయనియంత్రణే అత్యంత ముఖ్యమైనదని, ఆంక్షలు విధించడం వల్ల ప్రయోజనం ఉంటుందని తాను అనుకోవడం లేదని చెప్పారు.

మావోయిస్టుల ఆఖరి అడుగుల గురించి ప్రస్తావించగా– అటవీ ప్రాంతానికి చెందిన నక్సలిజం, పర్వత ప్రాంతాలకు చెందిన నక్సలిజం, గిరిజన ప్రాంతాలకు చెందిన నక్సలిజం పట్టణ ప్రాంతాలకు వలసపోయిందని, ఈ పరిణామం, అంటే అర్బన్ నక్సలిజం తలెత్తడం మరింత ప్రమాదకరమైనదని నిష్కర్షగా చెప్పారు. స్వదేశీ ఏ జాతికైనా జీవనాడి అని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. స్వదేశీ ఉద్యమం స్వాతంత్ర్య ఉద్యమానికి చోదకశక్తి మాత్రమే కాదు. అది మన ఆత్మగౌరవం, మన భాష, మన సంస్కృతి, మన ప్రకృతికి సంబంధించినదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో జరిగిన విశ్వసంఘ శిబిరంలో పాల్గొనడానికి వచ్చిన దత్తాత్రేయ హోసబళే తెలుగు జాతీయ వార పత్రిక జాగృతికి ప్రత్యేక ఇంటర్వ్యూ (డిసెంబర్ 26, 2025) ఇచ్చారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంత విశ్వరూపం వారి మాటలలో దర్శనమిస్తుంది.

'పంచపరివర్తన అంటే ర్యాన్ని నిలుపుకోవడమే!'

వాటి ఆచరణలో కొన్ని నియమాలను అనుసరిస్తున్నట్టుగా ఉంటుంది. కానీ నియమాలను అనుసరించడంతోనే వాటి ఆచరణ పరిపూర్ణం కాదు. వాటిని కూడా ఒక ధర్మంగా పరిగణించాలి. ఎందుకంటే ఒక వ్యక్తి సమాజంలో నివసిస్తున్నప్పుడు అతడు/ఆమె ఇతరుల పట్ల అక్కరను కలిగి ఉండాలి. నేను ఒక ఆసుపత్రి ప్రాంగణంలోకి అడుగుపెట్టినప్పుడు నేను ఏ విధంగా ప్రవర్తించాలి? లేదా ఒక విశ్వవిద్యాలయ ప్రాంగణం విషయానికి వస్తే, అదేమీ బజారు కాదు. అది మార్కెట్ కాదు. అక్కడ ఒక గ్రంథాలయం ఉంటుంది. అక్కడ విద్యాబోధన జరుగుతూ ఉంటుంది. పరిశోధన జరుగుతూ ఉంటుంది. అలాంటి చోట నేను వాహనాన్ని ఎలా నడపాలి? ప్రస్తుతం మనం ఉన్న ఈ విశ్వసంఘ శిబిర ప్రాంగణం విషయానికి వస్తే ఇక్కడ కొన్ని

నియమాలను అనుసరించడంతోనే వాటి ఆచరణ పరిపూర్ణం కాదు. వాటిని కూడా ఒక ధర్మంగా పరిగణించాలి.

నియమ, నిబంధనలు అమలులో ఉన్నాయి. కనుక ప్రతిస్పందన చర్యలో భాగంగా వాటిని మనం అయాచితంగా అనుసరించడమే పౌరకర్తవ్యభావన, పౌరుల విధి అవుతుంది. మనం దేవాలయానికి వెళ్లినప్పుడు కొన్ని పద్ధతులను అనుసరిస్తాం. వాటిని మన జీవితంలో భాగంగా చేసుకున్నాం. పాదరక్షలను దేవాలయం వెలుపల విడిచిపెడతాం. ఒక నిర్దేశితమైన పంథాను అనుసరించి మనం అక్కడికి వెళతాం. అక్కడ ఉమ్మి వేయం. ఎందుకంటే అది ఒక పవిత్రమైన ప్రాంతం కాబట్టి. మన చుట్టూ ఉన్న ప్రతీ ఒక్కటి చివరకు ఉద్యానవనం కూడా పవిత్రమైనదే. మనం అక్కడ ఉమ్మి వేయరాదు. కానీ మనం ఆ విషయాన్ని మరిచిపోతున్నాం. అంటే మన ప్రవర్తన చుట్టూ ధర్మం ఆవరించి ఉంటుంది. ధర్మం కూడా సామాజిక జీవనానికి

అనుసంధానమై ఉంటుంది. అందుకనే ఈ విషయాలన్నీ చాలా ముఖ్యమైనవి. ఆర్థికంగా మనం స్వయంసమృద్ధిని సాధించాలి. పరిస్థితులపై ఆధారపడి మనం స్వయంసమృద్ధిని సాధించాలి. భాష విషయానికి వస్తే.. తర్వాతి తరం భారతీయమైన వారి వారి భాషలను విస్మరించరాదు. మరచిపోరాదు. నేటి యువతరం విషయానికి వస్తే చాలా మందికి వారి మాతృభాష ఏమిటనేది కూడా తెలియదు. మాతృభాషలో ఉన్న పుస్తకాలను వారు చదవడం లేదు.

మాతృభాష నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఎవరు దీనికి బాధ్యులు? విధానాలకు రూపకల్పన చేసే ప్రభుత్వమైతే కాదు. కచ్చితంగా తలిదండ్రులే బాధ్యులు. వారు ఈ విషయాన్ని (మాతృభాష నిర్లక్ష్యం) పట్టించుకోవాలి. అందుకనే ఈ విషయాలన్నీ ఇమిడి ఉన్న పంచపరివర్తన ఒక సామాజిక ఉద్యమం అవుతుంది. ఇది హిందూత్వంలో భాగం. అదే యుగధర్మం. ఇక పంచపరివర్తనకు వస్తున్న స్పందన విషయానికి వస్తే– గడచిన ఆరుమాసాల్లో అనూహ్యమైన స్పందన వచ్చింది. పారిశ్రామికవేత్తలు, వయసులో పెద్దవారు, ప్రొఫెసర్లు, నిపుణులు, మతపెద్దలు లేదా కుటుంబ జీవనం గడుపుతున్నవారు, అన్ని వయసుల వారు ఇలా సమాజంలో అన్ని వర్గాల ప్రజలు అనుసరించ డానికి ఇది (పంచపరివర్తన) అద్భుతంగా ఉందని అంటున్నారు. ఇక్కడ చెప్పుకోవాల్సిన ముఖ్యమైన మొదటి విషయం ఏమిటంటే.. ఇది మతాలకు అతీతమైనది. ధార్మికపరంగా అత్యంత తటస్థమైనది. ఆర్థిక విషయాల పట్ల బాధ్యత, స్వదేశీ, కుటుంబ విలువలు అన్ని మతాలకు సంబంధించినవి. కాబట్టి అన్ని మతాలవారు అనుసరిం చాలి. ఇక రెండవ విషయం– దీనికి డబ్బుతో పనిలేదు. పంచపరివర్తనను ఆచరించేందుకు అదనంగా డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. మూడవ అంశంగా ప్రభుత్వం దీని కోసమని అదనంగా నియమ, నిబంధనలు రూపొందించాల్సిన పనిలేదు. దీని అమలుకు సమాజం పూనుకోవాలి. ఆ కారణంగానే పంచపరివర్తనకు ప్రజల నుంచి స్పందన అనూహ్యంగా ఉంది.

పంచపరివర్తన ఐదు అంశాలలో ఏది ప్రజలకు ఎక్కువ ఆకర్షణీయంగా ఉంది?

అది వ్యక్తులపైన, వారు ఉంటున్న పరిస్థితులపైన ఆధారపడి ఉంటుంది. కుటుంబ ప్రబోధన్ బాగుందని కొందరు అంటారు. ఎందుకంటే వారి కుటుంబంలో, వారి పరిసర ప్రాంతాల్లో అది సరిగ్గా సరిపోతుంది కాబట్టి. మరికొందరు పౌరకర్తవ్య భావన, పౌరుల విధి వైపు మొగ్గు చూపుతుంటారు. ఎందుకంటే సమాజంలోని వ్యక్తులతో నేను సంభాషించిన దాన్ని బట్టి వేర్వేరు సమూహాలకు చెందిన వ్యక్తులకు వారికంటూ ప్రాధాన్యమనిపించే అంశాలు కొన్ని ఉంటాయి. అందుకనే కొందరు స్వదేశీ ముఖ్యమైనది అంటారు. మరికొందరు పర్యావరణ పరిరక్షణ కీలకమైనది అంటారు. అందుకనే పంచపరివర్తనలో ఏది అగ్రస్థానంలో ఉంటుంది అనే విషయాన్ని నేను చెప్పలేను. చాలా సందర్భాల్లో వాటి గురించి మాట్లాడుతున్నప్పుడు పంచపరివర్తనలో అంశాల వరుస క్రమాన్ని మార్చి చెబుతుంటాను. అవి ఒకే వరుస క్రమంలో ఉండాల్సిన అవసరం లేదు. లేనిపక్షంలో ప్రజలు ఆచరణలో సామాజిక సమరతను మొదటిదిగాను పౌరకర్తవ్యభావన చివరిదిగానూ భావించే అవకాశం ఉంది. కనుక పంచపరివర్తనలో దేనికి అగ్రతాంబూలం ఇవ్వాలనేది వ్యక్తుల పైన, వారి జీవించే ప్రాంతాలపైన, అక్కడి పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది.

ప్రస్తుత సమాజంలో పౌరకర్తవ్య భావన చాలా ముఖ్యమైనదని భావించవచ్చునా?

చూడండి. నేను సూరత్‌లోని బుద్ధవిహార్‌కు వెళ్లాను. అక్కడ షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు నివసిస్తున్నారు. వారికి పర్యావరణ పరిరక్షణ గురించి ఎలాంటి పట్టింపు లేదు. ఎందుకంటే వారి జీవన ప్రమాణాలు కడు దయనీయం కాబట్టి. వారు ఆలోచించేదల్లా సమాజంలో అందరితో సమానంగా తమను చూడాలని. అలాంటి చోట్ల సామాజిక న్యాయం ముఖ్యమైనది. ఇదంతా చూసినప్పుడు పంచపరివర్తనలోని అన్ని అంశాలూ అన్ని సందర్భాలలోను వారి వారి తీరును బట్టి ముఖ్యమైనవి అని చెప్పలేం. కనుక ఉన్న ఐదింటిలో ఏది మొదటిది అనేది మనం చెప్పలేం.

వందేమాతరం గీతానికి, ఆ గీతం జాతికి ఇచ్చిన స్ఫూర్తికి గొప్ప చరిత్ర ఉంది. ఆ గీతం ఇస్తున్న ప్రేరణ భవిష్యత్తులో భారతీయులలో మానసిక ఐక్యతను సాధించడంలో ఎలా ఉపయోగపడుతుందని అనుకోవచ్చు? పార్లమెంట్ ఆ గీతం గురించి ప్రత్యేక చర్చకు అవకాశం కల్పించడం ఎలాంటి చర్య?

భారత ప్రభుత్వం వందేమాతరంపై పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చను నిర్వహించడం మంచి పరిణామం. అలాగని అదేదో అదనంగా చేసిన పని అని భావించాల్సిన అవసరం లేదు. కానీ పార్లమెంట్ తీసుకున్న చొరవ ఇదే విషయంపై నేటి తరంలో లోతైన చర్చకు దారి తీసింది. నేటి తరానికి, వారికంటే ఒక ముందు తరానికి వందేమాతరం నేపథ్యం గురించి పెద్దగా తెలియదు. అలాగని ఇదేదో ఆర్ఎస్ఎస్ లేదా బీజేపీ గట్టిగా నొక్కి వక్కాణిస్తున్న విషయం కూడా కాదు. చూడండి! మొదటగా జనగణమన, వందేమాతర గీతాలకు సమాన హోదా ఇవ్వాలని, రెండింటికీ సమాన గౌరవం ఇవ్వాలని భారత రాజ్యాంగం స్పష్టంగా చెప్పింది. రెండవది, నిజానికి పార్లమెంట్ సమావేశాలు వందే మాతరంతో మొదలై జనగణమనతో ముగుస్తాయి. రాజ్యాంగ

మాతృభాష నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఎవరు దీనికి బాధ్యులు? విధానాలకు రూపకల్పన చేసే ప్రభుత్వమైతే కాదు. కచ్చితంగా తలిదండ్రులే బాధ్యులు. వారు ఈ విషయాన్ని (మాతృభాష నిర్లక్ష్యం) పట్టించుకోవాలి. అందుకనే ఈ విషయాలన్నీ ఇమిడి ఉన్న పంచపరివర్తన ఒక సామాజిక ఉద్యమం అవుతుంది. ఇది హిందూత్వంలో భాగం. అదే యుగధర్మం.

పంచపరివర్తనలో దేనికి అగ్రతాంబూలం ఇవ్వాలనేది వ్యక్తుల పైన, వారి జీవించే ప్రాంతాలపైన, అక్కడి పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది.

పరిషత్ దీని గురించి విస్తృతంగా చర్చించింది. కానీ కాలం గడిచేకొద్ది, దేశానికి స్వరాజ్యం వచ్చిన తర్వాత జాతీయగీతం వందేమాతరాన్ని ప్రజలకు నేర్పిస్తున్న దాఖలాలు కనిపించడంలేదు. పాఠశాల అసెంబ్లీలో జనగణమన ఆలపించడం జరుగుతున్నది. ఇది స్వాగతించాల్సిన అంశమే. ఎందుకంటే అది జాతీయగీతం కాబట్టి. కానీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కనీసం కొన్ని సందర్భాల్లోనైనా వందేమాతరం ఆలపించాలి. ఎందుకంటే అది రాజ్యాంగానికి సంబంధించిన వ్యవహారం. వారు (స్వరాజ్యం వచ్చిన తర్వాత దేశాన్ని పాలించిన నాయకులు) తమకు అనుకూలమైన రీతిలో దానిని పక్కన పెట్టేశారు. ఎందుకంటే కొందరికి వందేమాతరం ఆలపించడంపై ఆసక్తి లేదు. మరికొందరు భారత్‌ను భారతమాతగా భావించరు. అదేమంటే లౌకికవాదం అంటారు. అదే నిజమైతే కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీ దాని గురించి ఎందుకు చర్చించింది? దానిని ఎందుకు జోడించింది? అంటే వారు(గత పాలకులు) ఉద్దేశపూర్వకంగానే దానిని రాజ్యాంగ బద్ధంగా తోసిరాజన్నారు. అక్కడితో ఆగకుండా ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అనుసరించడం లేదంటూ ఆరోపిస్తారు. వారు ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగం ప్రసాదించిన కొన్నింటిని ఉపేక్షించారు. ఇంక మూడో విషయం, వందేమాతరం స్వాతంత్ర్యోద్యమంలో ఒక కీలకమైన పాత్రను పోషించింది. అదేదో ఆర్ఎస్ఎస్ ప్రవేశపెట్టింది కాదు. వందేమాతరం పేరిట జాతిని దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేసిన ఎన్నో త్యాగాలకు ఈ నేల సాక్షిగా నిలిచింది. కనుక ప్రతీ తరానికి ఇది స్మరించుకోదగినదిగా చెప్పాలి. దానికి గౌరవం ఇవ్వాలి. అదేదో నిర్బంధంగా విధించేది కారాదు. వందేమాతరానికి రాజ్యాంగబద్ధత ఉంది. రాజ్యాంగబద్ధమైన దాన్ని ప్రతీ ఒక్కరూ అనుసరించాలి. అది దేశం కోసం పనిచేసే విధంగా, అవసరమైతే దేశం కోసం త్యాగం చేసే విధంగా ప్రజలకు స్ఫూర్తిని ఇస్తుంది. వందేమాతరం జాతీయ భావన విలువలను ప్రజలకు అలవరుస్తుంది. బంకించంద్ర చటర్జీ అద్భుతమైన చరణాలతో వందే మాతర గీతాన్ని లిఖించారు. ఈ దేశపు సుదీర్ఘమైన ఘన చరిత్ర, నాగరికత, సంస్కృతిని గమనంలోకి తీసుకొని ఆ గీతం రచించారు. వందే మాతరంలో ఉన్నది రాజ్యాంగం తొలి ప్రతిలో చిత్రంగా ముద్రితమై ఉంది కూడా.

1937లో ముస్లింలు కోరిన మీదట వందేమాతరం నుంచి రెండు ముఖ్యమైన చరణాలను తొలగించారు.

వందేమాతరం స్వాతంత్ర్యోద్యమంలో ఒక కీలకమైన పాత్రను పోషించింది. వందేమాతరం పేరిట జాతిని దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేసిన ఎన్నో త్యాగాలకు ఈ నేల సాక్షిగా నిలిచింది. కనుక ప్రతీ తరానికి ఇది స్మరించుకోదగినదిగా చెప్పాలి. దానికి గౌరవం ఇవ్వాలి. అదేదో నిర్బంధంగా విధించేది కారాదు. వందేమాతరానికి రాజ్యాంగ బద్ధత ఉంది. రాజ్యాంగ బద్ధమైన దాన్ని ప్రతీ ఒక్కరూ అనుసరించాలి. అది దేశం కోసం పనిచేసే విధంగా, అవసరమైతే దేశం కోసం త్యాగం చేసే విధంగా ప్రజలకు స్ఫూర్తిని ఇస్తుంది. వందేమాతరం జాతీయ భావన విలువలను ప్రజలకు అలవరుస్తుంది. బంకించంద్ర చటర్జీ అద్భుతమైన చరణాలతో వందే మాతర గీతాన్ని లిఖించారు.

అయినప్పటికీ వారు దానిని పాడాలని కోరుకోవడం లేదు. దీని వెనుక ఇతర కారణం ఏదైనా ఉందా?

లేదు. మరే ఇతర కారణం లేదు. ఘనత వహించిన బూటకపు లౌకికవాద ప్రభావం ఇది. సరే, రెండు కీలకమైన చరణాలను వారు తొలగించారు. అయినప్పటికీ మిగిలిన వందేమాతరం గీతాన్ని మీరెందుకు ఆలపించడంలేదు? అదే ప్రశ్నార్థకమైంది. లౌకికవాదం కేవలం సమాజంలో ఒక వర్గాన్ని బుజ్జగించడానికి ఉన్నది. అలాగని ముస్లింలను మాత్రమే బుజ్జగిస్తున్నారని నేను అనడంలేదు. ఘనత వహించిన మన ప్రజల ఉదారవాద మనస్తత్వం కూడా గుర్తు చేసుకోవాలి. అలాంటి ప్రజలే ఇందుకు కారణం. అలాంటివారు వద్దు.. వద్దు.. వందేమాతరం ఆలపిస్తే అది మీ మతానికి దెబ్బ అని అంటున్నారు. అదేంటి? అలా జరగకూడదు. అందుకనే దీనికి (ఈ వివాదానికి) ఈ దేశంలో వలసవాద మనస్తత్వంతో కూడుకున్న వామపక్ష, ఉదారవాద, సామ్యవాద మూక కారణమైంది. వారు(ఆ మూక) రాతప్రతులను వక్రీకరించారు. భారతీయ భాషలను భ్రష్టు పట్టించారు. వందేమాతర గీతాన్ని అవమానించారు. అనేక విషయాలలో ఇలాగే వ్యవహరించారు. పాఠశాలలలో సరస్వతీ వందనం జోలికి వెళ్లారు. చరిత్రను నాశనం చేశారు. ఇంతటి నేరానికి వారు ఒడిగట్టారు. ఈ వాస్తవాలను అంగీకరించవలసిన సమయం సమాజంలో ఆసన్నమైంది.

మన పారుగు దేశంలో జెన్‌జీ ఉద్యమాన్ని ఎలా చూడగలం?

చూడండి! జెన్‌జీ ఉద్యమం అనేది ఇదివరకూ ఉన్నది. కాకపోతే పేరు కొత్తది. నేను కాలేజీలో చదువుతున్నప్పుడు జేపీ (లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్) ఉద్యమం వచ్చింది. జేపీ ఉద్యమం ఎలా మొదలైంది?

సంపూర్ణ విప్లవం...

నిజమే. కానీ అది జయప్రకాశ్ నారాయణ్ ఆరంభించిన ఉద్యమం కాదు. విద్యార్థులు దానికి నాంది పలికారు.

గుజరాత్‌లో..

ఒక విద్యార్థిగా నేనూ అందులో పాల్గొన్నాను. అప్పట్లో అది కూడా జెన్‌జీనే. కాకపోతే వారు దానిని జెన్‌జీ అని పిలవకుండా యువత ఉద్యమం అని పిలిచారు. ఇవాళ మీరు జెన్‌జీ అని అంటున్నారు. సరే. పేరు మాత్రమే కొత్తది. ప్రతీ నవతరం కొత్త ఆలోచనలతో వస్తుంటుంది. అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటుంది. ప్రతీ నవతరానికి కొన్ని ఆకాంక్షలు ఉంటాయి. అలాంటి ఆకాంక్షలను సమాజం లేదా ప్రభుత్వం నెరవేర్చాలి. లేని పక్షంలో నవతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారుతుంది. ఒక ఇంట్లో నివసించే కుటుంబంలోని పెద్దల మాట వినడానికి నవతరం సిద్ధంగా ఉండదు. కనుక ప్రతీ కుటుంబంలోనూ జెన్‌జీ ఉంటుంది. సహజంగా జరిగేది ఏమిటంటే, మా నాన్నగారు చెప్పే మాట మంచిదైనప్పటికీ నేను వినను. యువకుడిగా ఉన్నప్పుడు మా నాన్నగారు

కూడా ఇదే పని (వారి నాన్నగారి మాట వినకపోవడం) చేసి ఉంటారు. కనుక జెన్‌జీ మానవ జీవనంలో సర్వ సాధారణమైన విషయం. కానీ జెన్‌జీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాత్రమే వ్యవహరించదు. అది అనేకసార్లు, అనేక అంశాలను ప్రశ్నిస్తుంది. అన్వేషణ సాగిస్తుంటుంది. పరిస్థితిని అర్థం చేసుకునే తర్ఫీదు పొంది ఉంటుంది. పరిశోధన చేస్తుంది. ఎందుకంటే ప్రతీ నవతరం సరికొత్త మేధా సంపత్తితో పురుడు పోసుకుంటుంది. అందుకనే జెన్‌జీకి చెందినవారికి కొన్ని విషయాల్లో తమ మునుపటి తరం వారి కంటే మెరుగైన పరిజ్ఞానం ఉంటుంది. అది అన్ని విషయాల్లో కాదు. అలాగే ప్రతీ తరానికి సాహసం చేయాలనే ఆలోచన ఉంటుంది. వారు(జెన్‌జీ) అన్యాయాన్ని సహించరు. అందుకే వారు ఉద్యమిస్తున్నారు. మనదేశంలో యువత బ్రిటిష్ వారిని వ్యతిరేకించారు. పాలకులపై బాంబులు వేశారు. ఉరికొయ్యలెక్కారు. కనుక ఇది ప్రతీ తరంలోనూ ఉంటుంది. అయితే.. నేడు మన పొరుగు దేశంలో ఎందుకు అలా జరుగుతోంది? ఎందుకంటే ఉపాధి కల్పనలోనూ, నవతరం ఆకాంక్షలను నెరవేర్చడం లోనూ అక్కడి ప్రభుత్వం విఫలమైంది కాబట్టి. అదీకాకుంటే, అక్కడి పాలకులు పీకల్లోతు అవినీతిలో ఉండవచ్చు. కనుక ఆర్థికపరమైన అంశాలు, అవినీతి, సామాజికపరమైన కొన్ని అంశాలు నెలకొన్నాయి. అందుకనే వారు(జెన్‌జీ) ప్రభుత్వంపై విశ్వాసాన్ని కోల్పోయారు. ఆ కారణంగానే వారు స్పందించారు. భారత్‌లో పరిస్థితి పూర్తిగా భిన్నమైనది. యువతరానికి నైపుణ్యాలు ఉన్నాయి. ప్రభుత్వం పట్ల, సామాజిక వ్యవస్థల పట్ల విశ్వాసం ఉంది. కొంత వ్యతిరేకత ఐతే ఉండవచ్చు. ఇది నిజం. ఉదాహరణకు యువత దేవాలయానికి వెళుతున్నారు. పెద్ద సంఖ్యలో కావడులు వొస్తున్నారు. దేశవ్యాప్తంగా వేలాది యువత దూరాభారాలను లెక్కచేయకుండా పవిత్రజలాలను తీసుకెళుతూ కనిపిస్తారు. ఇక్కడ వైవిధ్యం ఎక్కువ. అందుకనే అక్కడ (పొరుగుదేశం) జరిగింది భారత్‌లో జరగదు. యువత ఆకాంక్షలను పట్టించుకోవాలి. అందుకనే ఆర్ఎస్ఎస్‌లో యువతను పట్టించుకుంటాం. మనదేశంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఉద్యమాల్లో యువత పాత్ర ఉంది. యువత ఆకాంక్షలు భౌతికపరమైనవి. సాంస్కృతికంగా వారి(యువత) ఎదుగుదల, సమాజంలో వారి అనుసంధానం లాంటి అంశాలను సరిగ్గా పట్టించుకోవాలి. అలాగే ఏ వయసు వచ్చినప్పుడు ఒకరు వయోజనులు అవుతారు అని

ఇవాళ మీరు జెన్‌జీ అని అంటున్నారు. సరే. పేరు మాత్రమే కొత్తది. ప్రతీ నవతరం కొత్త ఆలోచనలతో వస్తుంటుంది. అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటుంది. ప్రతీ నవతరానికి కొన్ని ఆకాంక్షలు ఉంటాయి. అలాంటి ఆకాంక్షలను సమాజం లేదా ప్రభుత్వం నెరవేర్చాలి. లేని పక్షంలో నవతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారుతుంది. ఒక ఇంట్లో నివసించే కుటుంబంలోని పెద్దల మాట వినడానికి నవతరం సిద్ధంగా ఉండదు. కనుక ప్రతీ కుటుంబంలోనూ జెన్‌జీ ఉంటుంది.

బిల్‌గేట్స్ తన కుమారుడు, కుమార్తెలతో సోషల్ మీడియా చూడవద్దని చెప్పిన సంగతిని నేను విన్నాను.

చెప్పడానికి సంస్కృతంలో ఒక వాక్యం ఉంది. 'షోడశే వర్షం ప్రాప్తం పుత్రం మిత్ర వదాచరేత్,' అంటే పుత్రుడికి 16 సంవత్సరాల వయసు వచ్చినప్పుడు తండ్రి అతడితో ఒక మిత్రుడితో ఉన్నట్టుగా ప్రవర్తించాలి. కనుక 16 ఏళ్లు వచ్చినవారు జెన్‌జీ కిందకు వస్తారు. కనుక తండ్రి ఎలా ప్రవర్తించాలి? ఒక మిత్రుడులాగా ప్రవర్తించాలి. కుమారుడిగా మాత్రమే కాకుండా మిత్రుడిలా కూడా చూడాలి. మీరు అలా ప్రవర్తించాలి. దానిని (కుమారుడి మనస్తత్వాన్ని) అర్థం చేసుకోవాలి. తదనుగుణంగా మీరు కుటుంబస్థాయిలోనూ, సమాజం స్థాయిలోనూ, ప్రభుత్వం స్థాయిలోనూ ప్రవర్తించడం ప్రారంభించాలి. ప్రభుత్వం కూడా యువత ఆకాంక్షలను నెరవేర్చే దిశగా తగినన్ని చర్యలు చేపట్టాలి. అందుకనే ఇక్కడి ప్రభుత్వం ఆర్థిక రంగంలోనూ, విద్యారంగంలోనూ, పరిశోధనా రంగంలో ఆ దిశగా కార్యాచరణకు దిగింది. భారత్‌లో పొరుగు దేశం తరహాలో ఉన్నట్టుండి ఉద్యమం పుట్టుకొస్తుందని నేనైతే అనుకోవడం లేదు.

సోషల్ మీడియాకు సంబంధించిన ఒక ప్రశ్న. ఇది మానవ స్వభావానికి, సంస్కృతికి సంబంధించినది. సోషల్ మీడియాకు చెందిన కొందరు ప్రముఖులు దానిని చూడకుండా వారి కుటుంబాలపై ఆంక్షలు విధించారు. ఎందుకని?

అది నిజమే. అనేక కార్పొరేట్ కార్యాలయాలు, మరీ ముఖ్యంగా పశ్చిమ దేశాలకు చెందినవి ఆ పని చేశాయి. బిల్‌గేట్స్ తన కుమారుడు, కుమార్తెలతో సోషల్ మీడియా చూడవద్దని చెప్పిన సంగతిని నేను విన్నాను.

ఇదే తరహాలో మిగిలిన సమాజంపై ఆంక్షలు విధించవచ్చు కదా?

అసహజ ఆంక్షల విధింపు బెడిసికొడుతుంది. మరింత పోటీతత్వంతో కూడుకున్న ఫలితాలను ఇస్తుంది. ప్రభుత్వం కొన్ని నిర్దేశిత అంశాలపై ఆంక్షలు విధించవచ్చు. జల్లెడ పట్టవచ్చు(స్క్రీనింగ్). నేపాల్ ప్రభుత్వం సోషల్ మీడియాపై ఆంక్షలు విధించినప్పుడు ఎలాంటి స్పందన వచ్చిందీ మనమంతా చూశాము.అందుకనే దానితో(సోషల్ మీడియా) చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. కానీ స్క్రీనింగ్‌కు అవకాశం ఉంది. ఉదాహరణకు అశ్లీలం (పోర్నో) వ్యాపించరాదు. కొన్ని నిర్దేశిత పనులను ప్రభుత్వం చేయగలదు. చేయవచ్చు. ప్రభుత్వం కూడా టిక్‌టాక్ నిలుపుదలకు ప్రయత్నించింది. ఆ ప్రయత్నం ఎంతమేరకు విజయవంతమైనదీ మనం చూశాం. ఎందుకంటే ఆధునిక సాంకేతిక, సమాచార అనుసంధాన యుగంలో ఇలాంటి పనులను విజయవంతంగా చేపట్టలేరు. అంతెందుకు, కుటుంబ పెద్ద కుటుంబంపై ఆంక్షలు విధించడమంటే ఆయన ఆలోచనలను వారిపై రుద్దుతున్నట్టుగా భావిస్తారు నవతరానికి చెందినవారు. వారిలో సంస్కారాన్ని సరైన మార్గంలో పాదుగొల్పాలి. మీరు యువతీయువకులతో చర్చించాలి. నీవు ఏం చెప్పాలనుకుంటున్నావు? నీ స్నేహితులెవరు? వీటికి సంబంధించి నేనేమైనా నీకు సలహాలు

ఇవ్వవచ్చునా? ఇలా మీరు వారితో చర్చించాలి. ఎందుకంటే యువత, చిన్నారులు సైతం జీవితానికి సంబంధించిన అనేక విషయాలను ఇట్టే అర్థం చేసుకుంటున్నారు. అవి ఎలాంటివంటే వారి వయసులో ఉన్నప్పుడు మీరు అర్థం చేసుకోలేకపోయినవి. కనుక స్నేహపూర్వకంగా వారిలో సంస్కారాన్ని పాదుగొల్పాలి. సోషల్ మీడియా వల్ల వచ్చే కీడును చెప్పాలి. అదేసమయంలో దాని వల్ల కలిగే ఉపయోగాలను గురించి కూడా చర్చించాలి. నీకు అందుబాటులో లేని సమాచారం సోషల్ మీడియాలో దొరుకుతుంది. ఆ విధంగా సోషల్ మీడియాను వినియోగించుకోమని చెప్పాలి. కనుక సోషల్ మీడియా సద్వినియోగం, దుర్వినియోగంపై చర్చించాలి. కానీ అదెలా? ఎప్పుడూ కూడా స్వీయనియంత్రణ అత్యంత ముఖ్యమైనది. ఆంక్షలు విధించడం వల్ల ప్రయోజనం ఉంటుందని నేను అనుకోవడం లేదు. అది ముమ్ముందు సమస్యను సృష్టిస్తుంది. మానసిక సమస్యలను సృష్టిస్తుంది. అప్పుడు మీరు వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. అందుకు బదులుగా సమాచారం వెల్లువలా వచ్చిపడుతున్నప్పుడు నన్ను నేను నియంత్రించుకునే శిక్షణ నేను పొందాలి. అలాంటి ఒక సంస్కారాన్ని వారిలో పాదుగొల్పాలి. ఇదే విషయాన్ని కుటుంబంలో చర్చించుకోవాలి. మా కుటుంబ ప్రబోధన్‌లో ఇలాంటి విషయాలను చర్చిస్తాం. యువ శిబిరాల్లోనూ చర్చిస్తాం. మా సంఘ శిక్షావర్గలో ఒక వయసు మళ్లిన వ్యక్తి స్వయంసేవకులతో చర్చిస్తారు. ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొన్ని ప్రాంతాలలో ఒక అనుభవజ్ఞుడైన వ్యక్తి స్వయం సేవకులతో చర్చిస్తారు. వ్యక్తిగత విషయాలు, చివరకు లైంగికాంశాలకు సంబంధించిన విషయాలు, స్నేహితులతో సంబంధాలు సైతం చర్చకు వస్తుంటాయి. అప్పుడిక వారు తమ మనసులోని మాటను బైటపెడతారు. కనుక ఈ విధంగా మనం యువతను సరైన దారిలో పెట్టాలి.

చివరి దశలో ఉన్న నక్సలిజాన్ని ఎలా చూడాలి?

అది 180 జిల్లాల నుంచి ప్రస్తుతం 11 జిల్లాలకు కుదించుకొనిపోయింది.

ఎక్కడైతే నక్సలిజం పుట్టిందో అక్కడ ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉంది. ఈ చారిత్రక వాస్తవాలను అర్థం చేసుకోవడంలో వారు(నక్సలైట్లు) ఎక్కడ విఫలమయ్యారు?

వారు(నక్సలైట్లు) ఎక్కడ విఫలమయ్యారనే విషయానికి వస్తే వారు సమాజంలో త్వరితగతిన చోటు చేసుకున్న మార్పులను అర్థం చేసుకోలేక పోయారు. వారు ఇంకా పాతకాలంలోనే ఉండిపోయారు. ఇది మొదటి విషయం. ఇలాంటి చర్యలతో(హింసాత్మక) సమాజం భయభ్రాంతులకు గురవుతుందని, ప్రభుత్వం దిగి వస్తుందని వారు భావించారు. కానీ అలా జరగలేదు. కానీ వారేం చేశారు? ఇతర రంగాలలోకి చొరబడ్డారు. అర్బన్ నక్సల్స్ పుట్టుకొచ్చారు. కనుక అటవీ ప్రాంతానికి చెందిన నక్సలిజం, పర్వత ప్రాంతాలకు చెందిన నక్సలిజం, గిరిజన ప్రాంతాలకు చెందిన నక్సలిజం పట్టణ ప్రాంతాలకు వలసపోయింది. ఈ పరిణామం అత్యంత ప్రమాదకరమైనది.

ప్రతీ ఉద్యమానికి ముగింపు ఉంటుంది...

అసలు అది ఉద్యమమా లేకుంటే విప్లవమా? అలా పిలవగలమా?

దానిని విప్లవం అని పిలవలేం. నిజమే. అది ప్రతిక్రియ మాత్రమే. ఎందుకంటే అది ఒక నిర్దేశిత పరిస్థితికి చెందినది. వారికి(నక్సలైట్లు) సమాజం పట్ల వల్లమాలిన ప్రేమ ఉండవచ్చు. వారు సమాజంలో అన్యాయంతో పోరాడారు. వారు సమాజంలో దోపిడీని చూశారు. వారు అందుకు స్పందించాలని కోరుకున్నారు. కానీ పంథా (స్పందించిన తీరు) తప్పు. వారి ఆందోళన తప్పు అని నేను అనడంలేదు. దోపిడీని మనం అంగీకరించాలా? లేదు. అన్యాయాన్ని మనం అంగీకరించాలా? లేదు. ఈ అరిష్టాలను తొలగించాలి. కానీ అందుకు ఒక ప్రజాస్వామ్య సమాజంలో ఎలాంటి పద్ధతి, ఎలాంటి పంథా ఉంటుంది? కనుక ఆయుధాలు చేతుల్లోకి తీసుకొని విప్లవం పేరిట సామాన్య ప్రజలను చంపడం బెడిసిగొట్టే వ్యవహారం. వారు దాదాపు 30 ఏళ్ల నక్సలిజం ప్రస్థానంలో చిట్టచివరకు ఏం సాధించారు? మీరు తెలంగాణ నుంచి వచ్చారు. గద్దర్‌కు ఎలాంటి అనుభవం ఎదురైంది? చిట్టచివరకు ఏమైంది?

ఆయన కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు.

అంతిమంగా జరిగేది అదే. యుక్త వయసులో ఉడుకు రక్తం పొంగుతున్న తరుణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీరు(నక్సలైట్లు) బలప్రయోగం చేశారు. అటవీ రేంజర్లు, సామాన్య ప్రజలతో పాటు అంతంత మాత్రపు వేతనంతో ఎవరిని దోచుకోకుండా విధులు నిర్వర్తిస్తున్న ఒక పోలీసును చంపేశారు. ఇది విప్లవం అనే ఆలోచనకు తప్పుడు అర్థాన్ని ఇస్తున్నది. అది మన దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడా కూడా ఏ విధంగానూ సాయపడింది లేదు. చిన్నదేశాల్లో అక్కడి ప్రభుత్వాలు కొంతకాలంపాటు మద్యాన్ని నిషేధించాయి. ఆ తర్వాత మద్యం మళ్లీ అందుబాటులోకి వచ్చింది. సామాజిక మార్పు, సామాజిక పరివర్తన జరిగి తీరాలి. మనం అన్యాయానికి, దోపిడీకి చోటు ఇవ్వకూడదు. సామాన్య ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించాలి. అందుకోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలి.

వారు(నక్సలైట్లు) ఎక్కడ విఫలమయ్యారనే విషయానికి వస్తే వారు సమాజంలో త్వరితగతిన చోటు చేసుకున్న మార్పులను అర్థం చేసుకోలేకపోయారు. వారు ఇంకా పాతకాలంలోనే ఉండిపోయారు. ఇది మొదటి విషయం. ఇలాంటి చర్యలతో(హింసాత్మక) సమాజం భయభ్రాంతులకు గురవుతుందని, ప్రభుత్వం దిగి వస్తుందని వారు భావించారు. కానీ అలా జరగలేదు. కానీ వారేం చేశారు? ఇతర రంగాలలోకి చొరబడ్డారు. అర్బన్ నక్సల్స్ పుట్టు కొచ్చారు. కనుక అటవీ ప్రాంతానికి చెందిన నక్సలిజం, పర్వత ప్రాంతాలకు చెందిన నక్సలిజం, గిరిజన ప్రాంతాలకు చెందిన నక్సలిజం పట్టణ ప్రాంతాలకు వలసపోయింది. ఈ పరిణామం అత్యంత ప్రమాదకరమైనది. వారు ఆయుధాలను బాహాటంగా, తరచుగా ఉపయోగించడం

లేదు కానీ, సమాజంలో వ్యక్తులను ప్రభావితం చేయడం ద్వారా ప్రభుత్వాలను మార్చడానికి ప్రయత్నించారు. అలాంటి ఒక ప్రయత్నం వెనిజులా లాంటి దేశాల్లో పనిచేసింది. భారత్‌లో కూడా అదే జరుగుతుందని వారు కలలు కంటున్నారు కానీ, అది జరిగే పనికాదు.

స్వదేశీ భావనకు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గొప్ప స్థానం ఉంది. అది మనల్ని వర్తమానం నుంచి 2047కు ఎలా నడిపిస్తుంది?

ప్రతీ దేశమూ తన ఆర్థిక విధానంలో కొంత చోటును స్వదేశీకి కేటాయిస్తుంది. అది ఆయా దేశాల అనుభవం, సామర్థ్యం, దక్షత మీద ఆధారపడి ఉంటుంది. జపాన్ కొన్ని రంగాల్లో స్వదేశీని అవలంబిస్తున్నది. ప్రతీ దేశం స్వదేశీ భావనను అనుసరిస్తుంది. బీ అమెరికన్... బై అమెరికన్ (అమెరికన్‌లా వ్యవహరించు... అమెరికా వస్తువులు కొను) అని అమెరికా కూడా నినాదం ఇచ్చింది. ఇది స్వదేశీలో భాగమే. జపాన్ స్వదేశీని ఆర్థిక జాతీయత అని ప్రకటించుకుంది. ఆ విధంగా ప్రతీ దేశమూ స్వదేశీకి సంబంధించి తనదైన ధోరణిని కలిగి ఉంది.

మనదేశంలో స్వదేశీ అంటే భవిష్యత్తులో సంపదను పోగుచేసుకునేందుకు ఉపకరించే ఆర్థిక విధానం లేదా స్వావలంబన మాత్రమే కాదు. దానికి జీవితంలో ఇతర విషయాలతో సంబంధం ఉంది. అది ప్రధానంగా ఆర్థిక విధానంతో ముడిపడి ఉంటుంది. 200 సంవత్సరాల బ్రిటీష్ పాలనలో దోపిడీకి గురయ్యాం. అందుకనే మన పరిశ్రమలు, మన ఆర్థిక చట్రం అస్తవ్యస్తమైపోయాయి. కనుక దేశానికి స్వరాజ్యం సిద్ధించిన సంవత్సరంలో పుంజుకోవడానికి ప్రయత్నించాం. మనం ఎలాంటి ప్రయత్నం చేయలేదని నేను అనడం లేదు. కొంతవరకు చేశాం. కానీ బహుళజాతి కంపెనీలు, రక్షణ రంగంలో దిగ్గజాలైన దేశాల వల్ల, సాంకేతికత పట్ల మన పరాధీనత అనేక సంవత్సరాలు కొనసాగింది. దీనికి అడ్డుకట్ట వేయాలి. కొన్ని రంగాల్లో పరిమితులు విధించుకోవాలి. మనం మరికొన్ని రంగాల్లో మన సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ఉదాహరణకు అంతరిక్ష సాంకేతికతలో మనం వెనుకబడిలేం. అగ్రస్థానాల్లో ఉన్న మూడు దేశాల్లో ఒకటిగా ఉన్నాం. సూపర్ కండక్టర్‌ను కూడా ఉత్పత్తి చేశాం. పరం కంప్యూటర్లు, సూపర్ కంప్యూటర్లను కూడా సృష్టించాం. మెడికల్ సైన్స్‌లో మనం ఏమంత వెనుకబడిలేం. అనేక రంగాల్లో స్వావ లంబన సాధిస్తున్నాం. మనం పటిష్టంగా మారుతున్నాం. ఇక్కడే ప్రోత్సాహం కావాలి. ఎందుకంటే శాస్త్ర, సాంకేతిక రంగాలు సహా ప్రతీ రంగంలోనూ మన యువ పరిశోధకులు ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడగలరు. కనుక వారికి సమాజం నుంచి, ప్రభుత్వం నుంచి మద్దతు కావాలి. అందుకు సంబంధించిన అంశాలను ఒక దారిలో పెట్టాలి. ఇదంతా జరగాలి. ప్రధానమంత్రి ఆత్మనిర్భరత గురించి మాట్లాడినప్పుడు ఈ విషయాలనే ప్రముఖంగా ప్రస్తావించారు. ఆయన పంచప్రాణాస్, తదితరాల గురించి కూడా మాట్లాడారు. మరొక విషయం, స్వదేశీ ఉద్యమం స్వాతంత్ర్య ఉద్యమానికి చోదకశక్తి మాత్రమే కాదు. అది మన ఆత్మగౌరవం, మన భాష, మన సంస్కృతి, మన ప్రకృతికి సంబంధించినది. కనుక ఈ అంశాలు కూడా చాలా ముఖ్యమైనవి. కేవలం ఆర్థిక వ్యవస్థ, సంపద సృష్టి, శాస్త్ర, సాంకేతికతలు మనకు ఏ విధంగానూ సాయపడవు. వాటికి జీవితంలోని ఇతర అంశాల మద్దతు కావాలి. కనుక దీనికి సంపూర్ణత కావాలి.

మనదేశంలో స్వదేశీ అంటే భవిష్యత్తులో సంపదను పోగుచేసుకునేందుకు ఉపకరించే ఆర్థిక విధానం లేదా స్వావలంబన మాత్రమే కాదు. దానికి జీవితంలో ఇతర విషయాలతో సంబంధం ఉంది.

అంతరిక్ష సాంకేతికతలో మనం వెనుకబడి లేం. అగ్రస్థానాల్లో ఉన్న మూడు దేశాల్లో ఒకటిగా ఉన్నాం. సూపర్ కండక్టర్‌ను కూడా ఉత్పత్తి చేశాం. పరం కంప్యూటర్లు, సూపర్ కంప్యూటర్లను కూడా సృష్టించాం. మెడికల్ సైన్స్‌లో మనం ఏమంత వెనుకబడి లేం. అనేక రంగాల్లో స్వావలంబన సాధిస్తున్నాం. మనం పటిష్టంగా మారుతున్నాం. ఇక్కడే ప్రోత్సాహం కావాలి.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది కార్యక్రమాల పట్ల హిందువుల స్పందన ఎలా ఉంది? ఈ సందర్భంగా హిందూ సమాజానికి మీరు ఇచ్చే సందేశం ఏమిటి?

ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలను సమాజంలో అన్ని వర్గాల ప్రజలు స్వాగతించారు. మేము సమాజంలోని సమూహాలతో వేర్వేరు స్థాయుల్లో సంభాషిస్తున్నాం. మొదటగా మన స్వయంసేవకులు ఇంటింటికి వెళుతున్నారు. ప్రజలతో సమావేశమవుతున్నారు. వారు నగదును సేకరించడంలేదు. వారు ఇదిగో ఈ పని చేయండి అని ప్రజలకు చెప్పడంలేదు. వారు 10 నుంచి 15 నిమిషాలపాటు నిర్దేశిత అంశంపై ప్రజలతో చర్చిస్తున్నారు. మేం పంచపరివర్తన గురించి తెలియజేస్తున్నాం. 99 శాతం ప్రజలు ఈ కార్యాచరణను స్వాగతిస్తున్నారు. చాలా మంచి కార్యక్రమం అంటున్నారు. ముందుకు వస్తున్నారు.

వందేళ్లుగా సమాజ అభ్యున్నతిలో ఆర్ఎస్ఎస్ భాగస్వామ్యాన్ని ప్రతీ ఒక్కరూ కొనియాడు తున్నారు. శతాబ్ది వేడుకలను స్వాగతిస్తున్నారు. వారిలో చాలా మంది శాఖకు రావడంలో తమకు సమయం ఉండటంలేదని చెబుతున్నారు. అదే సమయంలో మీరు చేసేది చాలా మంచి పని అని అంటున్నారు. ప్రజల వైపు నుంచి కనీసం ఈ విధమైన ప్రోత్సాహం ఉంది. ప్రజల నుంచి వచ్చిన సానుకూల స్పందనతో మన స్వయంసేవకులు సంతోషంగా ఉన్నారు. రెండవది, పంచపరివర్తన విషయానికి వస్తే వాటిని పాటించమని ప్రజలకు చెప్పాం. అందుకు బదులుగా ఆచరించడానికి ప్రయత్నిస్తామని వారు తెలిపారు. ఆ తర్వాత హిందూ సమాజంలో వేర్వేరు సమూహాల పెద్దలను కలుస్తున్నాం. సామాజిక సద్భావన పనిలో భాగంగా వారితో సమావేశమవుతున్నాం. హిందూ సమాజం గురించి ఆలోచించినప్పుడు వేర్వేరు సమూహాల పెద్దలను ఆర్ఎస్ఎస్ ఒకే వేదిక మీదకు తీసుకొనిరాగలదని వారు అన్నారు. సాధు, సంతులు మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. హిందూధర్మాన్ని

ఆర్ఎస్ఎస్ కాపాడుతోందని వారు దీవించారు. మద్దతు ఇస్తున్నారు. కడకు రాజకీయ రంగంలో వేర్వేరు పార్టీలకు చెందిన వారు రాజకీయాలకు అతీతంగా ఆర్ఎస్ఎస్ శాఖలు, శిబిరాలు, కార్యక్రమాల నిర్వహణకు తమ స్థలాలను కేటాయిస్తున్నారు. ఎందుకంటే రాజకీయ పార్టీలకు పరిమితం కాకుండా జాతీయతా భావనతో మనం ముందుకు సాగుతున్నాం కాబట్టి. వారూ(రాజకీయ పార్టీలు) మనమూ ఎలాంటి దాపరికం లేకుండా ఉంటున్నాం. పరిశ్రమలు, వాణిజ్య రంగాలకు చెందిన వ్యక్తులను కలుస్తున్నాం. సినిమారంగానికి చెందినవారిని, వైద్యులను, న్యాయ వాదులను కలుస్తున్నాం.

నేను చండీగఢ్‌లో మాజీ సైనికోద్యోగులతో సమావేశ మయ్యాను. అన్ని వర్గాల ప్రజలను కలుసుకుంటున్నాం. సర్‌సంఘచాలక్‌జీ ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, ముంబై లాంటి ప్రధాన నగరాల్లో ప్రజలతో సమావేశమవుతున్నారు. అన్ని చోట్లా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. మూడు నుంచి నాలుగు గంటలపాటు కూర్చోవడానికి సిద్ధపడే వస్తున్నారు. వారి ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకిస్తున్నారు. ప్రశ్నలు అడుగుతున్నారు. సర్‌సంఘచాలక్‌జీ నుంచి అప్పటికప్పుడు నేరుగా సమాధానాలు పొందుతున్నారు. నాకు తెలిసి దేశంలో మరే ఇతర సంస్థకు చెందిన అధిపతి ఇలా మూడేసి గంటల సేపు కూర్చొని ప్రసంగించడం, ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, ప్రజలు కూడా అంతే శ్రద్ధాసక్తులతో కూర్చోవడం జరిగింది లేదు. ప్రకృతి సంక్షేమం, పురోగతికి సంబంధించిన అంశాలపై సమావేశం, ఇష్టాగోష్టిలో సరికొత్త పంథాకు మనం తెరతీశాం. దీనికి ప్రజలతో పాటుగా సమాజమూ ఆమోదముద్ర వేసింది. అలాగని ఇదేదో

హోసబళేతో జాగృతి సంపాదకుడు

కొత్త సందేశం ఇవ్వడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నించదు. ఇదివరకే సందేశం ఇచ్చింది. ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ అని స్వామి వివేకానంద అన్నారు. దాని అర్థం మోక్షాన్ని పొందుతూనే ప్రపంచానికి మంచి చేయమని. ధర్మో రక్షతి రక్షితః అని మన పెద్దలు చెప్పారు. మీరు ధర్మాన్ని కాపాడితే అది మిమ్మల్ని కాపాడుతుంది. మన స్వాతంత్ర్య సమర యోధులు వందే మాతరం, భారత్‌మాతాకీ జై అన్నారు. ఎందుకని? జన్మభూమిని పూజించాలని.

వందేళ్లుగా సమాజ అభ్యున్నతిలో ఆర్ఎస్ఎస్ భాగస్వామ్యాన్ని ప్రతీ ఒక్కరూ కొనియాడుతున్నారు. శతాబ్ది వేడుకలను స్వాగతించారు.

ఆర్ఎస్ఎస్, దాని సంస్థాగత కార్యకలాపాలకు సంబంధించిన విషయం కాదు. ఇది యావత్ దేశానికి సంబంధించిన కార్యక్రమం. మనం మన వనరులను విస్తరింపజేయాలి. మనం మన వనరులను పెంచాలి. మనం ఒకే సమాజంగా జీవించాలి. మనం ఇలా అంటున్నప్పుడే ఈ రకమైన సానుకూల ప్రకంపనలు దేశమంతటా ఉన్నాయి. స్పందన (ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలకు) అద్భుతంగా ఉంది.

ఇక సందేశం అంటారా.. కొత్త సందేశం ఇవ్వడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నించదు. ఇదివరకే సందేశం ఇచ్చింది. **ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ** అని స్వామి వివేకానంద అన్నారు. దాని అర్థం మోక్షాన్ని పొందుతూనే ప్రపంచానికి మంచి చేయమని. **ధర్మో రక్షతి రక్షితః** అని మన పెద్దలు చెప్పారు. మీరు ధర్మాన్ని కాపాడితే అది మిమ్మల్ని కాపాడుతుంది. మన స్వాతంత్ర్య సమరయోధులు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అన్నారు. ఎందుకని? జన్మభూమిని పూజించాలని. వచ్చే 50 సంవత్సరాలు భారతమాతనే పూజించండి. మిగతా దేవుళ్లను పక్కన పెట్టండి అని స్వామి వివేకానంద అన్నారు. కనుక మనకు కావాలంటే అనేక సందేశాలు ఉన్నాయి. అయితే వాటిని మనం మనసా, వాచా, కర్మణా, అనుసరిస్తామా? అనేది ఇక్కడ ప్రశ్నగా మిగిలింది. కానీ, మనం వాటిని ఆచరించాలి. ఆచరణ ముఖ్యమైనది. కనుక మీకు తెలిసిన మంచి పనిని ఆచరించండి అనేది ఆర్ఎస్ఎస్ ఇచ్చే సందేశం. సమాజ సంక్షేమానికి సంబంధించి మీ దగ్గర చింతన ఉంటే మా దగ్గర బృందం (దాని కార్యాచరణకు) ఉంది. మీ దగ్గర బృందం ఉంటే మా దగ్గర ఇతివృత్తం ఉంది. మంచి పని చేసేవారికి మద్దతు ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం. మీరు ఏదైనా మంచి పని అనుకున్నప్పుడు, దానికి మద్దతు కోరుకున్నప్పుడు అందుకు అండగా ఆర్ఎస్ఎస్ ఉంటుంది. మీరు ఆర్ఎస్ఎస్‌తో కలవకుండానే సమాజానికి మేలు జరిగే పని చేస్తున్నప్పుడు మీరు చేస్తున్నది ఆర్ఎస్ఎస్ పని అవుతుంది. దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు.

జాగృతికి మా శుభాకాంక్షలు.

ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న దత్తాత్రేయ హొసబళే కర్ణాటకలోని శివమొగ్గలో, 1955లో జన్మించారు. వారిది ఆర్ఎస్ఎస్ కుటుంబమే. 1968లో స్వయంసేవక్‌గా జీవితం ప్రారంభించిన హొసబళే 1972లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ బాధ్యతలు చేపట్టారు. జేపీ సంపూర్ణ విప్లవంలో భాగస్థులయ్యారు. అత్యవసర పరిస్థితి కాలంలో మీసా కింద అరెస్టయి ఏడాది పాటు జైలు జీవితం గడిపారు. ఆయన ఆంగ్ల సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. బహు భాషావేత్త. కన్నడ మాస పత్రిక 'అసీమా' వ్యవస్థాపక సంపాదకులు.

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల వాటాల అంశం కొత్త మలుపు తీసుకొంది. ఇరు రాష్ట్రాల మధ్య సాగాల్సిన వాదనలు, ఇప్పుడు తెలంగాణలో రెండు పార్టీల మధ్య కొనసాగుతున్నాయి. వ్యవహారం నీళ్లు- నిప్పులుగా సాగుతోంది. సమస్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, సలహాలు, సూచనలు నర్వ సాధారణం కాగా,రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉమ్మడిగా, ఐక్యంగా పోరాడాల్సిన పార్టీలు బాధ్యతలు మరిచిపోయాయి. ఒకరిపై ఒకరు కారాలు, మిరియాలు నూరుకుంటున్నాయి. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ల పేరుతో ప్రజలను సందిగ్ధంలో పడేస్తున్నాయి.

నీటి వాటాలపై శుష్కప్రి

తెలంగాణకు గోదావరి, కృష్ణానదీ జలాల్లో రావాల్సిన వాటాలపై ఎవరి లెక్కలు వారు చెబుతున్నారు. శీతకాలంలోనూ రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన నల్లమల సాగర్ ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అయితే గత బీఆర్ఎస్ హయాంలో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తీసుకొన్న నిర్ణయాల వల్లే అన్యాయం జరిగిందని అధికార పక్షం విమర్శిస్తోంది. ఇదే విషయంపై రెండు పార్టీలు వేరువేరుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చాయి. ప్రభుత్వం తరఫున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈనెల 3వ తేదీన శాసనసభలో, ఆ మరునాడు బీఆర్ఎస్ తమ కార్యాలయం (తెలంగాణ భవన్‌లో) పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు తమ లెక్కలు చెప్పుకున్నారు. కానీ, ఇద్దరి లెక్కలకు పొంతనే కనిపించడం లేదు. ఎవరికి వారే తమకు లాభం చేకూరేలా ప్రదర్శనల ద్వారా ప్రజలను అయోమయంలో పడేస్తున్నారు.

కృష్ణా బేసిన్‌పై ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, పాలమూరు ప్రాజెక్టులో కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తి పోయలేదని ఆ శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ తరువాత మొదలుపెట్టిన కాళేశ్వకర్ట పూర్తయినా, పాలమూరు ఇప్పటికీ అసంపూర్ణంగానే ఉందని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం విమర్శల వర్షం కురిపించారు. కాళేశ్వరం కోసం రూ.90 వేల కోట్లు ఖర్చు చేసిన ఆ ప్రభుత్వం, పాలమూరుకు కేవలం రూ. 27 వేల కోట్లు మాత్రమే అవసరమైన దానిపట్ల పక్షపాతం చూపించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు వచ్చాయంటూ, దానిని హడావిడిగా పూర్తి చేశారని, పాలమూరు ప్రాజెక్టుకు మాత్రం ఇప్పటికీ అనుమతులు పూర్తిగా రాలేదని, దీనికి ఎవరు బాధ్యులని ఉత్తమ్ ప్రశ్నించారు.ఇంత ప్రధాన అంశంపై చర్చ జరుగుతుండగా బీఆర్ఎస్ సభ్యులు సభకు ఎందుకు రావడం లేదని నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్..ఇటీవల ఆర్భాటంగా సమావేశం పెట్టి కృష్ణా, గోదావరి జలాలపై ఎన్నో అనుమానాలు వ్యక్తం చేశారని, ఇప్పుడు ఆ వివరాలపై చర్చించేందుకు సభకు రావడం లేదని నిరస తెలిపారు.. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు కేటాయించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం సంతకాలు చేసిందని, తెలంగాణకు 34 శాతం నీళ్లు చాలు అని కేసీఆర్, హరీష్‌రావు సంతకాలు చేశారని ఇది తెలంగాణకు జరిగిన తీవ్ర అన్యాయం అన్నారు. తాను కుర్చీ వేసుకొని దేవరకద్ర ప్రాజెక్టు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి హోదాలో అట్టహాసంగా ప్రకటించిన కేసీఆర్ దాని సంగతే మరచారని అన్నారు.

కృష్ణా నీటిలో చుక్క నీరు వదులుకోబోమని, తెలంగాణ హక్కులను కాపాడటంలో రాజీపడబోమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక బడ్జెట్‌లో నీటిపారుదలకు రూ. 24 వేల కోట్లూకేటాయించగా, అందులో రూ.16 వేల కోట్లు వడ్డీలకే వెళ్లాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును 2 నుంచి 3 టీఎంసీలకు పెంచి, పాలమూరు ప్రాజెక్టును మాత్రం 1.5 టీఎంసీల నుంచి 1టీఎంసీకి కుదించి పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదే అంశంపై ప్రభుత్వానికి ప్రతిగా కౌంటర్‌గా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చిన మాజీ మంత్రి హరీష్‌రావు, ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాజెక్టుల పట్ల కుట్రపూరితంగా నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు.

తెలంగాణకు అసలైన విలన్ కాంగ్రెస్ పార్టీ అని, రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, పాల మూరుకు మరణశాసనం రాసిందే కాంగ్రెస్ పార్టీ అని, కానీ,అది తన తప్పులను కప్పిపుచ్చుకుంటో దని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలోనూ కాంగ్రెస్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, 11వ షెడ్యూల్‌లో పాలమూరు-రం గారెడ్డి ప్రాజెక్టును చేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించారని, కేసీఆర్ ప్రశ్నించిన తరువాత,'ప్రాజెక్టులను అప్పగించబోం' అంటూ అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని తమ ప్రభుత్వ హయాంలో 11 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు పంపి, ఏడు ప్రాజెక్టులకు అన్ని అనుమతులు సాధించామని, రెండేళ్ల కాంగ్రెస్

పాలనలో ఒక్క డీపీఆర్ కూడా పంపలేదని అన్నారు. పైగా, మూడు డీపీఆర్‌లు వెనక్కి తెచ్చారని హరీశ్‌రావు ఆరోపించారు. తమ ప్రభుత్వం సక్సెస్ రేట్ 60శాతం అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం సక్సెస్ రేట్ మైనస్ 30శాతం అన్నారు.ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రికి కృష్ణాజలాలపై అవగాహన లేదని అన్నారు..

భారతీయ జనతాపార్టీ ఈ రెండు పార్టీల వ్యవహారశైలిని, వాటి విమర్శ, ప్రతి విమర్శలను జాగ్రత్తగా గమనిస్తోంది. అవి రాష్ట్రానికి అన్యాయం చేశాయని, చేస్తున్నాయని, అవి బయట పడకుండా తప్పించుకునేందుకే వాస్తవాలు చెప్పకుండా ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శిస్తోంది. ప్రస్తుత పరిస్థితులకు, జరుగుతున్న నష్టాలకు రెండు పార్టీలదే బాధ్యత అని వాదిస్తోంది. నీటి కేటాయింపులపై బీజేపీ సభ్యులు చర్చలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, గతంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులు, ప్రజలకు ఉపయోగపడే తీరును సభా సాక్షిగా వినిపిస్తున్నారు. రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులపై అధ్యయనం చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక కమిటీ వేసి ప్రాజెక్టులను సందర్శించేందుకు సిద్ధమయ్యారు.

శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా బీజేపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టులు, నిర్వాసిత రైతులకు పరిహారం, సాగునీటి సౌకర్యాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు బీజేపీ ఎమ్మెల్యేలు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతుల సమస్యలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సభలో లేవనెత్తారు. ఆ ప్రాజెక్ట్ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు లక్షల రూపాయల పరిహారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. పదేళ్లు గడిచినా.. నీళ్లు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నిధులు విడుదల చేసి వెంటనే భూనిర్వాసితులకు పరిహారంగా చెల్లించాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. జైనాథ్‌పూర్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రిని కలిసినా ఫైళ్లు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు మండలాల్లో సాగునీరు అందుతుందన్నారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ డిమాండ్ చేశారు. అలాగే ఫ్రిఫ్రీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువల ఆధునీకరణకు రూ. 2 వేల కోట్లు కేటాయించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోనూ, స్వరాష్ట్రంలోనూ నిజామాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవంక, రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తన దారిలో తాను ముందుకు వెళ్తోంది. జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలవనరుల కమిషన్ చైర్మన్‌గా 13 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. 2025 జులై 16న జరిగిన ముఖ్యమంత్రుల స్థాయి సమావేశంలో తీసుకొన్న నిర్ణయం మేరకు నియమించిన ఈ కమిటీలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు చొప్పున అధికారులు సభ్యులు ఉన్నారు. ఈ కమిటీ రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాద సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను సూచించనుంది. సమావేశాల్లో భాగంగా సభ్యులు వ్యక్తపరిచిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మూడు నెలల్లో నివేదిక సమర్పించాలని కేంద్రప్రభుత్వం గడువు విధించింది.

యాలు.. శూన్యహస్తాలు

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068



భాష కేవలం భావ వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదు. అది ఒక జాతి అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీక. ఈ సత్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పేలా, ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరులో జనవరి 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగిన 'మూడో ప్రపంచ తెలుగు మహాసభలు -2026' ఒక అద్భుత ఘట్టంగా ఆవిష్కృతమయ్యాయి. శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగర ప్రాంగణం తెలుగుదనంతో, సరికొత్త శోభతో వెలిగిపోయింది. చిన్నా పెద్దా తేడా లేకుండా తరలివచ్చిన భాషాభిమానులతో ఆ ప్రాంతం పులకించింది. అవధానుల పద్యధారలు, భాషా పండితుల చమత్కారాలు, కవుల నుడికారాలు వినిపిస్తుంటే.. మరో పక్క అన్నమయ్య సంకీర్తనలకు యువతులు గొంతు కలపడం, కళాకారుల నాట్య విన్యాసాలు మనసులను కట్టిపడేశాయి. మాతృభాషాభివృద్ధికి పునరంకితం కావాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు.

భుతుకుతెరవు కోసం ఆంగ్లం అవసరమేనని,అదే సమయంలో మాతృభాషలో చదివితే ఎంతో రాణింపు ఉంటుందని, అందుకు ఎందరో ఉదాహరణగా కనిపిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పెరుగుతున్న సాంకేతికతతో తెలుగును పరిరక్షించుకోవచ్చని అన్నారు. 'రెండు తెలుగు రాష్ట్రాలు భౌగోళికంగా వేరైన భాష, ఆత్మ ఒక్కటే. హిందీ మాట్లాడే వారి తరువాత రెండు రాష్ట్రాలు ఉన్నది తెలుగువారికే. ఇరు ప్రాంతాల వారు తెలుగును కాపాడుకుంటూనే, సమస్యలను పరస్పర సహకారంతో పరిష్కరించుకొంటూ కలసి ఎదుగుదాం' అని పిలుపునిచ్చారు. తెలుగువారి ఐక్యత కోసం ఎందరో ఎన్నో త్యాగాలు చేశారని, భాషాప్రయుక్త రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు బలిదానమివ్వగా, రెండు తెలుగు రాష్ట్రాలను కలిపేందుకు బూర్గుల రామకృష్ణారావు పదవీ చేసి చిరస్మరణీయులు అయ్యారని అన్నారు.

భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదని, దానికి ఒక ప్రవంచాన్ని సృష్టించగలిగే శక్తి ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమడిఘంటం నరసింహా అన్నారు. మాతృభాషను వాడకంలో ఉంచకపోతే అది జీవం లేని మనిషిలా క్షీణించి పోతుందని హెచ్చరించారు. న్యాయ, విద్యా వ్యవస్థల్లో తెలుగు ఆవశ్యకతను ఆయన నొక్కిచెబుతూ, జిల్లాకోర్టుల స్థాయి వరకు కార్యకలాపాల్లో పాఠశాలల్లో తెలుగు బోధనను తప్పనిసరి చేయాలని సూచించారు. 'తెలుగు ఉపాధ్యాయులకు సమాజంలో తగిన గౌరవం దక్కడం లేదని, ఆ పద్ధతి మారి వారిని గౌరవించుకుంటేనే భాషను కాపాడుకోగలం.పిల్లలకు చిన్నతనం నుంచే చందమామ కథలు, సామెతలు పిల్లలకు నేర్పితే అవి వారి వ్యక్తిత్వ నిర్మాణంలో భాగమవుతాయి'అని జస్టిస్ నరసింహ తల్లిదండ్రులకు సూచించారు.

తెలుగు భాషకు తిరిగి పూర్వవైభవం తీసుకురావాల్సిన గురుతర బాధ్యత ప్రజాప్రతినిధుల పైనే ఉందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. 'ఆంగ్లేయుల పాలన ప్రభావం మన న్యాయ, వైద్య విద్యలపై ఇంకా బలంగానే ఉందని, అందుకే చట్టాలు, తీర్పులు ఆ భాషలోనే ఉంటున్నాయని, రాచరిక, జమీందారీ పాలనల్లో కూడా భాషకు కలగని ముప్పు, ప్రస్తుతం పొంచి ఉందని ఆందోళనవ్యక్తం చేశారు. ఈ మహా సభలు ఉపన్యాసాలకు, ఇక్కడ మేధావులు చర్చించి చేసే తీర్మానాలు కాగితాలకు పరిమితం కాకూడదని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఆచరణలో పెట్టేలా కృషి చేయాలని జస్టిస్ రాయ్ అన్నారు. తెలుగువారు ప్రపంచంలో ఏ మూల ఉన్నా, అమ్మభాషలోనే మాట్లాడాలని, భావితరాలకు తెలుగు మాధుర్యాన్ని పంచాలని పిలుపునిచ్చారు. ఆంగ్ల మాధ్యమ చదువులే అయినా, పాఠ్యాంశాల్లో తెలుగును తప్పనిసరి చేయాలని ప్రభుత్వాలకు సూచించారు. ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తేనే తెలుగు భాష మళ్ళీ వెలుగుతుందన్నారు.భాష పరిరక్షణ విషయంలో గుజరాత్ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.'గుజరాత్‌లో ప్రభుత్వ ఉత్తర్వులు, పోలీసు ఛార్జిషీట్లు, అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ గుజరాతీ భాషలోనే కొనసాగుతున్నాయి. వారు తమ భాషను కాపాడుకుంటున్న తీరు అభినందనీయం. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఆ విధానాన్ని అనుసరిస్తే మన భాషకు కొత్త ఊపిరి పోసినట్లవుతుంది అని అభిప్రాయపడ్డారు.

అమ్మభాషతో ఆత్మవిశ్వాసం

అమ్మభాష మనలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంచుతుందని, తద్వారా వికాసిత్ భారత్



తెలిగిద్దాం

సాకారమవుతుందని పూర్వపు ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు.సమాజంలోని ప్రతి అంశం భాషతో ముడిపడి ఉందని, ప్రాణంలేని మనిషిలా, భాషలేని సమాజాన్ని చూడలేమని అన్నారు.ఒక భాష ఉనికి కోల్పోతే, దాని చుట్టూ ఉన్న సంస్కృతీ సంప్రదాయాలు, చరిత్ర కనుమరుగవు తాయని తెలిపారు.

తెలుగుపై ఆంగ్లం మరో దాడి

ప్రపంచీకరణ పేరుతో ఆంగ్లం మళ్లీ విజృంభి స్తోందని, విద్య,వ్యాపార,కార్మిక రంగాలను అది ప్రభావితం చేస్తోందని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో మాతృభాషలో చదువుకోలేని దుస్థితి నెలకొందని అన్నారు. తాము అన్య భాషలకు వ్యతిరేకం కాదని, తెలుగు భాషను, దాని గొప్పదనాన్ని కాపాడుతూనే ఎన్ని భాషలైన నేర్వవచ్చని అన్నారు. మాతృభాష అంతరిస్తే జాతి అంతరించినట్లేనని, భాషా పరిరక్షణకు రాజకీయ పక్షాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'ప్రాథమిక విద్య బోధన మాతృభాష లోనే జరగాలి. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమం తప్పనిసరిగా ఉండాలి. తెలుగులో చదివితే ఉద్యోగాలు రావనే ప్రచారాన్ని ప్రజల మెదళ్ల నుంచి తొలగిపోయేలా చైతన్య పరచాలి. ఈ మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి'అని సూచించారు.

అసెంబ్లీలో ఆమోదం పొందేలా చేస్తా:

రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.. మాతృభాషను మరువడం అమ్మను మరువడమేనని అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ఈ మహాసభల్లో మేధావులు చర్చించి, ఇచ్చే ప్రతిపాదనలను శాసనసభలో చర్చ పెట్టి, ఆమోదం పొందేలా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మారిషస్ గడ్డపై తెలుగు జెండా

ఈ మహాసభలకు విశిష్ట అతిథిగా విచ్చేసిన మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ ప్రసంగం ఆకర్షణగా నిలిచింది. తమ దేశంలో తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, ఉగాది వండుగను 'జాతీయ సెలవుదినం'గా ప్రకటించి ఘనంగా నిర్వహించు కుంటామనడం సభికుల హర్షధ్వానాలతో మిన్నంటింది. 'భారత్, మారిషస్ దేశాల మధ్య కేవలం దౌత్య సంబంధం కాదు. అది ఒక అసాధారణ నాగరికతా అనుబంధం. తమ దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో తెలుగు సమాజం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలోనే ఎత్తయిన 108 అడుగుల వేంకటేశ్వర స్వామి విగ్రహం మారిషస్‌లో ఉంది. అది భిన్న ఖండాల భక్తులను ఏకం చేస్తోంది' అని సవినయంగా చెప్పారు. ఆంగ్ల భాషా ప్రభావం వల్ల ప్రపంచంలోని సగానికి పైగా భాషలు ఈ శతాబ్దం చివరి నాటికి అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆయన ధరమ్ బీర్ గోకుల్ హెచ్చరించారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి విధి అని, అది దేశ బాధ్యత మాత్రమే కాదని, అవసరమని కూడా సూచించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మారిషస్ పర్యటన సందర్భంగా తెలుగు సంస్కృతి అభివృద్ధికి తీసుకున్న ప్రత్యేక చర్యలను ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.

తెలుగు నా తొలి గుర్తింపు: హరిబాబు

తెలుగు తన తన మాతృభాష మాత్రమే కాదని, తన ఆలోచనలు, విలువలు, వ్యక్తిత్వాన్ని మలిచిన సంస్కృతని, తెలుగువాడిగా పుట్టినందుకు గర్విస్తు న్నానని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ఉద్వేగంగా పేర్కొన్నారు. శతాబ్దాలుగా తెలుగు నాగరికతను నిలబెట్టిన కవులు, పండితులు, జానపద కళాకారులు, సామాన్య ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శాసనాలు, ఇతిహాసాలు, భక్తి ఉద్యమాల నుంచి నేటి సినిమా, సాంకేతిక పరిజ్ఞానం వరకు తెలుగు భాష ప్రస్థానాన్ని ఆయన వివరించారు. భాషను కేవలం ప్రభుత్వాలే బతికించలేవని, ప్రజలు తమ నిత్యజీవితంలో తెలుగును వాడినప్పుడే భాష వికసిస్తుందని హితవు పలికారు. ప్రాథమిక విద్య మాతృభాషలో సాగినప్పుడే పిల్లలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరచగలరని అభిప్రాయపడ్డారు. భారతీయ భాషల వికాసానికి కృషి చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీని, తెలుగు ఆత్మగౌరవాన్ని చాటిన ఎన్టీ రామారావును స్మరించుకున్నారు.

మాతృభాష వల్ల విషయం పట్ల సమగ్ర అవగాహన కలుగుతుందని, ప్రపంచంలో వివిధ రంగాల ప్రముఖులు మాతృభాషలోనే చదివారని, ఐదో తరగతి వరకు మాతృభాషలోనే చదివించాలని విద్యా విధానం చెబుతోందని సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. తనకు తెలుగు బాగా వచ్చు కాబట్టే ఐదు భాషలు నేర్చుకున్నానన్నారు. విషయపరిజ్ఞానంపై ఉద్యోగాలు వస్తాయి కానీ, కేవలం ఆంగ్లం వల్ల కాదని అన్నారు. భాషతోనే వికాసం సాధ్యమౌతుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి పేర్కొన్నారు. భాషా సంస్కృతులను మరచిన, కళలకు స్థానం లేని సమాజం మనుగడ సాగించ లేదని అన్నారు. అమ్మ తొలి గురువు కనుకే భాషను 'అమ్మ భాష' అంటామని, అమ్మను, అమ్మభాషను గౌరవించాలని కోరారు. తెలుగు భాషను నేర్చుకుని భావితరాలకు అందిం చాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని సూచించారు.

తెలుగుతల్లికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు కళ్లుగా ఆధ్యాత్మిక గురువు విశ్వయోగి విశ్వంజీ అభివర్ణించారు. ఇరువురు ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి చేపట్టబోయే కార్యక్రమాలు విజయవంతం కావాలని అభిలషించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్ర సారస్వత పరిషత్తు తరఫున మూడోసారి ప్రపంచ మహాసభలు నిర్వహించామని, తెలుగు భాష ప్రభుత్వానికి అధికార భాష, మాకు మాత్రం మమకార భాషగా పేర్కొన్నారు.

రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ప్రాచీన భాష తెలుగు. నన్నయ్య, తిక్కన, ఎర్రన వంటి వారు తెలుగు భాషకు పట్టం కట్టారు. ఎన్టీఆర్, రామోజీరావు తెలుగుకు గుర్తింపు తెచ్చిన వారిలో ప్రముఖులు అని కొనియాడారు.

తెలుగు భాషకు సేవలందించిన పలువురు ప్రముఖులకు మహాసభల్లో 'పూర్ణకుంభ పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రఖ్యాత దర్శకుడు కె. విశ్వనాథ్ తనయుడు నాగేంద్ర, తూర్పుభాగోతం కళాకారుడు శంకర్రావు, సినీనటుడు ఏడిద శ్రీరాం, బుర్రా సాయిమాధవ్, గద్దర్ కుమార్తె వెన్నెల, తోలు బొమ్మల కళాకారుడు చిదంబరం, పొత్తూరు రంగారావు తదితరులను అయ్యన్నపాత్రుడు సత్కరించారు.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

భాగం-18

గ్రీకుల రాజనీతి

మానవుడు మొదట మిగిలిన అన్ని జంతువులలాగే అడవుల్లో అనాగరికంగా తిరుగుతూ.... నెమ్మదిగా నాగరికత అభివృద్ధి చేసుకున్నాడా? ఆ తరువాతే రాజనీతిశాస్త్రాన్ని నిర్మించుకున్నాడా? లేక మానవుడికి మొదటినుంచి సంఘజీవిగా బతికే అలవాటు చొప్పున అతడికి రాజనీతి కరతలామలకంగా తెలిసి ఉండేదా? అనే విషయంపై చాలా చర్చలు జరిగాయి. రాజ్యం ఎలా ఆవిర్భవించింది అనే అంశంపై ప్రాచీన గ్రీకుల అభిప్రాయాలు...

పాశ్చాత్యుల రాజనీతిని గురించి చర్చించే ముందుగా వారికంటే ప్రాచీనులైన గ్రీకుల రాజనీతిని గురించి చెప్పుకోవాల్సి ఉంది. వారి ప్రాచీన రచనలలో హోమర్ రచించిన మహా కావ్యం 'ఇలియడ్', 'ఓడెసీ'లను గమనించాలి. వాటికి మన మహాభారతంతో పోలికలు కనిపిస్తాయి. సికిందర్ సైనికులు ఒక దశలో 'మహాభారతాన్ని హోమర్ రచనల ఆధారంగానే రచించారేమో'నని భావించారు. అంతగా ఆ రెండింటికీ పోలికలు కనిపిస్తాయి.

పైన చెప్పిన కావ్యాల ఆధారంగా ఆనాటి ప్రజల జీవన విధానాలు, రాజ్య స్వరూపాలను అవగతం చేసుకోవచ్చు. రాజు న్యాయనిర్ణేతగా ఉండేవాడు. సార్వజనీనమైన ఏ సమస్య అయినా ఉత్పన్నమైనప్పుడు రాజే తీర్పు చెప్పేవాడు. ఎవరైనా పీడిత వ్యక్తులు ఫిర్యాదుతో రాజద్వారం ముందుకు వచ్చినప్పుడు... హత్యకు సంబంధించిన ఉదంతాలలో కులపతుల సాయంతో కూడా రాజే తీర్పు ఇచ్చేవాడు. రాజే ప్రధాన సైన్యాధ్యక్షుడిగా ఉండేవాడు. జనుల సమ్మతి పొందినవారే రాజుగా ఉండేవారు. అయినప్పటికీ రాజు వ్యక్తిత్వము – అతడు తన అధికారాన్ని ప్రయోగించే విధానాలలో అధిక మహత్వాన్ని ఆపాదించేవారు.

హేసియడ్ తన వర్తమానకాలం నికృష్టంగా ఉందని, దీనికి అతీతంగా స్వర్ణయుగం ఒకటి ఉండేదని వర్ణించాడు. మానవేతిహాసంలోని ఉషఃకాలం అనగా ప్రారంభపురోజులు అత్యంత సుఖమయంగా గడిచాయని అతడి విశ్వాసం. క్రమంగా మానవ వర్గంలో దుఃఖం వృద్ధి చెందుతూ వచ్చింది. దానివల్లనే స్వర్ణయుగం అనంతరం వెండియుగం వచ్చింది. ఆ తరువాత రాగియుగం, అటుపైన ఇనుపయుగం వచ్చాయి. హేసియడ్ తన కాలాన్ని ఇనుపయుగంగా అభివర్ణించాడు.

ప్లూటార్క్ – అపోలోతో కలిసి సాధు సత్పురుషుల ఉల్లేఖనాలను సంకలనం చేశాడు. అర్నస్ట్ వార్కర్ అభిప్రాయంలో అదంతా సోలన్ అనే సాధువు జీవిత చరిత్రలో భాగాలే. సోలన్ నాటి సామాజిక, రాజకీయ స్థితిగతులలో గొప్ప పరివర్తనలు తీసుకురాగలిగాడు. అతడు న్యాయము – దండము ప్రధాన ఆధారాలుగా గ్రహించాడు. ఆ రెండూ మాత్రమే నిర్ధనులకు మిత్రులుగా... ధనవంతులకు రక్షణగా ఉంటాయని చెప్పాడు. సోలన్ జీవించిన కాలాన్ని శోషణ యుగం అని పిలుస్తారు. తన దృష్టిలో అతడు కేవలం రాజ్యవిధానాలను మాత్రమే రూపొందించలేదు. కార్య – కారణాల అపేక్షతో న్యాయాన్ని ఉన్నత స్థానంలో ఉంచాడు. రాజ్యసత్తకు ఆధారంగా జనసత్తను స్థాపించాడు. అతడి జనతంత్రం న్యాయ సరిహద్దుల లోపలే ఉండేది. రాజనీతి, రాజ్యనిర్వహణలో ప్రజలకు ప్రత్యక్ష అధికారం లేదు. 'స్వీకృతి నియమాలు అలాగే పరంపరను అనుసరించి రాజ్యతంత్రం తమను పాలిస్తోంది' అని ప్రజలు గ్రహించగలిగేవారు.

సోఫిస్టుల కంటే పూర్వం ఉన్న దార్శనికులతో పాటుగా... అయోనియాకు చెందిన భౌతికవాద దార్శనికులకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. వస్తుతః గ్రీకు తత్త్వశాస్త్రం విచిత్రాలకు పుట్టినిల్లు. ఒకపక్క గణతంత్ర రాజ్యసంఘం... మరోపక్క మేసడోనియాకు చెందిన విశాల సామ్రాజ్యం మనుగడ సాగించేది. హెరాక్లిడస్ చెప్పిన పదార్థ పరిణామవాదం... ఆ వాదాన్ని ఖండిస్తూ సాగిన పరమనేడ్స్ వాదమూ ఒకే సమయంలో చెరో పక్కనా నడుస్తుండేవి. ఇదేవిధంగా గ్రీసులో డయనిసస్ ద్వారా పరిష్కృతరూపం పొందిన గంభీరవాదం జనామోదం పొందుతుండేది. అదే సమయంలో అయోనియా అనుయాయులు పై వాదానికి విరుద్ధ పక్షంలో నిలిచేవారు.

పెరిక్లిస్ రాజ్యం ఏలుతున్న కాలంలో అనేక్ సాగోరస్ ద్వారా అయోనియనిజంలో ఉద్భవించిన ఒక నవీన విచారధార ఏథెన్స్‌లో ప్రవేశించింది. ఈ కొత్త దార్శనిక విచారధార పుట్టడానికి కారణాన్ని, 'పూర్వ సిద్ధాంతాల ప్రభావం' అని వార్కర్ చెప్పాడు. హెరాక్లిటస్ ప్రకారం సర్వ వ్యాపక తత్త్వాలు అగ్ని, జలాలే. అలాగే అతని దర్శనంలో అగ్ని, జలము, ఉష్ణము లేదా శక్తిధారణలు చోటు చేసుకున్నాయి. అతడిని అనుసరించే సమాజంలో ఉచ్ఛ – నీచాల విచారణ సాగుతుండేది. ఎవరైతే శుష్కంగా అగ్నిప్రధానులై ఉంటారో... వారిని శ్రేష్ఠులని, లావుగా జలప్రధానులై ఉండే వ్యక్తులను నీచులని భావించేవారు.

అయోనియనిజం బోధించిన ఇతర దార్శనికులను సైతం ఇష్టపడే పైథాగరస్ కూడా అనేక రూపాత్మకమైన జగత్తులో ఒకే తత్త్వం వ్యాపించి ఉంది అని విశ్వసించాడు. అతని ప్రకారం ఏకతత్త్వం అనేది అగ్ని – జలాల కంటే అధిక సూక్ష్మరూపంలోని 'సంఖ్య'లో ఉంటుంది. 'సంఖ్య'కు అస్తిత్వం కల్పించడంతోనే స్థానం (అవకాశం) కూడా దానిలో సమ్మిళితం అవుతుంది. ఈ విధంగా ప్రపంచంలోని ప్రతి ఒక్క వస్తువుయొక్క సారమూ 'సంఖ్య'యే అయి ఉన్నది. పైథాగరస్ అభిప్రాయంలో, 'సమస్త ప్రాణులలోని ఆత్మ సమానమైనది. అలాగే 'జన్మచక్రం'లో ఒక్కొక్క మానవుడి ఆత్మ ఉన్నతిని సాధిస్తుంది. లేదా గతజన్మలలో కుక్క, ఏనుగు వంటి జంతువుగా పుట్టి ఉండే అవకాశమూ లేకపోలేదు. 'జన్మచక్రం' నుంచి ముక్తి పొందడానికి సాధన – సంస్కారం తప్పకుండా ఉండాలి. అన్నింటికంటే జ్ఞాన మహత్వం సర్వాధికం.

(వచ్చేవారం... 'ప్లేటో – అరిస్టాటిల్')

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

HAPPY New Year 2026 నూతన సంవత్సర & సంక్రాంతి శుభాకాంక్షలు

Dr. G. Suryanarayana Raju
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience

Dr. D. Raghunadharao
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

Asvins Specialty Hospitals

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.
www.asvinshospitals.com Ph: +91 94404 45775

40+ Years of Oncology Expertise
Over 7,00,000 Patients Treated
75,000 Successful Surgeries
99% Success Rate

ASVINS
Specialty Hospitals
Care•Cure•Comfort

SERVICES

SURGICAL SPECIALTIES:	MEDICAL SPECIALTIES:
Anaesthesiology	Bone Marrow Transplant
Breast Surgery	Cardiology
Bone & Soft Tissue Tumors	Chest Medicine
Gynaecology & Gynaec Oncology	Endocrinology
Head & Neck Oncology	Gastroenterology
Minimal Access Surgery	Hematology & Hemato Oncology
Neurosurgery	Internal Medicine
Plastic & Reconstructive Surgery	Intensive Care
Surgical Oncology	Medical Genetics
Thoracic Oncology	Medical Oncology
Transplant Surgery	Nephrology & Dialysis
Urology, Andrology & Endo Urology	Neurology
Vascular Surgery	Orthopaedic & Rheumatology

Book Your Consultation Now +91 9440445775 | **We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries**

We Expertise in Treating All Cancers **Expert Treatment At Affordable Prices**

SCAN ME

అశ్విన్ క్యాన్సర్ కేర్, భీమవరంలో

అశ్విన్స్ స్పెషాలిటీ హాస్పిటల్స్

ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్
డా॥ జి. సూర్యనారాయణ రాజు
M.S. MCh, FRCS, FUICC సర్జికల్ ఆంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ ఆంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్

ప్రముఖ గైనో ఆంకాలజిస్ట్
డా॥ రమణి GSV
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ ఆంకాలజీ & ప్రివెంటివ్ ఆంకాలజీ

ప్రతి నెల మొదటి ఆదివారం

ప్రముఖ హేమాటో ఆంకాలజిస్ట్
డా॥ గెంటే. విక్రమ్ కుమార్
MBBS, MD ఇమ్యునో- హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్)
కన్సల్టెంట్ హెమటాలజీ మరియు
హెమటో- ఆంకాలజీ

ప్రతి నెల రెండవ ఆదివారం

ఈ దిగువ లక్షణాలు కలవారు డాక్టర్ గారిని సంప్రదించగలరు.

తెల్ల బట్ట, అధిక నెలసరి, PCOS లక్షణాలు, గర్భసంచి కాన్సర్, అండాశయ కాన్సర్, అండాశయపు గడ్డలు & నీటి గడ్డలు, గర్భ సంచి కణితులు, గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ (HPV), రుతువిరతి తర్వాత సమస్యలు, వీర్యకాలిక దగ్గు, దగ్గేటప్పుడు రక్తం పడటం, మూత్రంలో రక్తం, ఆహారం మింగలేకపోవడం, నోటి పూతలు, మెడలో గడ్డలు, రొమ్ము లో గడ్డలు, వాంతులు, రక్తపు వాంతులు, కామెర్లు, వీర్యకాలిక అతిసారం, మలబద్ధకం, రక్తస్రావం, తెల్లబట్ట

బ్లడ్ కాన్సర్, అధిక రక్తస్రావం (Bleeding Problem), రక్తహీనత (Anaemia), ప్లేటెలెట్స్ కణాలు తగ్గడం, రక్త కణాలు సమస్య, రక్తం ఆధికంగా గడ్డకట్టడం, పసకలు (Jaundice), ప్లీహం పెద్దగా అవడం (Splenomegaly), బోన్ మ్యారో మార్పిడి

అభినవ్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 224338

ఉదయం
గం॥ 10:30ల నుండి
గం॥ 2:00ల వరకు

లోటస్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 230555

గమనిక పేషెంట్స్ తమ పాత రిపోర్టులతో సంప్రదించండి | అన్ని రకాల క్యాన్సర్ల కు చికిత్స మరియు సలహాలు ఇవ్వబడును.

అపాయింట్మెంట్ కొరకు హాస్పిటల్: 9440445775, సీత: 9618161032 అచ్చయ్య: 9398573243

డిండిమ చెబుతున్న అంశాలు ఆ పండితుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి.

ఉద్వేగాలు కాస్త చల్లారాక గణపతిదేవుడు అడిగాడు.

"అవునూ.. నీకు ఉరిశిక్ష వేసి అమలు చేయబోయింది బృహత్కుంచిలో. ఇప్పటి వరకు నువ్వు చెప్పిన ప్రజాకంటకుల్లో ఆ మహారాజు కూడా ఉన్నాడా?"

"నేను అన్ని రాజ్యలలోని పేదల కోసం కృషి చేస్తాను. ఇప్పుడు మహారాజుల తర్వాత ప్రజలను పీడించుకుతినే వాళ్లు వణిజులు. ప్రజల నిత్యావసరాలను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించి ప్రజల కష్టం కొల్లగొడుతున్న వణిజుల కోష్ఠాగారాలను పగులగొట్టి ప్రజలకు పంచుతాను. నా జన్మభూమి ముదిగొండ. నేను చెప్పిన దుర్మార్గాలు ఎక్కువగా జరుగుతున్న రాజ్యం కూడా అదే."

అప్పటివరకు చర్చలో మౌనంగా వింటున్న సైనిక వీరులు చివ్వున లేచారు. ముఖ్యంగా రేచర్ల రుద్రసేనాని అత్యంత వేగంగా ఒర నుండి కరవాలాన్ని లాగి పైకెత్తి వికటాట్టహాసం చేశాడు.

"వాడ్ని అప్పుడే ఖండఖండాలుగా నరికి కాకులకు గద్దలకు వేయాల్సింది. తప్పు చేశానయ్యా డిండిమా.."

మహావీరుడు రుద్రయ అంతగా ఉద్వేగపడటంతో అంతా నిర్ఘాంతమై ఆయనను చూడసాగారు. గణపతి కూడా ఆశ్చర్యంగా రుద్రయను చూడసాగాడు.

"మీరు దేవగిరి వారికి బందీగా ఉన్నప్పుడు వాడు.. వాడే ఆ పాపి ముదిగొండ పాలకుడు నాగతి భూపాలుడు అనుమకొండపై దాడి చేశాడు.."

చివ్వున తన నడబంధంలోని కత్తి ఒరపై చెయ్యి వేశాడు గణపతిదేవ చక్రవర్తి.

"కాని వాడికి మన కాకతీయ పౌరుషం రుచి చూపి తరిమి తరిమి కొట్టాం చక్రవర్తీ. అందుకు రుద్రసేనానుల వారిని తమరు అభినందించి తీరాలి.." అన్నాడు మల్యాల చౌండసేనాని.

గణపతిదేవుడే కాదు శిబిరంలోని ప్రతి ఒక్కరూ రేచర్ల రుద్రయను అభినం దనగా చూశారు.

"అనుమకొండ పురవీధులలోనే ముదిగొండ సైన్యాన్ని ఊచకోత కోసి మన పౌరులకు యుద్ధం ఎలా ఉంటుందో చూపించాడు అన్న రుద్రయ.." ఆయనకు వినయంగా నమస్కరిస్తూ గౌరవం, అభిమానం ముప్పిరిగొన్న గొంతుకతో మరింత వివరంగా చెప్పాడు చౌండ. తన గుబురు మీసాలను సవరించుకుంటూ చిద్విలాసంగా చూస్తున్నాడు రుద్రసేనాని.

"ప్రస్తుతం.. వాడెక్కడున్నాడు మహా ప్రధానీ..!" గణపతిదేవుని గొంతు కరుగ్గా అడిగింది.

"రుద్రయ దెబ్బకు కొన్నిరోజులు రాజ్యాన్ని విడిచి కొలని రాజ్యంలో దాక్కొని.. తిరిగి ముదిగొండ చేరి తన దుష్పరిపాలనను కొనసాగిస్తున్నాడు. అదే సమ యంలో మనపై వాడి నోటికి ఎప్పటిలాగే హద్దుపద్దూ లేదు.."

క్షణక్షణానికి గణపతిదేవునిలో అసహనం పెరిగిపోతోంది.

"అయితే వాడికి తగిన బుద్ధి చెబుదాం. సంధి విగ్రహి గారెక్కడ??"

శిబిరమంతా కలయజూస్తూ అడిగాడు చక్రవర్తి. సంధి విగ్రహి జంఘాల భట్టు ముందుకు వచ్చాడు.

"తక్షణమే మీరు ముదిగొండ వెళ్లి ఆ మహారాజుకు మా మాటగా చెప్పండి. 'తమరి పాలన ప్రజా కంటకంగా ఉందన్న సమాచారం మాకు అనుమకొండ చేరింది. ముదిగొండ ప్రజల హితైషుల మైన మేము మిమ్మల్ని హెచ్చరిస్తున్నాం. మీ పాలన ఏ మాత్రం మాకు సమ్మతం కాదు. మీ ప్రవర్తన మార్చుకోవాలి. కొంతకాలం మీ ప్రవర్తన, పాలన మేము పరిశీలిస్తాం. ఏమైనా మార్పు కనిపించిందా.. సరే. లేకుంటే ప్రజాశ్రేయస్సు దృష్ట్యా మీ రాజ్యాన్ని మా సామ్రాజ్యంలో కలిపేసుకునే అవకాశం ఉంది..' అని మా మాటగా చెప్పండి."

మహారాజుగారు చెబుతుండగానే ప్రక్కనున్న రాజలేఖకుడు బిరుసుగుడ్డపై అప్పటికప్పుడు వేగంగా రాసి ఆయనకు చూపగా ఆయన చదివి తల పంకించి చూపుడు వ్రేలికి ఉంగరరూపంలో ఉన్న రాజ ముద్రికను తీసి రాజవ్యవహారాల సహాయకుడు మయ భట్టుకు అందించగా.. ఆయన దగ్గరగా ఉన్న గాజు బుడ్డిలోని సిరాలో దానిని తడిపి ఆ గుడ్డపై ముద్రించాడు. తర్వాత దానిని మడిచి తనవద్దనున్న పెట్టెలో ఉంచి జంఘాల భట్టుకు అందించాడు. అంతా సంభ్రమంగా చూస్తుండగా దానిని అందుకున్న సంధివిగ్రహి జంఘాలభట్టు చక్రవర్తికి నమస్కరించి వెనుదిరిగి బయటకు వెళ్లిపోయాడు.

అనంతరం శిబిరం మరి కాసేపు విభిన్న అంశాలపై చర్చలు జరిపాక ఆ రోజుకి సమావేశం ముగించారు.

అందరూ నిష్క్రమించాక సర్వసైన్యాధ్యక్షుడు రుద్రసేనానిని దగ్గరకు పిలిచాడు గణపతిదేవుడు.

"సంధి విగ్రహి వెనుక మందడి పరాంతకుని నాయకత్వంలో ఓ మెరుపు బృందాన్ని రహస్యంగా ముదిగొండ రాజప్రాసాదానికి పంపండి. వాడు.. నాగతి భూపాలుడు ఏ మాత్రం వెకిలిగా మాట్లాడి మన జంఘాలభట్టును అవమానించినా వెంటనే వాడిపై మెరుపుదాడి చేసి బంధించి మా ముందు నిలబెట్టండి!!"

* * *

మూడవనాడు మేధోమథన శిబిర మందిరం.

"అందరూ.. సైనిక వీరులంతా వచ్చి ఈ నీచుడిపై కాండ్రించి ఉమ్మండి. మీ ఉమ్ములతో వాడు తడిసిపోవాలి"

గణపతిదేవుడు

18

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

మేధోమథన శిబిరం మధ్యగా ఓ కుడ్యానికి తాళ్లతో కట్టేసి ఉన్న ముదిగొండ మహారాజు నాగతిభూపాలుని చూస్తూ భరించరాని అసహ్యంతో అరిచాడు గణపతి దేవచక్రవర్తి.

చక్రవర్తి సందేశాన్ని తీసుకుని ముదిగొండ రాజప్రాసాదానికి వెళ్లిన కాకతీయ సంధివిగ్రహి జంఘాలభట్టును ముఖాన ఊసి తీవ్రంగా అవమానించాడు ముదిగొండ పాలకుడు నాగతిభూపాలుడు. వెనువెంటనే కాకతీయ మెరపువీరుల దళం ఆ ముదిగొండ సభాభవనాన్ని చుట్టుముట్టి నాగతి అంగరక్షకులను అక్కడికక్కడే సంహరించి నాగతి భూపాలుని మెరపువేగంతో పట్టి బంధించారు. ముదిగొండ సైనికాధికారులు, సైన్యం సమాయత్తం అయ్యేలోగా ముదిగొండ పురం దాటి కాకతీయరాజ్య హద్దులలోకి వచ్చేశారు.

నాగతి భూపాలుడు సంధివిగ్రహి ముఖాన ఉమ్మి అవమానించాడని చెప్పగానే తీవ్రంగా చలించి పోయాడు గణపతిదేవుడు. అతనికి ఆ ఉమ్ములతోనే జవాబి వ్వాలని ప్రకటించాడు.

సైనికులు, సైన్యాధ్యక్షులు, సేనానులు, దళపతులు, సాహిణిలు, యుద్ధ మంత్రి ఇతరత్రా సైనిక అధికారులు, ఉత్సాహంతో ఉద్రేకంతో లేచి అతనిపై ఉమ్ముల వర్షం కురిపించసాగారు.

తిక్కనామాత్యుడు, ఇతర పండితులు .. ఆ దృశ్యాన్ని చూడలేక తల తిప్పుకుని దూరం జరిగారు.

సైనికులకు, వీరులకు శత్రువును రకరకాలుగా అవమానించడం అనుభవమే. అది వారి విజయానికి చిహ్నంగా భావిస్తారు. అందువల్ల అలాంటి అవకాశాన్ని వీరుడు అనే వాడు వదులుకోడు.

ఆ ఉమ్ముల వర్షంతో అతని ముఖం నిజంగానే తడిసిపోయింది. శిరస్సు నుంచి ఎదురొమ్ము వరకు అతని శరీరం చూడరానంత రోతగా కనిపిస్తోంది. శత్రువు అవమానంతో మరింత కుంగిపోయేలా ఉమ్మిన వీరులంతా వికటాట్ట హాసాలుచేస్తూ గంతులు వేశారు. కాకతీయసైనికుల అరుపులతో వికటాట్ట హాసాలతో ఆ భవనమంతా మారుమోగుతోంది.

"గణపతిదేవ చక్రవర్తి జయహో."

"జయహో గణపతిదేవ చక్రవర్తి.."

"కాకతీయ సామ్రాజ్యాధినేతా.. జయహో.."

కాని అప్పుడో ఊహించని సంఘటన జరిగింది.

కుడ్యానికి బంధించి ఉన్న నాగతి భూపాలుడు గొంతెత్తి గట్టిగా అరిచాడు.

"ఆపండి.."

"ఆపండి మీ పిచ్చి వాగుడు.."

"ఆపండి.."

"నోరుముయ్యండి.."

అతడేదో అంటున్నాడని గుర్తించిన వాళ్లంతా నిశ్శబ్దమైపోయారు.

గణపతిదేవుడు చెయ్యెత్తగా మందిరమంతా నిశ్శబ్దమైపోయింది. సైనికుల ఉమ్మితో కళ్లు ముక్కు నోరు కూడా మూసుకుపోగా తల విదిలింపుతో ఉమ్మి కారిపోయేలా చేసి ఊపిరి పీల్చుకున్నాడు నాగతి.

మళ్లీ అరిచాడు. క్రోధంతో బాధతో దుఃఖంతో మళ్లీమళ్లీ అరిచాడు. రౌద్ర దృక్కులతో గణపతిదేవుని చూస్తూ అన్నాడు.

"నువ్వు చక్రవర్తివా!ఎవడు చెప్పాడు.? నాబోంటి చిన్న రాజును బంధించి తెచ్చి అవమానించి నీ సైనికులతో పొగిడించుకుంటే నువ్వు చక్రవర్తివి ఐపోతావా.. నువ్వూ నాలాంటి ఓ రాజ్యానికి ఓ రాజువి మాత్రమే. నీ రాజ్య విస్తీర్ణమెంత..? నీ రాజ్యపు ఆదాయమెంత? సైన్య పటాలం లెక్కలేవిటి? అశ్వాలు ఎన్ని?గజ సైన్యం ఎంత?ప్రత్యేక వీరు లెందరు? లెంకలు, ఎక్కటీలు, ఒంటరులు.. ఎందరు? చక్రవర్తి అని పిలిపించుకోవడానికి నీకున్న అర్హత ఏవిటి? పిల్ల కుంకా!. నిన్నగాక మొన్న దేవగిరి చెరశాల నుండి జైత్రపాలుని కనికరంతో బయట పడిన నువ్వు.. హహ్హహ.. నువ్వు చక్రవర్తివా! ఏమీ పొగరు.. ఏమి మదాంధత.. ఏమి అల్పానందం.. శాతవాహనులు, చాళిక్యులే చక్రవర్తులుగా పిలిపించు కోలేదు. చోళులు, పల్లవులు ఏదో వంధిమాగధులు కీర్తిస్తే వినీ వినన ట్లు ఆనందించారు కాని నీలాగా బాహాటంగా సైనికులతో జయహోలు కొట్టించుకో లేదు.. పిల్లకుంకా!!"

అంతా.. మందిరమంతా నిర్ఘాంతపోయి మాన్పడి పోయినట్లు కళ్లప్పగించి చూడటం చెవులప్పగించి వినడం మినహా మరేమీ చేయలేనట్లు అచేతనమై పోయింది.

కొన్నిలిప్తల కాలం..

ముందు తేరుకున్నవాడు రుద్రసేనాని. చివ్వున లేచి ఒరనుండి ఖడ్గాన్ని మెరుపువేగంతో లాగి ఒక్క ఊపున నాగతి వైపు దూకాడు. "రేయ్.. ధూర్తుడా.. వాచాలుడా.. నిన్ను ఇప్పుడే ఇక్కడే.." అరుస్తూ అతని మీదికి వెళ్లాడు. మరి లిప్తకాలంలో నాగతి తల తెగిపడేదే. గణపతిదేవుడు, గంగాధరుడు, తిక్కన అంతే వేగంగా దూకి రుద్రసేనాని నడుము పట్టి ఒకరు, కత్తి దొరకబుచ్చుకుని ఒకరు, చేతులు పట్టి ఒకరు నిలువరించారు.

కాని నాగతి.. తన వాచాలతను ఆపడం లేదు. అతని తీరు చూస్తుంటే అనాల్సిన నాలుగు మాటలు అనేసి జరిగిన అవమానానికి వాళ్ల చేతుల్లోనే చావాలని చూస్తున్నట్లుంది.

"ఏమి ఆగిపోయావేం రుద్రయా..! నన్ను చంపడం ఓ వీధికుక్కను చంపడం లాంటిది కదా. నువ్వు కుక్కల్ని చంపడానికి మాత్రమే పనికి వస్తావ్. ఓ చాళుక్యవీరుడ్ని సంహరించగలవా.. చోళచక్ర వర్తిని బంధించి తేగలవా.. కనీసం వెలనాడు మహా రాజునో.. బల్లాలదేవుడ్నో.. కళింగ చక్రవర్తినో.. అంతెందుకు దేవగిరి యువరాజు సింఘణదేవుడ్ని పట్టి బంధించు చూద్దాం.. హహ్హహ్హ.. హహ్హహ్హ హహ్హహ్హ.."

నాగతిభూపాలుడు అలా రకరకాలుగా గణపతిని రెచ్చగొడుతూ అరుస్తూ పగలబడి నవ్వుతూ పిచ్చెక్కి నట్లు మాట్లాడుతూనే ఉన్నాడు.

గణపతిదేవుడు అచేతనుడిలా ఉండిపోయాడు. రుద్రసేనాని కూడా స్థాణువులా నిలబడిపోయాడు.

తిక్కన, గంగాధరుడు ముఖాలు చూసుకుని కనుసైగలపై భటులను పిలవగా వాళ్లు నాగతి

మత్తి భానుమూర్తి

కట్లువిప్పి కారాగారం వైపు తీసుకుపోయారు.

దాదాపు రెండు వందల మంది మేధావులున్న మందిరం చాలాసేపు అలా అచేతనంగా ఉండిపోయింది. తిక్కన కదిలి అన్నాడు, "సభాధ్యక్షుడిగా ప్రకటిస్తున్నాను. ఈరోజుకు సమావేశం ముగిసింది. రేపు ఉదయం ఎప్పటిలాగే సమావేశం జరుగుతుంది. అందరూ మీమీ అతిథి మందిరాలకు వెళ్లవలసినదిగా ప్రార్థన.

అందరూ మౌనంగా కదిలారు.

అంగరక్షకులైన లెంకలు ముందుకొచ్చి వినయంగా తలవంచి నిలబడగా గణపతిదేవుడు కదలక తప్ప లేదు. మౌనంగా మందిరాన్ని వీడి అంతఃపురం వైపు నడిచాడు. గంగాధరుడు భుజంపై చేయి వేయగా రుద్రసేనాని కూడా కదిలాడు.

ఎవ్వరి నోటా ఒక్కమాట కూడా రాలేదు.

మరునాడు శిబిరం మొదలయినా అంతా మౌనం.. ఎవరి ముఖంలోనూ చిరునవ్వు లేదు.

నాగతి మాటలు ఆ మందిరంలో ప్రతిధ్వనిస్తున్నట్లు.. అందరూ అతని మాటలతో తీవ్రాతితీవ్రమైన ఆలోచనలతో గంభీరంగా ఉన్నారు. ఎవ్వరి ముఖంలోనూ రక్తపు చుక్క లేదు.

గణపతిదేవుడు శిబిరంలోకి ప్రవేశిస్తున్నప్పుడు కూడా వందిమాగధులు తమ స్తోత్ర పాఠాలు ప్రారంభించగా, ఆయన ఆపమన్నట్లు చేయెత్తాడు. దాంతో ఈరోజు వాళ్లు చదివే స్తోత్రపాఠాలు ఎలా ఉంటాయో అనే ఉత్కంఠకు తెరపడింది.

శిబిరం అధ్యక్షుడు తిక్కనామాత్యుడు మాత్రం ఎప్పటిలాగే ఆనాటి చర్చాంశం ప్రకటించారు.

"ఈరోజు చర్చనీయాంశం మన సహజవనరులు అంటే మన నదులు, పర్వతాలు, భూములు, పంటలు. దీని పై మన విశిష్ట ప్రవీణులు శ్రీ స్కంధనాథయ మహోపాధ్యాయులు ఉపన్యసిస్తారు." అన్నాడు.

స్కంధనాథయ మాట్లాడడానికి సిద్ధమౌతుండగా గణపతి దేవమహారాజు కలగజేసుకున్నాడు.

"శిబిర అధ్యక్షులకు.. పండిత ప్రకాండ్రులకు నమస్సులు. అసలు ఈ రాజు, మహారాజు, రాజాధిరాజు, చక్రవర్తి.. ఈ బిరుదులకు వివరణ కోరుతున్నాను. ఈ పదాలు వీటి అర్థాలు ఏవిటి.. ఎవరిని మహారాజు అనాలి.. ఎవరిని చక్రవర్తి అనాలి. నిన్న ఆ ధూర్తుడు మమ్మల్ని అవమానించాడు. నేను చక్రవర్తి అన్న మాటకు అర్హుడిని కాదు అని. అలా పొగిడించుకోవడం.. నేను పొగిడించుకుంటున్నానని.. వాడు అనడం నన్ను బాధించింది. కాస్త ఆ అంశాలపై వివరణ ఇవ్వవలసినదిగా మనవి.."

వెంటనే తిక్కనామాత్యుడు స్పందించారు.

"మహారాజా.. నిన్నటి ఆ దురదృష్ట సంఘటన మిమ్మల్ని ఎంత బాధించిదో మా అందరిని అంతే బాధించింది."

సభలోని పండితులంతా అవునవునన్నట్లు స్పందించారు.

"అయితే నిజానికి ఆ పదాలు పొగడ్తలు కాదు మహారాజా. అవన్నీ పాలకులకున్న పదవులు లేదా హోదాలు.

చాలా పవిత్రమైనవి. వాటి వివరణలు హైందవ గ్రంథాలలోనే కాదు బౌద్ద జైన గ్రంథాలలో కూడా ఉన్నాయి. వాటిని సభకు వివరించి చెప్పగల ప్రతిభా మూర్తులు ఇక్కడే.. మన మధ్యే ఉన్నారు."

తల తిప్పి శిబిరానికి హాజరయిన పండితులను పరికించి చూస్తూ అన్నాడు.

"సంకల్పభట్టుగారూ, జినేంద్రరాయుడు గారు, బేతనప్రగ్గడ గారు ఎన్నో ధర్మశాస్త్రాలను మధించిన వారు. దక్షిణావర్తంలోనే కాదు ఉత్తరభారతంలోని అనేకానేక రాజాస్థానాలలో పండితప్రకాండ్రులతో చర్చలతో తలపడిన.. తల పండినవారు. మీరు.. మన మహారాజుగారికే కాదు.. మా అందరికి ఈ పదాలు, హోదాలపై కొంత వివరణ ఇవ్వవలసినదిగా మహాపండితులారా.. మిమ్మల్ని కోరుతున్నాను.."

గణపతిదేవుడు శిబిరంలోకి ప్రవేశిస్తున్నప్పుడు కూడా వందిమాగధులు తమ స్తోత్ర పాఠాలు ప్రారంభించగా, ఆయన ఆపమన్నట్లు చేయెత్తాడు. దాంతో ఈరోజు వాళ్లు చదివే స్తోత్రపాఠాలు ఎలా ఉంటాయో అనే ఉత్కంఠకు తెరపడింది. శిబిరం అధ్యక్షుడు తిక్కనా మాత్యుడు మాత్రం ఎప్పటిలాగే ఆనాటి చర్చాంశం ప్రకటించారు.

సంకల్పభట్టు గోదావరి తీరస్తగ్రామం ముంగడ నుండి వచ్చారు. ఆయన పండిత సంచారి. కాస్త కురచగా.. ఛామన చాయలో కనిపిస్తున్నారు. లేచి మహారాజుకు, తిక్కనకు నమస్కరించి మాట్లాడబోగా కూర్చుని మాట్లాడ వలసినదిగా తిక్కన చేయితో సౌంజ్ఞ చేశారు. సంకల్పభట్టు పద్మాసనంలో కూర్చుని మాట్లాడారు.

"మహాకవులు తిక్కనార్యులు చెప్పినట్లు ఈ పదాలు బహు పవిత్రమైనవి. ప్రపంచ నాగరికతలలో ఒకటైన భరతఖండంలో గణరాజ్యాల కాలంలోనే గణ నాయకుడిని 'రాజన్' అనే పదంతో గౌరవించేవారు. అప్పుడే హైందవ, జైన, బౌద్ద ప్రవక్తలు, చార్వాకులు, లోకాయుతులు, వైతండికులు, పాషండులు, కాపాలికులు, దిగంబరులు, పాశుపతులు.. మొదలైన ప్రవక్తలు కూడా పాలకుడు అంటే రాజు పదమే చెప్పారు. రాచరిక వ్యవస్థను సమర్థించారు. భారతీయ రాజ్యవ్యవస్థకు సరైన దిశానిర్దేశం చేసినవాడు చాణక్యుడు. ఆయన రాసిన అర్థశాస్త్రమే ఇప్పటికీ మన పాలకులకు ప్రధాన రాజనీతి శాస్త్రం. "రాజా రాజ్యం ఇతి ప్రకృతి సంక్షేపః" అంటాడాయన. అంటే 'రాజ్యం అంటే రాజు.. రాజు అంటే రాజ్యం' అన్నాడు కాని చక్రవర్తి పదాన్ని వాడలేదు. అప్పటికి రాజే గొప్ప. తర్వాత కాలంలో 'నా విష్ణుః పృథ్వీపతిః' అనే మాట పుట్టింది. కాని చక్రవర్తి పదం వరకు వచ్చేసరికి పాలకుని గుణగణాలు మారిపోయాయి. చక్రవర్తి అనే పాలకునికి నిజంగానే దైవత్వ స్థాయి ఉండాలన్నారు రాజనీతి శాస్త్ర కారులందరూ."

తర్వాత జినేంద్రరాయుడు జైనమత గ్రంథాలలోని అంశాలను వివరించాడు.

"మతాలలో అత్యంత ప్రాచీన మతం జైనం. అసలు భరతుడు అనే మహారాజు లేదా చక్రవర్తి పాలించిన నేలనే భారతదేశం అన్నది జైన గురువులే. అబ్బో.. జైన గ్రంథాలలో కూడా చక్రవర్తిని మహోన్నతంగా చిత్రీకరించారు. ప్రాచీన జైన రచనల్లో ఈ చక్రవర్తి అనేవాళ్లు నాలుగు వర్గాలు.. బంగారు చక్రాల రథం కలిగినవాడు, వెండి చక్రాల రథం, రాగి చక్రాల రథం, ఇనుపచక్రాల రథం కలిగినవాడు అనే నాలుగు వర్గాలుగా చెప్పారు. బంగారు చక్రవర్తి నాలుగు ఖండాలతో పరివేష్టితమై ఉన్న సుమేరు పర్వత రాజ్యానికి పాలకుడు. వెండి చక్రవర్తి తూర్పు, పడమర, దక్షిణ ఖండాలను పరిపాలకుడు, రాగి చక్రవర్తి ఉత్తర, దక్షిణ ఖండాల పాలకుడు, ఇనుప చక్ర రథికుడు కేవలం దక్షిణ ఖండం... అంటే జంబూద్వీప పాలకుడు. ఇలా జైనం చక్రవర్తిని నిర్వచించింది. అంటే సర్వ మానవ సమాజాన్ని పరిపాలించగల గొప్ప నాయకుడినే చక్రవర్తి అనాలని జైనమతం చేసిన నిర్వచనం."

తర్వాత బేతన ప్రగ్గడ ప్రసంగిస్తూ బౌద్ధంలో చక్రవర్తి గురించి చెప్పిన అంశాలు వివరించాడు.

"బౌద్ధంలో చక్రవర్తికి ఇచ్చిన గౌరవం, హోదా, స్థాయి చాలా ఎక్కువ. బౌద్ధ జాతకకథల్లో బుద్దుని ముందు దశల్లో వచ్చే రాజులంతా చక్రవర్తులే. దైవానికి ప్రతీక అయిన చక్రవర్తి హోదాకు తగ్గట్లు మరికొన్ని విలువలను జోడించారు. చక్రవర్తి హోదాకు తగ్గట్లు కొన్ని రాచరిక విలువలను కల్పించారు. చక్రవర్తి అంటే చక్రం, ఏనుగు, గుర్రం, రత్నరాసులు, రత్నం లాంటి భార్య/భార్యలు, గొప్ప మంత్రులు, గొప్ప యుద్ధయోధులు.. అనే ఈ ఏడు సంపదలు కలిగి ఉండాలి. గొప్ప పరిపాలకుడైన చక్రవర్తి పూర్తిగా మతాతీతంగా, రాగద్వేషాలకు అతీతంగా ఉండాలి. బౌద్ధం రాచరికాన్ని ఒప్పుకున్నా ఎవడు పడితే వాడ్ని చక్రవర్తి అనడం.. అంగీకరించలేదు."

తర్వాత తిక్కనామాత్యుని అనుజ్ఞతో మరికొందరు తమ తమ అభిప్రాయలు చెప్పారు.

చివరగా ఆయన ముక్తాయించాడు.

"హైందవం కూడా చక్రవర్తి అనే హోదా దాదాపు భగవంతునితో సమానమన్నది. మహారాజు సాక్షాత్తూ దైవం.. లేదా దేవుని ప్రతిరూపం. అలాగే చక్రం రాజుకు, ధర్మానికి, శౌర్యానికి, సత్పరిపాలనకు ప్రతీక.

చక్రవర్తి అనిపించుకోవాలి అంటే అశ్వమేధయాగం చెయ్యాలి. అంటే యాగాశ్వాన్ని వదలినప్పుడు దానిని ఎవ్వరైనా బంధిస్తే మహారాజు అతన్ని ఓడించాలి. అతని రాజ్యాన్ని తన సామ్రాజ్యంలో కలిపేసుకోవాలి. అలా అలా జయించుకుంటూ మొత్తం విశ్వాన్ని జయించిన వాడే చక్రవర్తి. చక్రం అంటే కదిలేది. రాజ్యాన్ని కదిలించే వాడు, ఎదుటి వాడెవ్వడూ కదిలించలేనివాడు చక్రవర్తి. చక్రం అనేది ఎదురులేని శక్తి. అది యుద్ధశక్తి కావచ్చు పరిపాలనా శక్తి కావచ్చు. ఎవ్వడినైనా జయించే శక్తి కావచ్చు. ఎవ్వడూ జయించలేని శక్తి కావచ్చు. 'వర్తి' అంటే కదిలించేవాడు. అది రాజ్యం కావచ్చు రథం కావచ్చు. మాట కావచ్చు. చక్రవర్తి రథాన్ని ఎవ్వడూ ఆపలేడు. అంటే ఆయన రథానికి ఎదురులేదు. ఆయన మాటకు తిరుగులేదు. అలా రథానికి, రాజ్యానికి, ఇచ్చిన మాటకు ఎదురు లేకుండా అంటే దుర్నిరీక్ష్యంగా అద్భుతంగా పాలించగలవాడు మాత్రమే చక్రవర్తి.

రాజు నుండి మహారాజు, రాజాధిరాజు, రాజేంద్రుడు.. ఇలా వంది మాగధులు, భట్రాజులు పాలకుని రకరకాలుగా పొగడటం అంటే స్తోత్ర పాఠాలలో వర్ణనలు ఉండొచ్చు. కాని చక్రవర్తి అనే పదాన్ని మాత్రం ఆచితూచి వాడాలి.

మహారాజు.. రాజాధిరాజు అని పిలిపించుకున్న రాజులు కూడా చక్రవర్తి అనిపించుకోవడానికి తటపటాయించే వారు. ఈ ఆధునిక కాలంలో చక్రవర్తి పిలుపు సాధారణ రాజులకు కూడా వాడటం.. ప్చ్.. విలువల పతనమే మహారాజా! అందుకే ఎక్కడైనా అలాంటి పిలుపులు విన్నప్పుడు కొందరు రాజులు తమ శత్రురాజులను నాగతి మహారాజులాగా హేళన చేస్తున్నారు.."

''మహారాజు, రాజాధిరాజు అనే గౌరవ సంబోధనలు కూడా రాజ్య వైశాల్యాన్ని బట్టి ఆ రాజు విజయాలను బట్టి ఉండేవి. రాజ్య వైశాల్యం పెంచుకోవడం తేలికే కాని పాలించడం చాలా కష్టం. చక్రవర్తి అనిపించుకోవడం నిజంగా అందుకు తగిన గొప్ప శక్తిసామర్థ్యాలు.. పరిపాలనా ప్రతిభ ఉండాలి మహారాజా."

ఆ రోజంతా సుదీర్ఘంగా ఉపన్యసించి రాజు అనే పాలకుని ఏయే పదాలతో.. ఏయే సందర్భాలలో.. సంబోధించాలో పండితులు చెప్పారు. చక్రవర్తి అంటే సామాన్య పదవి, హోదా కాదని.. చక్రవర్తిగా నిజంగా పిలిపించుకోవాలంటే అసామాన్యులై ఉండాలని శిబిరం మొత్తంగా అభిప్రాయపడింది.

చర్చ పూర్తయ్యాక గణపతిదేవుని ముఖంలో కొంత ప్రసన్నత ఏర్పడింది. ఆయన దీర్ఘాలోచనలో ఉండిపోయాడు. కాసేపటికి కదిలి చర్చలో పాల్గొన్న సంకల్పభట్టుకి, బెతనప్రగ్గడకు, జినేంద్ర రాయనికి.. తదితర పండితులకు నమస్కరించాడు.

అనంతరం తన సభాసహాయకుడు మయిదేవుని

మహారాజు.. రాజాధిరాజు అని పిలిపించుకున్న రాజులు కూడా చక్రవర్తి అనిపించుకోవడానికి తటపటాయించే వారు. ఈ ఆధునిక కాలంలో చక్రవర్తి పిలుపు సాధారణ రాజులకు కూడా వాడటం.. ప్చ్.. విలువల పతనమే మహారాజా! అందుకే ఎక్కడైనా అలాంటి పిలుపులు విన్నప్పుడు కొందరు రాజులు తమ శత్రురాజులను నాగతి మహారాజులాగా హేళన చేస్తున్నారు..

పిలిచి ఏదో చెప్పాడు. అతడు పరుగున బయటకు వెళ్లాడు.

కాసేపటికి బందీగా ఉన్న నాగతి మహారాజును మందిరంలోకి తీసుకునివచ్చి గణపతిదేవుని ముందు నిలబెట్టాడు. పూర్తిగా తలవాల్చి నిలుచున్నాడు నాగతి భూపాలుడు.

సభ అంతా నిశ్శబ్దంగా చూస్తోంది. గణపతి దేవుడు ఆ నాగతిమహారాజును మళ్లీ ఎందుకు సభలోకి పిలిపించాడు అని పెద్దలంతా గుసగుస లాడుతున్నారు. గణపతిదేవుడు సింహాసనం దిగివచ్చి నాగతి బంధనాలు స్వయంగా తొలగించాడు. అతన్ని గౌరవంగా నడిపించి దగ్గరున్న మరో ఉచితాసనంపై కూర్చోబెట్టాడు.

సభనుద్దేశించి..."నాగతిమహారాజు నా కళ్లు తెరిపించాడు. నన్ను ఎవరు.. ఎందుకు.. ఏ అధికార నామంతో పిలుస్తున్నారో.. ఆ నామం అర్థం నిన్న ఈ మహారాజు నన్ను హేళనగా మాట్లాడినప్పుడు అర్థమైంది. స్తోత్ర పాఠంలోని పదాలకు అర్థాలు నాకు నిజంగా తెలియదు. నాగతి తన మాటలతో నా కళ్లు తెరిపించాడు. చక్రవర్తి అనే పదానికి నేను ఏ మాత్రం అర్హుడిని కాదు. నేను తెల్లవార్లు ఆలోచించాను. ఇప్పుడొక ప్రకటన చేస్తున్నాను. ఇకపై నన్నెవ్వరూ చక్రవర్తిగా సంబోధించరాదు. నేను కేవలం రాజును, మహారాజును మాత్రమే. వేరువేరు మండలాలను పాలించేవారు మండలాధ్యక్షులయితే నేను మహా మండలాధ్యక్షుడను లేదా మహా మండలాధీశుడను. అంతేకాని ఇతర పదవులతో పొగడ్తలతో నన్ను పిలువరాదు. సంభోదించరాదు. అని ఈ శిబిరం ద్వారా నేను అర్థం తెలుసుకుని.. అర్థం చేసుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. సమస్త నియోగాలకు, సామంతులకు, మహా సామంతులకు, మన మండలా ధ్యక్షులకు అధికారిక వర్తమానం పంపించండి. ఇది నా ఆజ్ఞ!!"

శిబిరం గంభీరంగా ఆలకించింది. లేచి నిలబడి తలవంచి శిరసా వహించినవాడు మహాప్రధాని గంగాధర మంత్రి!

అప్పుడు శిబిరాధ్యక్షుడు తిక్కనామాత్యుడు "ఏదో ఒకనాడు మిమ్మల్ని చక్రవర్తి అని పిలిచే భాగ్యం మాకు లభిస్తుంది ప్రభూ! మీరు మొత్తం తెలుగుసీమను ఏకం చేసి తెలుగుసామ్రాజ్యాన్ని.. ఆంధ్రసామ్రాజ్యాన్ని స్థాపించాలి. తెలుగు మాట్లాడే ఈ భూమిపై గతంలో విస్తృత రాజ్యాన్ని స్థాపించి పాలించిన శాతవాహనులు, చోళులు, చాళిక్యులు, రాష్ట్రకూటులు.. ఎవ్వరూ తెలుగువా రు కాదు. తమ మాతృభాష తెలుగు కాదని ఇటీవల వారే విస్పష్టంగా ప్రకటించారు. తెలుగు సామ్రాజ్యాధినేత కాగలిన.. తెలుగు మాతృభాషగా కలిగిన మహారాజు, మహామండలేశ్వరులు మీరొక్కరే. ఆ అర్హతలు, ఆ సమర్థత మీకొక్కరికే ఉన్నాయి. మీరొక్కరే ఏకైక తెలుగుజాతి కన్న మహా నాయకులు. కాబట్టి మీరొక్కరే అందుకు అర్హులు. నేను.. మేము బతికి ఉండగా మీరు తెలుగు సామ్రాజ్యాన్ని స్థాపిస్తారని మనసా వాచా కర్మణా నమ్ముతున్నాము. మా నమ్మకాన్ని నిలబెట్టవలసినదిగా చేతులెత్తి మొక్కుతున్నాము.."

(సశేషం)



సోమాలీల్యాండ్ గుర్తిం ఇజ్రాయెల్ పటిష్ట

సోమాలియా నుంచి మూడు దశాబ్దాల క్రితం విడివడి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న సోమాలీల్యాండ్‌ను స్వతంత్రదేశంగా గుర్తిస్తూ డిసెంబర్ 26న ఇజ్రాయెల్ తీసుకున్న సంచలనాత్మక నిర్ణయం ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. దీనిపై తక్షణమే స్పందించిన సోమాలియా, ఇది తమ సార్వభౌమాధికారంలోకి తలదూర్చే చర్య అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసి, ఇజ్రాయెల్ నిర్ణయాన్ని ఖండించింది. టర్కీ, సౌదీ అరేబియా, ఆఫ్రికన్ యూనియన్‌కు చెందిన డజన్ల సంఖ్యలో దేశాలు ఇజ్రాయెల్ తీసుకున్న ఈ ఆశ్చర్యకర నిర్ణయంపై తమ నిరసనను వ్యక్తం చేశాయి. చైనా కూడా వీటికి వంతపాడటం విశేషం.

ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి లియాంగ్ జియాంగ్ మాట్లాడుతూ, ఒక దేశం మరొక దేశంలోని వేర్పాటువాదశక్తులకు మద్దతివ్వడం లేదా ప్రోత్సహించడం చేయకూడదని సుద్దులు చెప్పారు. చైనా ఎప్పుడూ తాను చెప్పేది చేయదు, చేసేది చెప్పదు! ఇది దాని నైజం! సహజంగానే యు.ఎస్. ఐక్యరాజ్య సమితి అత్యవసర సమావేశంలో ఇజ్రాయెల్‌ను సమర్థించింది. ఈ ఏడాది మొదట్లో పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితిలో చాలా దేశాలు తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా వ్యతిరేకించడం గమనార్హం. ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయెల్ డిప్యూటీ రాయబారి మాట్లాడుతూ, ఈ నిర్ణయం సోమాలియాపై వ్యతిరేకతతో తీసుకున్నది కాదనీ, ఆ దేశానికి చెందిన ఇరుపక్షాల మధ్య చర్చలకు తాము తీసుకున్న నిర్ణయం అడ్డంకి కాబోదనీ అన్నారు. గుర్తింపు అనేది తిరస్కారపూరిత చర్య కాదు, ఇది ఒక అవకాశం మాత్రమేనని ఆయన చెప్పుకొచ్చారు.

ఒకప్పటి బ్రిటిష్ వలస

1991లో సోమాలియా సైనికపాలకుడు సయ్యద్ బర్రే పదవీచ్యుతుడయిన తర్వాత గల్ఫ్ ఆఫ్ ఈడెన్ తీరప్రాంతానికి చెందిన సోమాలీల్యాండ్ స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. అంతకుముందు సయ్యద్ బర్రే దళాలకు, తిరుగుబాటుదార్లకు మధ్య తీవ్రస్థాయిలో జరిగిన ఘర్షణలో వేలాదిమంది ప్రజలు ప్రాణాలు కోల్పోగా, పట్టణాలు ధ్వంసమయ్యాయి. సోమాలీల్యాండ్ స్వాతంత్ర్యం ప్రకటించుకున్నప్పటికీ, ప్రపంచంలో ఏ దేశం గుర్తించలేదు. ఇదేమీ పట్టించుకోని సోమాలీల్యాండ్ సొంతంగా రాజకీయ, పోలీసు, ప్రభుత్వ సంస్థలను నిర్వహించడమే కాదు, సొంత కరెన్సీని కూడా ఏర్పాటు చేసుకుంది. 19వ శతాబ్దంలో సోమాలియా బ్రిటిష్ వలస దేశం. అప్పట్లో బ్రిటిష్ సోమాలీల్యాండ్ అని పిలిచేవారు. 1960లో ఇది ఇటాలియన్ సోమాలీల్యాండ్‌తో కలిసిపోయింది. సోమాలీల్యాండ్‌లో నివసించే ఇసాక్ తెగ, మిగిలిన సోమాలియా భూభాగానికి చెందిన ప్రజలకు భిన్నం కాబట్టి, తమకు స్వాతంత్ర్యం కావాలనేది అక్కడి స్వాతంత్ర్య కాంక్షాపరుల డిమాండ్. అదీకాకుండా సోమాలీల్యాండ్ జనాభా ఆరు మిలియన్లు. వీరు శాంతి, సుస్థిరతలతో జీవనం గడుపుతున్నారు. ఇస్లామిక్ మిలిటెంట్ల దాడులతో నిత్యం అగ్నిగుండంగా రగులుతున్న సోమాలియాతో కలవడానికి సోమాలీల్యాండ్ ప్రజలు ఒప్పుకోవడం లేదు. సోమాలియా ప్రభుత్వం మాత్రం, సోమాలీల్యాండ్ తమ దేశంలో అంతర్భాగమని, దీనిని స్వతంత్ర దేశంగా గుర్తించడమంటే తమ దేశ సార్వభౌమాధికారాన్ని ధిక్కరించినట్టేనని ప్రకటించింది. సోమాలియా అధ్యక్షుడు హసన్ షేక్ మహమ్మద్, దేశ రాజధాని మొగదిషులో మాట్లాడుతూ, సోమాలీల్యాండ్‌ను ప్రత్యేక దేశంగా ఇజ్రాయెల్ గుర్తించడం తమకు బయట నుంచి ముప్పుగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు.

సోమాలీల్యాండ్‌కు సహకారం

డిసెంబర్ 26న ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు, సోమాలియా అధ్యక్షుడు హసన్ షేక్ మహమ్మద్‌కు ఫోన్ చేశారు. "మేం సోమాలీల్యాండ్ స్వీయ నిర్ణయాధికారానికి మద్దతిస్తున్నాం" అని చెప్పడమే కాదు, ఈ విధంగా తాము గుర్తించడం, ఆ దేశంతో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకునే ప్రయత్నంలో భాగమేనని స్పష్టం చేశారు. వ్యవసాయం, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానం విషయంలో సోమాలీల్యాండ్‌కు పూర్తి సహాయ సహకారాలందిస్తామని స్పష్టం చేయడం గమనార్హం.

వ్యూహాత్మక కారణం

ఇంతకాలం మౌనం దాల్చిన ఇజ్రాయెల్ ఇప్పుడు ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నదన్న సందేహం రావడం సహజమే. ఇందుకు ఒక వ్యూహాత్మక కారణం ఉంది. ఎర్రసముద్రం ప్రాంతంలో హౌతీలను ఎదుర్కోవడానికి తనకు ఒక సహచర మిత్రదేశం అవసరం. ఇజ్రాయెల్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ మేధావులు ఇటీవల ఒక నివేదికను రూపొందించారు. దీని ప్రకారం యెమెన్‌లో, ఇరాన్ మద్దతులో పనిచేస్తున్న ఉగ్రవాదులను ప్రస్తావిస్తూ, ఇదేమాదిరిగా తన కార్యకలాపాల నిర్వహణకు ఇజ్రాయెల్‌కు కూడా మద్దతుగా ఒక దేశం అవసరమని స్పష్టం చేశారు. సోమాలీల్యాండ్ ఇందుకు అనువైన దేశంగా ఇజ్రాయెల్ గుర్తించింది. హౌతీలను ఎదుర్కొనాలంటే సోమాలీల్యాండ్‌తో చెలిమి తనకు ఉపయోగకరమన్న నిర్ణయానికి రావడమే, దాని స్వాతంత్ర్యాన్ని గుర్తించడం వెనుక ప్రధాన కారణం.

హౌతీల హెచ్చరిక

2023 అక్టోబర్‌లో గాజా యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇజ్రాయెల్ పదే పదే యెమెన్‌లోని హౌతీల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు నిర్వహించింది. ఇక్కడ తిరుగుబాటుదారులు, పాలస్తీనియన్లకు మద్దతు ప్రకటించడమే తమ దాడులకు కారణమని ఇజ్రాయెల్ సమర్థించుకుంటూ వచ్చింది. ఇదిలా వుండగా సోమాలీల్యాండ్‌ను, ఇజ్రాయెల్ గుర్తించడాన్ని కేవలం తమను లక్ష్యంగా చేసుకోవడంగానే పరిగణిస్తామని హౌతీలు హెచ్చరించారు. ఇప్పుడు సోమాలీల్యాండ్‌ను తనకు ఒక అసెట్‌గా ఇజ్రాయెల్

భావిస్తే, హౌతీలు దీన్ని తమ టార్గెట్‌గా ఎంచుకోవడం తథ్యంగా కనిపిస్తున్నది. గాజా నుంచి తరిమేసిన పాలస్తీనియన్లకు పునరావాసం కల్పించేందుకు సోమాలీల్యాండ్‌ను ఇజ్రాయెల్ సంప్రదించినట్టు కొద్దినెలల క్రితం వార్తలు వచ్చాయి. వీటిపై ఇజ్రాయెల్ నుంచి ఎటువంటి ప్రతిస్పందన లేనప్పటికీ, సోమాలీల్యాండ్ మాత్రం, తమ స్వాతంత్ర్యాన్ని గుర్తించడానికి, పాలస్తీనా సమస్యకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. అయితే

ంపు వెనుక వ్యూహం!!

సోమాలియా, పాలస్తీనా అథారిటీలు మాత్రం సోమాలీల్యాండ్‌ను గుర్తించడం వెనుక పాలస్తీనీయులను అక్కడికి తరలించే ప్రణాళిక ఉన్నదని గట్టిగా నమ్ముతున్నాయి. పాలస్తీనియన్లను తరలించే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని సోమాలియా అధ్యక్షుడు హసన్ షేక్ మహమ్మద్ పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. అయితే ఎర్రసముద్రం ప్రాంతంలో ఇరాన్ ప్రాబల్యాన్ని అడ్డుకోవాలన్నది ఇజ్రాయెల్ వ్యూహం. ముఖ్యంగా ఎర్రసముద్రం ప్రాంతంనుంచి ఆయుధాలు, తీవ్రవాదులు యధేచ్ఛగా తూర్పు మెడిటరన్ సముద్రంలోకి ప్రవేశించి అక్కడినుంచి గాజాకు చేరుకుంటున్నారు. ఆవిధంగా గాజాకు ఆయుధాలు, పోరాటదారుల సరఫరాకు ఎర్రసముద్రం ఒక సంప్రదాయక మార్గంగా మారిపోయింది. ఇది తన భద్రతకు పెనుముప్పుగా మారిన నేపథ్యంలో, ఎర్రసముద్రం ముఖద్వారం వద్దనే తమ సైనికులను మోహరించినట్లయితే, ఈ సరఫరాను పూర్తిగా అరికట్టవచ్చునని ఇజ్రాయెల్ విశ్వసిస్తోంది.

ముస్లిందేశాల ఖండన

సోమాలీల్యాండ్‌ను గుర్తించడంలో ఇజ్రాయెల్‌కు బలమైన కారణాలున్నప్పటికీ, సౌదీఅరేబియా, టర్కీ, ఈజిప్ట్, ఆఫ్రికన్ యూనియన్, యెమెన్, సూడాన్, నైజీరియా, లిబియా, ఇరాన్, ఇరాక్, ఖతర్, పాకిస్తాన్, చమురు ఎగుమతి చేసే దేశాలు (ఓఐసీ) దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఇజ్రాయెల్ చర్య సోమాలియా ప్రాదేశిక సమగ్రతకు భంగమనేది వాటి వాదన. తమకు తామే స్వేచ్ఛను ప్రకటించుకునే ప్రాంతాలు కేంద్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా ఇతర దేశాలతో స్నేహసంబంధాలు నెరపడం, తీవ్ర స్థాయి అస్థిరతలకు దారితీస్తుందనేది కొందరి విశ్లేషకుల అభిప్రాయం. అయితే సోమాలీల్యాండ్ పట్ల సానుభూతి ఉన్న దేశాలు ప్రస్తుత పరిణామంపై మౌనం పాటిస్తున్నాయి. ఉదాహరణకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సోమాలీల్యాండ్‌లో ఒక నౌకా స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంది. ఇజ్రాయెల్ తీసుకున్న నిర్ణయంపై యూఏఈ నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ముఖ్యంగా యూఏఈకి, ఇజ్రాయెల్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈవిషయంలో ఆ దేశం, ఇజ్రాయెల్‌కే మద్దతుగా ఉంటుందనేది సుస్పష్టం. ముఖ్యంగా ఎర్రసముద్రం ప్రాంతంలో ఇరుదేశాలకు పరస్పర ప్రయోజనాలు ఉండటం కూడా ఇందుకు కారణం. ఇథియోపియా కూడా ఈ పరిణామంపై ఏవిధమైన వ్యాఖ్య చేయలేదు. ఎందుకంటే ఈ దేశానికి సముద్రతీరం లేదు. గత ఏడాది సోమాలీల్యాండ్, ఇథియోపియాకు తన తీరప్రాంతంలోని కొంత భాగాన్ని లీజుకు ఇచ్చింది. దీనిపై సోమాలియా ఆగ్రహించడంతో టర్కీ రంగంలోకి దిగింది. ఇథియోపియా, సోమాలియాలకు మధ్యవర్తిత్వం వహించి, ఇరుదేశాల మధ్య ఒక ఒప్పందం కుదరడంలో సహాయపడింది. దీని ప్రకారం ఇథియోపియా, సోమాలియా ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తుంది. ఈ నేపథ్యంలో ఇథియోపియా మౌనంగానే ఇజ్రాయెల్ ఏకపక్ష నిర్ణయానికి మద్దతు పలకవచ్చు. కాకపోతే దీనిపై వేచిచూసే ధోరణి అవలంబించే అవకాశముంది. ఇదిలావుండగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన నేపథ్యంలో, ఆయన తన పదవీకాలంలో తప్పక గుర్తిస్తాడన్న ఆశ సోమాలీల్యాండ్‌కు ఉంది. ఎందుకంటే రెండోసారి ఎన్నికల ప్రచారంలో డోనాల్డ్ ట్రంప్ నుంచి ఇటువంటి సూచనలు వెలువడ్డాయి. కానీ విచిత్రంగా ట్రంప్ న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో "సోమాలీల్యాండ్ విషయంలో నేను నెతన్యాహు బాటలో వెళ్లను" అని చెప్పడం సోమాలీల్యాండ్ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఇక ఐరోపా సమాఖ్య దేశాలు, యు.కె.లు సోమాలియా ప్రాదేశిక సమగ్రతను చూపుతూ, సోమాలీల్యాండ్‌ను గుర్తించడానికి నిరాకరించాయి.

గుర్తించని భారత్

హార్న్‌ఆఫ్ ఆఫ్రికాదేశమైన సోమాలీల్యాండ్‌ను భారత్ త్వరలో గుర్తిస్తుందన్న ఊహాగానాలకు మన విదేశాంగశాఖ అడ్డుకట్ట వేసింది. ఈ ఊహాగానాలకు ఒక కారణముంది. సోమాలీల్యాండ్‌కు చెందిన బెర్బరాపోర్ట్ కారిడార్ వాణిజ్యపరంగా ఎంతో కీలకం. ముఖ్యంగా ఇథియోపియా మార్కెట్ దీని ద్వారా అనుసంధానం కాగలదు. ఇప్పుడు సోమాలీల్యాండ్‌ను చైనా గుర్తించని నేపథ్యంలో, వాణిజ్యపరం గా తన ప్రత్యర్థిని దెబ్బకొట్టడానికి భారత్ సోమాలీల్యాండ్‌ను గుర్తిస్తుందన్నది వాటి సారాంశం. అయితే భారత్ అటువంటిదేమీ లేదని నిర్ద్వంద్వంగా చెప్పింది. ఇదిలావుండగా కొన్ని అనధికార వార్తల ప్రకారం, భారత్‌లోని సోమాలియా రాయబారి, సోమాలీల్యాండ్‌కు మారిపోవడంతో, సోమాలియా పార్లమెంట్ అతడిని సస్పెండ్ చేసిందని ధ్రువీకరించని వార్తలు వెలువడ్డాయి. నిజం చెప్పాలంటే సోమాలీల్యాండ్‌కు చెందిన హర్గేసియా, బెర్బరా, బురావో పట్టణాలు ప్రధాన ఆర్థిక కేంద్రాలుగా ఉన్నాయి. హార్న్ ఆఫ్ ఆఫ్రికా దేశమైన సోమాలీల్యాండ్‌కు పక్కనే ఉన్న గల్ఫ్ ఆఫ్ ఈడెన్, బాబ్ అల్ మండెబ్ జలసంధి హిందూ మహాసముద్రాన్ని, ఎర్రసముద్ర తీరం గుండా మెడిటరన్ సముద్రానికి అనుసంధానిస్తాయి. ప్రపంచంలోనే అత్యంత రద్దీ అయిన నౌకా వాణిజ్య మార్గం ఇది. అయితే 2023 నుంచి హౌతీ తీవ్రవాదులు యెమెన్ నుంచి ఈ మార్గం గుండా ప్రయాణించే ఇజ్రాయెల్, యు.ఎస్.తో పాటు వీటి మిత్రదేశాల వాణిజ్య నౌకలపై డ్రోన్ దాడులకు పాల్పడుతుండటంతో ఈ ప్రాంతంలో పూర్తి అభద్రత నెలకొంది. సోమాలీల్యాండ్‌లో యు.ఎస్, ఇజ్రాయెల్, తైవాన్ దేశాల ప్రతినిధులున్నారు. ఇథియోపియా, యూఏఈ దేశాలు సోమాలీల్యాండ్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాయి. ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ గుర్తింపు లేకపోవడంతో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల వద్దకు వెళ్లలేకపోవడం సోమాలీల్యాండ్ ఆర్థికాభివృద్ధికి పెద్ద అవరోధంగా మారింది.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

నాటి సంక్రాంతిలో

సంక్రాంతి అంటే ఉత్సాహ పడనివారు ఉండరు. ముఖ్యంగా పల్లె సీమల్లో ఈ పండుగకు విశేష ప్రాధాన్యం ఉంది. పుష్య మాస బహుళ పక్షంలో వచ్చే తెలుగువారి ఈ పెద్ద పండుగ సమాజంలోని అన్ని వర్గాలకు ఆనందదాయకమైనది. దీనిని పెద్దల పండుగ, పంటల పండుగ, పశువుల పండుగ అనీ అంటారు. ఆ రోజున పితృదేవతలను స్మరిస్తూ దానధర్మాలు చేస్తారు. ప్రధానంగా కర్షకులకు అతి ముఖ్యమైనది. ధాన్యసిరులు కురిపించి వారి కళ్లలో ఆనంద కాంతులు నింపే పండుగ. అలసట చెందిన హృదయాల్లో ఒక్కసారిగా నవ్యశోభను నింపుతుంది. అప్పటివరకు గల కష్టాలను మరపింపచేస్తుంది.అయితే హార్దిక సంబంధాలను ఆర్థిక సంబంధాలు శాసిసున్న వేళ ఈ పండుగను ఎలా చేసుకుంటున్నాం!?

సంక్రాంతి ఆనందానికి, ఆరోగ్యానికి, ఐశ్వర్యానికి ప్రతీక. 'సం' అంటే మిక్కిలి, 'క్రాంతి' అంటే ప్రగతి పూర్వక మార్పు. 'సంక్రమణం' అంటే 'చక్కగా క్రమించడం' అంటే 'నడవడం' అని భావం. సమస్త ప్రాణులకు జీవప్రదాత సూర్యభగవానుడు పుష్య మాసంలో మకరరాశిలో ప్రవేశించడమే మకర సంక్రాంతి. ఆనాడు సూర్యారాధనకు ప్రత్యేక ప్రాధాన్య మిస్తారు. దక్షిణాయనానికి వీడ్కోలు పలుకుతూ ఉత్తరాయణానికి స్వాగతం పలుకుతుంది. మకర సంక్రమణాన్ని భోగి, మకర సంక్రాంతి, కనుమ పేర్లతో మూడు రోజులు పండుగను జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో నాలుగో రోజున కూడా పండుగ (ముక్కనుమ) చేసుకుంటారు.

ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభంతో ఉష్ణోగ్రతలలోనూ మార్పులు వస్తాయి. సూర్యకిరణాల్లో తీక్షణ హెచ్చుతుంది.

భోగి

భోగాలనిచ్చేది భోగి అని అర్థం చెబుతారు. భోగి అంటే ఉత్తమ యోగం. ఎలాంటి పరిణామాలనైనా సానుకూలంగా స్వీకరించి ముందుకు సాగాలని ఈ పండుగ బోధిస్తుంది. అమంగళాలు తొలగిపోయి, అసలైన భోగాలు ప్రసాదించాలని కోరుతూ అగ్నిహోత్రుడిని పూజించడం ఆనాటి విశేషం. రాగద్వేషాది దుర్గుణాలను, కోపతాపాలను, అజ్ఞానాన్ని దహింప చేసుకోవడమే భోగి మంటల పరమార్థం. ఆ రోజు వేకువజామున భోగిమంటలు వెలిగించి పాత వస్తువులు/సామగ్రిని అందులో వేస్తారు. దాంతో తమ దారిద్ర్యం నశిస్తుందని కూడా విశ్వసిస్తారు. భోగి మంటలంటే పనికిరాని సామగ్రిని కాల్చివేయడం కాదని, నిరుపయోగ వస్తువులు/ పదార్థాలను అగ్నికి ఆహుతి చేసినట్లే, మన మనసులోని వికారాలను కాల్చివేయాలనే తత్వంతో ఏర్పడినదే భోగి మంటలని పెద్దల మాట. జడత్వాన్ని ఛేదించి, నవ్యత్వం దిశగా అడుగులు వేయాలన్నదే ఈ పండుగ అందిస్తున్న సందేశం. దక్షిణాయణ కష్టాలకు వీడ్కోలు చెప్పి ఉత్తరాయణ పుణ్యకాలానికి స్వాగతం పలికి నట్లుగా భావిస్తారు. భోగిని 'ఇంద్ర వండుగ'గా వ్యవహరిస్తారు. పంటలు ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియచేస్తూ, త్వరగా తొలకరిని అనుగ్రహించాలని, రానున్న వేసవి తీవ్రతను తగ్గించాలని ప్రార్థిస్తూ, పొంగలిని ('ఇంద్ర పొంగలి') నివేదిస్తారు. చిన్నారులకు బాలా రిష్టాలు, దిష్టి తొలగి సుఖశాంతులు కలుగుతాయన్న విశ్వాసంతో ఆ రోజున భోగి (రేగు) వండ్లు పోస్తారు. బదరికావనంలో తపస్సు సమయంలో బదరీ (రేగు) పండ్లతో ఆకలి తీర్చుకున్న నరనారాయణుల ఆశీస్సులు వారికి లభిస్తాయన్న విశ్వాసమూ ఉంది..

మరో గాథ ప్రకారం, గోదాదేవి, శ్రీరంగనాథుల ప్రణయభోగ జీవితానికి గుర్తుగా భోగి పండుగ ఏర్పడిందంటారు. విష్ణుచిత్తుడి కుమార్తె, మహాభక్తురాలు గోదాదేవి భగవంతుడినే భర్తగా పొందేందుకు ధనుర్మాస వ్రతం ఆచరించారు. ప్రతి వేకువన స్నేహితులరాళ్లతో శ్రీరంగనాథుడిని అర్చిస్తూ, ఆ అనుభవాలను రోజుకు ఒక పాట (పాశురం)గా రాసి స్వామికి అంకితమిచ్చారు. అదే 'తిరుప్పావై'. 'తిరు' అంటే 'శ్రీ', 'పావై' అంటే పాట(లు)లేక వ్రతమని అర్థం. తిరుప్పావై అనే తమిళపదానికి 'శ్రీ వ్రతం/ సిరినోము' అని అర్థం. అమె భక్తికి, దీక్షకు మెచ్చిన రంగనాథుడు పరిణయమాడతాడు. ఆమె ఆయన పాదాల చెంత మోకరిల్లి స్వామిలో లీనమైపోయారు. శ్రీరంగం సహా 108 వైష్ణవ దివ్యక్షేత్రాలలో, ఇతర విష్ణ్వాలయాల్లో ఆ రోజున గోదా రంగనాథుల కల్యాణం జరుగుతుంది.

సూర్యుడు నెలకు ఒక రాశి వంతున ఏడాదిలో పన్నెండు రాశులలో ప్రవేశించే ప్రక్రియను సంక్రమణం లేదా సంక్రాంతి అంటారు. అయితే పుష్య మాసంలో సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే సంక్రాంతినే గొప్ప పర్వదినంగా జరుపుకుంటున్నారు. అప్పటివరకు భూమధ్య రేఖకు దక్షిణ దిక్కులో ఉన్న సూర్యుడు ఉత్తర దిక్కుకు మారతాడు. కనుకనే దీనిని ఉత్తరాయణం అంటారు. ఆ కాలంలో వాతావరణంలో మార్పులు వస్తాయి. అప్పటి వరకు సుదీర్ఘంగా ఉండే రాత్రి వేళలు తగ్గి పగటి వేళలు పెరుగుతాయి.

తన పూర్వికులను పునీతులను చేసేందుకు భగీరథుడు గంగానదిని భువికి రప్పించిన రోజు మకర సంక్రాంతని ప్రతీతి. బలి చక్రవర్తిని మూడడుగులు దానమడిగిన శ్రీహరి తన మూడవ అడుగును ఆ రాక్షస రాజు తలపై ఉంచి పాతాళానికి పంపిన రోజు,ఆదిశంకరులు సన్యసించిన రోజు కూడా అదే. సృష్టి ఆరంభంలో శ్రీమన్నారాయడు మకరరాశిలోని శ్రవణ నక్షత్రంలోనే బ్రహ్మకు అనంత పద్మనాభ స్వామిగా సాక్షాత్కరించాడట. సంక్రాంతి నాడు పంచసూక్త సహితంగా శివుడికి ఘృతాభిషేకం(నెయ్యి) చేయడం వల్ల మాఘ పుణ్యఫలితం దక్కుతుందని పెద్దలు చెబుతారు. మకరరాశికి శని అధిపతి కనుక శని ప్రీతి కోసం తిలదానం ఆచారంగా వస్తోంది.

కనుమ

గ్రామీణులకు...ముఖ్యంగా రైతులకు కనుమ అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ కనుమ. ఏరువాక తరువాత ఘనంగా జరుపుకొనే పండుగ 'కనుమ' అంటే పశువు అని అర్థం.



నేడు 'కాంతి' ఎంత!?

మానవ మనుగడకు సహకరించే పశుపక్ష్యాదులకు కృతజ్ఞతలు చెప్పుకోవడమే ఈ పండుగ పరమార్థం. గోసంరక్షణ,పశు పోషణ సమాజం కర్తవ్యమని ఇది చాటి చెబుతోంది. వ్యవసాయానికి ఆసరాగా నిలిచే పశువులను కృతజ్ఞతా పూర్వకంగా నాడు ప్రత్యేకంగా పూజిస్తారు. పంటలను చీడపీడల నుంచి కాపాడాలని కోరుతూ ఆరుబయట సూర్యునికెదురుగా కొత్త కుండలో పాయసం వండి నివేదిస్తారు. అనంతరం ప్రసాదంగా స్వీకరించి, పొంగలిలో పసుపు, కుంకుమ కలిపి పొలాల్లో చల్లుతారు. దీనిని 'పొలి చల్లడం' అంటారు.

ముక్కనుమ

కొత్తగా పెళ్లయిన యువతులు ముక్కనుమ నాడు సావిత్రీ గౌరీవ్రతం చేసి తొమ్మిది రోజుల బొమ్మల నోము ప్రారంభిస్తారు. దీనివల్ల భర్త పట్ల అనురాగం పెరుగుతుందని విశ్వాసం. సంతానం కోరే మహిళలు నట్టింట్లో ఊయల ఏర్పాటు చేసి తొమ్మిది మంది ముత్తయిదువలు తెచ్చిన బొమ్మలను అందులో ఉంచి ఊరేగిస్తారు.

ఏదీ నాటి వైభోగం...!

ధాన్యపు సిరులు కురిపించి కర్షకుల కళ్లలో ఆనందకాంతులు నింపే సంక్రాంతి పరిస్థితి వర్తమానంలో అలా ఉందా? అంటే సానుకూల సమాధానం రావడం కష్టమే. నాసిరకం వ్యవసాయ ఉత్పాదకాలు. అతివృష్టి-అనావృష్టితో సతమతం. గిట్టుబాటు ధరలు దక్కకపోవడం, దళారుల బెడద. వెరసి...అప్పుల బాధలు అన్నదాతలు వెన్ను విరుస్తున్నాయి. తాను అరకొరగా తింటూ పదిమందికి కడుపునిండా పెట్టే 'వర్తమాన రైతు భారతం'గురించి మాధ్యమాలు కళ్లకు కడుతూనే ఉన్నాయి.

ఒకనాడు ఈ పండుగ అన్ని వృత్తులవారికి ఉపాధి కల్పించేదే. గంగిరెద్దుల వారు, హరిదాసులు, జంగాల తదితర సామాజికవర్గాల, వృత్తుల వారు వృత్తి నైపుణ్యాలను ప్రదర్శిస్తూ సమాజం నుంచి కానుకలు స్వీకరించేవారు. సంక్రాంతి వేళల్లో తప్పనిసరిగా కనిపించే వాటిలో గంగిరెద్దుల ఆట ముఖ్యమైంది. 'గంగి'ని పవిత్రమైన 'గంగ'కు ప్రతీకగా భావిస్తారు. ఇది ఒకనాటి మాట. నేడు హరికథ, గంగిరెద్దులు తదితర జానపద కళలు పల్లెల్లోనూ నామ మాత్రమవుతున్నాయి. నెలరోజుల పాటు హరిదాసులు వీధివీధులు తిరుగుతూ శ్రావ్యంగా హరినామ సంకీర్తన చేయడం మధురానుభూతి. కాల క్రమంలో.... కులవృత్తి కడుపునింపక పోవడంతో ప్రత్యామ్నాయ ఉపాధిని వెదుక్కుంటుండగా, పాతతరం కళాకారులు కులవృత్తిని వదులుకోలేక...కొనసాగలేక కాలం వెళ్లదీస్తున్నారు. ఇంకొన్నాళ్లకు ఈ కళారూపాలు కనుమరుగై పోతాయేమోనని కళాభిమానులు కలత చెందుతున్నారు.

ఇక సంక్రాంతి సమయంలో కోడి పందాల గురించి ప్రత్యేకంగా చెప్పవలసింది లేదు. సంక్రాంతి అంటే కోడిపందాలు అనేలా పరిస్థితి మారింది. ఒకనాడు వినోదంగా ప్రారంభమైన ఈ ప్రక్రియ రానురాను జూదంగా 'వ్యాపార సంస్కృతి'గా పరిణమించింది.భారీ నుంచి అతిభారీ మొత్తంలో 'ఫణం'గా పెడుతూ ఆర్థికంగా కుదేలవుతున్న వారెందరో!.

పల్లెబాట

పల్లెలో పుట్టినవారికి దాని పేగుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందుకే సంక్రాంతి పండుగ వేళ పట్టణ ప్రజ పల్లెబాట పడుతోంది. కానీ, నాటి అనుభూతి కానరావడంలేదని అంటున్నారు. అందుకు ఎన్నో కారణాలు. తరానికి, తరానికి అంతరం ఏర్పడుతోంది. నాటి ఆప్యాయత అనురాగాలు నేటి యాంత్రిక జీవితం, క్షుద్ర,స్వార్థ రాజకీయాలతో కలుషితమవుతున్నాయనడంలో సందేహం లేదు.కులమతవర్ణ వర్గాలకు అతీతంగా వావివరుసలతో పిలుపులు, మమతానురాగాలు, ఆప్యాయతలను పంచుకోవడం కరవై పోతోంది. ఉళ్లల్లో ఉన్న ఆ కొద్దిరోజుల్లోనైనా మనసార ముచ్చట్లాడుకొనే అవకాశం లేదు. అందుకు ప్రధాన కారణం చేతుల్లోని 'సంచారవాణి' (మొబైల్ ఫోన్) ప్రధాన కారణమని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పెరుగుతున్న సాంకేతిక, సౌకర్యాలు మానవ సంబంధాలను మసకబారుస్తున్నాయనేందుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.అందరు ఒకేచోట కూడినా, ఎవరికి వారు ఒంటరే. ఏ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని కాలంలో పల్లెసీమల్లో రోజులను క్షణాల్లా గడిపి, బరువెక్కిన గుండెలతో వీడ్కోలు తీసుకొన్న దశ నుంచి మొక్కుబడి సందర్శనకు, పండుగ వస్తే తప్ప పల్లె ముఖం చూడలేని స్థితికి వచ్చేశాం. అయితే... నేటి మన కర్తవ్యం ఏమిటి? స్వగ్రామాలకు వెళ్లగలిగి, వెళ్లలేకపోతున్నవారు తమ జీవితాలలో ఆనందాన్ని ఏ మేర కోల్పోతున్నారో ఆత్మపరిశీలన చేసుకుంటే... జన్మభూమి విలువ బోధపడుతుంది.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి'

డా॥ ఆరవెల్లి జగన్నాథస్వామి

సీనియర్ జర్నలిస్ట్

యువతరమే

నాలుగు పదులైనా నిండని ఆ మహనీయుడు శతాబ్దాలుగా తరతరాల భారతీయులకు స్ఫూర్తిగా నిలిచారు. ఆ కొద్ది జీవితంలోనే భారత ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రాచీన సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. హిందూ ధర్మ విశిష్టతను పాశ్చాత్యులకు పరిచయం చేసిన గొప్ప తత్వవేత్త. 'హిందువునని గర్వించు.. హిందువుగా జీవించు..' ఇది ఒక మంత్రంలా కోట్లాది మందిని కదిలించింది. ఇందులో సంకుచిత్వం, స్వార్థం లేవు. ఆత్మ విశ్వాసం, సార్వజనీనతను చూడవచ్చు.. ఇంతకీ ఈ నినాదం ఎవరిది? ఆ మహనీయుడు స్వామి వివేకానంద.

ఒకప్పుడు విశ్వగురువుగా ప్రపంచానికి జ్ఞానం అందించిన దేశ ప్రజలు తమ గత వైభవాన్ని మరచి ఆత్మ విస్మృతితో జీవిస్తున్న రోజులవి. పరాయి పాలనలో మగ్గిపోతున్న భారతీయులు నిరాశ నిస్పృహలతో ఉన్న కాలమది. విదేశీయులు తమను ఉద్ధరించడానికే వచ్చారనే భ్రమల్లో భారతీయులు ఉన్నారు. కానీ నూట పాతికేళ్ల క్రితం పాశ్చాత్యుల దృష్టిలో దేశంపై ఉన్న భావన-భారత్ అంటే పాములు ఆడించేవారి అనాగరిక దేశం. ప్రజలు రాళ్లు రప్పలను పూజిస్తారని, పేదరికం బానిసత్వం మధ్య కులాల పేరుతో కుమ్మలాడుకుంటారనే ప్రచారాన్నే నమ్ముతున్న వేళ.. ఓ యువ సన్యాసిగా వివేకానంద అమెరికాలోని షికాగో మహానగరంలో విశ్వమత వేదికపై గళమెత్తారు.'మత భేదాలు ద్వేషానికి కాదు, అవి మానవాళి శ్రేయస్సుకు దారితీసే మార్గాలు' అని ఆయన చెప్పిన మాటలు సభలో మార్మోగాయి.

చిన్నవయసులో సత్యాన్వేషణ

స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్రనాథ్ దత్త. సంవత్సరం జనవరి 12, 1863న కలకత్తాలో విశ్వనాథ దత్త, భువనేశ్వరీదేవి దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుంచే దైవభక్తి అలవడిన నరేంద్రునిలో వయసు పెరిగే కొద్దీ ఆధ్యాత్మిక చింతన మొదలైంది. సత్యాన్వేషణలో భాగంగా ఎందరో మహనీయులను, ఆధ్యాత్మిక వేత్తలను కలిసిన నరేంద్రునికి భగవంతుని విషయంలో తనకున్న అనుమానాలు తీరనందుకు ఎంతో తపించిపోయాడు.

1881లో నరేంద్రుడు శ్రీ రామకృష్ణ పరమ హంసను కలుసుకున్న తర్వాత తన అసలైన గురువు ఆయనే అని తెలుసుకున్నాడు. దక్షిణేశ్వర్ కాళీ మందిరంలో ఆధ్యాత్మిక మార్గదర్శనం పొందారు. "నరేన్.. నువ్వు ఒక గొప్ప లక్ష్యానికి పుట్టావు. మానవాళి కోసం సేవ చేయాలి" అని గురువు చెప్పిన మాటలు ఆయన మనసులో నాటుకుపోయాయి. పరమహంస శిష్యరికంలో ఎన్నో ఆధ్యాత్మికాంశాలను తెలుసుకున్న నరేంద్రునికి తన జీవిత గమ్యం ఇంకా బోధ పడలేదు. ఒక రోజున తనకు నిర్వికల్ప సమాధిని అనుగ్రహించమని పరమహంసను కోరారు.. 'ఇలా అడగడం అవమానకరం.. నీవు మరింత ఉన్నతికి ఎదిగి ప్రపంచంలోని ఎందరో బాధితులకు నీడనిచ్చే మహావృక్షంగా నిలుస్తావనుకుంటే, నీ వ్యక్తిగత విముక్తి కోసం అడుగుతున్నావా?..' అని ప్రశ్నించారాయన..

వివేకానందగా జీవిత గమ్యం

రామకృష్ణ పరమహంస మహా సమాధి తర్వాత తన ఆధ్యాత్మిక యాత్రను కొనసాగించారు నరేంద్రుడు. 1886లో సన్యాసం స్వీకరించారు. కశ్మీరం మొదలు కన్యాకుమారి వరకూ పర్యటించారు. ఈ పర్యటనలో ఎన్నో బాధాకరమైన విషయాలను గమనించారు. పరాయి పాలనలో ఉన్న మన దేశంలో ఎక్కడ చూసినా దారిద్ర్యం. ప్రజల్లో అవిద్యకు తోడు మూఢ నమ్మకాలు, సామాజిక దురాచారాలు స్పష్టం కనిపించాయి. దీనికి తోడు మహిళల దుస్థితి మరింత కలవర పెట్టింది. ఏమిటి ఈ దుస్థితి? ఈ పరిస్థితుల నుంచి బయటపడటానికి తానేమీ చేయలేనా? అని ప్రశ్నించుకున్నారు నరేంద్రుడు.

యాత్ర చివరి మజిలీలో నరేంద్రనాథుడు కన్యాకుమారిలో సముద్రంలోని పెద్ద శిలపై ధ్యానం చేశారు. భారతదేశ భూత, భవిష్యత్, వర్తమానాలను తన మనోనేత్రంపై విశ్లేషించుకున్నారు. పతనమైన దేశ పునర్నిర్మాణం కోసం ఆధ్యాత్మిక మార్గమే సరైనదని భావించారు. సనాతన హైందవ ధర్మ పరి రక్షణ, జాగరణే లక్ష్యంగా మార్చుకున్నారు.. నరేంద్రనాథ్ స్వామి వివేకానందగా మారారు.

విశ్వ వేదికపై హైందవ గళం

బ్రిటిష్ ఇండియాలో పాశ్చాత్య దేశాలకు మనమంటే చిన్న చూపు ఉండేది. ప్రపంచంలో తామే అధికులమని వారి భావన. తాము అవలంబిస్తున్న క్రైస్తవ మతాన్ని మన దేశం మీద రుద్దడానికి పెద్ద ఎత్తున మిషనరీలను దింపారు. ఇలాంటి పరిస్థితుల్లో హిందూ మత ఔన్నత్యం గురించి పాశ్చాత్యులకు చాటి చెప్పాలని నిర్ణయించుకున్నారు వివేకానంద. ఇందులో భాగంగా అమెరికాలోని షికాగో మహానగరంలో జరిగిన ప్రపంచ సర్వమత మహాసభలకు వెళ్లారు.

సెప్టెంబర్ 11,1893న ' అమెరికా సోదర సోదరీమణులారా..' అనే సంబోధనతో వివేకానందుని ఉపన్యాసం ప్రారంభం కాగానే ప్రాంగణమంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది. ప్రపంచంలోనే అతి పురాతనమైన రుషి సంప్రదాయం, సకల మతాలకు తల్లి అయిన సనాతన ధర్మం, కోట్లాది భారతీయుల తరపున మీకు వందనం అంటూ ఆయన చేసిన ఉపన్యాసం ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులను మంత్ర ముగ్ధులను చేసింది.

అన్ని మతాలు సత్యమేనని ప్రపంచానికి చాటి చెప్పిన సనాతనధర్మం తనదని చెప్పేందుకు గర్విస్తున్నానన్నారు వివేకానంద. నదులన్నీ సముద్రంలో కలిసినట్లే, విభిన్న ఆరాధనా పద్ధతులు పరమేశ్వరుడినే చేరుకుంటాయి. ఎవరు ఏరూపంలో నన్ను గ్రహిస్తారో, నేనూ ఆ రూపంలోనే వారిని అనుగ్రహిస్తాను అనే గీతాచార్యుని తత్వాన్ని వివరించారు. ప్రపంచంలోనే ప్రాచీనమైనవి హిందూ, జొరాష్ట్రియన్, యూదు మతాలు, ఇందులో చివరి రెండు మతాలు క్రూరమైన దాడుల కారణంగా జన్మస్థలాల నుంచి నిష్క్రమించాయి. కానీ సనాతన హైందవ ధర్మాన్ని కూకటివేళ్లతో కదిలించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సముద్రంలో నీరు వెనక్కి వెళ్లి తిరిగి బలం పుంజుకొని వచ్చినట్లు వైదికమతం ఎప్పటికప్పుడు అనేక సంప్రదాయాలను తనలో ఇముడ్చుకుంటూ నూతనోత్తేజం పొందుతోంది.

విగ్రహారాధన, నాస్తిక, అజ్ఞేయ వాదాలు, బౌద్ధం, జైనం తదితర ధర్మాలను హిందూత్వంలో దర్శించుకోవచ్చు. హిందూ ధర్మంలోని ఆంతరంగిక శక్తి, వేదాల నిత్యత్వం, సృష్టి, పరమాత్మ, ఆత్మ, రుషి పరంపర, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక సత్యాలపై స్వామీజీ చేసిన ఉపన్యాసాలు అందరినీ

క్రాంతిదేవ్ మిత్ర
సీనియర్ జర్నలిస్ట్

భావికి వరం

ఆకట్టుకున్నాయి. షికాగో సర్వమత సభల అనంతరం అమెరికా, బ్రిటన్, యూరోపియన్ దేశాల్లో పర్యటిస్తూ వివేకానంద ఇచ్చిన ఉపన్యాసాల కారణంగా పాశ్చాత్యులకు భారతదేశంపై ఉన్న దురభిప్రాయం దూరమైంది. స్వామీజీ స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు దేశ ప్రజల నుంచి అఖండ స్వాగతం లభించింది..

హిందుత్వంలోనే విశ్వ శ్రేయస్సు

భారతదేశ పునర్నిర్మాణం ఆధ్యాత్మిక శక్తిపై నిర్మితం కావాలన్నారు స్వామి వివేకానంద. ఈ ప్రపంచంలో పుణ్యభూమి ఏదైనా ఉందన్నా, భగవంతుని చేరుకోవడానికి తపించే వారి చివరి గమ్యం ఆధ్యాత్మిక భారతమేనని చెప్పేవారు స్వామీజీ.. మన పూర్వుల సదాచారాలను మరచిపోనంత కాలం హిందువులను ఏ శక్తీ నాశనం చేయలేదు.

స్వామి వివేకానంద జీవితం సనాతన ధర్మ పరిరక్షణ, ప్రచారానికి అంకితమైంది. సనాతన ధర్మం అంటే హిందుత్వమే. భారతదేశం ప్రపంచానికి ఆధ్యాత్మిక సంపదను ఇచ్చింది. ప్రాచీనమైన రుషి పరంపర, వైదికధర్మానికి వారసులం మనమందరం. నా హిందూ జాతిని, నా పూర్వులను చూసి నేను గర్విస్తున్నాను. మీరు కూడా హిందువులమని చెప్పుకోడానికి గర్వపడండి అని తన సందేశంలో చాటారు స్వామీజీ. పాశ్చాత్య సంస్కృతిని, వారి వేషధారణ, ఆహారపు అలవాట్లను మనం అనుసరించాల్సిన అవసరం లేదన్నారు. భారతీయత, హైందవం మన రక్తంలో నిరంతరం ప్రవహిస్తోందని గుర్తు చేశారు.

హిందుత్వం లేకపోతే భారతదేశమే లేదు. భారతీయత కూడా లేదు. హిందుత్వం భారతీయుల శ్రేయస్సు కోసం మాత్రమే కాదు, విశ్వమానవ శ్రేయస్సు కోసం అవసరమని చెప్పేవారాయన. వివేకానందుల దృష్టిలో హిందుత్వమంటే జాతీయ చైతన్యం సాధించే సాధనం. మొత్తం విశ్వమానవ సమాజ అభ్యున్నతికి, వారి నైతిక తాత్వికస్థాయిని పెంపొందించేందుకు ఈ భావన ముఖ్యమని చెప్పేవారు.

మీ మతం అవసరం లేదు

భారతదేశంలో మత ప్రచారానికి వచ్చేవారిని స్పష్టంగా నిరసించారు స్వామి వివేకానంద. క్రైస్తవుల సద్విమర్శకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కరవు, కాటకాల్లో వేలాది మంది మరణిస్తుంటే వారిని ఏ విధమైన సహాయం చేయకుండా చర్చిలు నిర్మిస్తున్నారు. కోట్లాది మంది అన్నం కోసం విలపిస్తుంటూ మీరు వారికి చేస్తున్న సహాయం ఏమిటి? అని ప్రశ్నించారు. ధనం కోసం మత బోధ చేసేవారు భ్రష్టులని అన్నారు. క్రైస్తవ ప్రచారకులు హిందూ మత వ్యతిరేకతను నూరిపోయడాన్ని తప్పు పట్టారు. క్రైస్తవులు హిందువుగా మారాలని తాను కోరుకోవడం లేదని, అలాగే హిందువులు క్రైస్తవులుగా మారాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రతి వ్యక్తి ఇతరుల భావాలను, మతాల సారాన్ని గ్రహించి సొంత వ్యక్తిత్వం ఏర్పరుచుకోవాలన్నారు. అంటరానితనం, కులతత్వం, దురాచారాలు, మూఢ నమ్మకాలను వివేకానంద తీవ్రంగా ఖండించారు. వారిని ఆదుకునేందుకు సేవే మార్గమని సూచించారు. దరిద్రుల సేవే నారాయణ సేవ అన్నారు అన్నారు.

1897లో వివేకానంద తోటి శిష్యులతో కలిసి రామకృష్ణ మఠం ప్రారంభించారు. దీని ప్రధాన ఉద్దేశం? ఆధ్యాత్మికతను సమాజ సేవతో కలపడం. పేదలకు విద్య అందించడం, సహాయం చేయడం, కష్టకాలంలో సేవ చేయడం, యువతను స్ఫూర్తితో నింపడమే పనిగా మార్చారు.

యువతపైనే స్వామీజీ ఆశలు

దేశ నిర్మాణం, అభివృద్ధి, పురోగతి దాని యువతపై ఆధారపడి ఉంటుంది. ఆధునిక భారత దేశ పునర్నిర్మాణంలో యువతపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు స్వామి వివేకానంద. ఆయన బోధనలన్నీ వారిని ఉద్దేశించినవే. యువతకు "లేవండి, మేల్కొనండి, లక్ష్యం చేరేవరకు ఆగకండి" అని పిలుపునిచ్చారు, ఆత్మవిశ్వాసం, సంకల్పం, సేవాభావం, శారీరక-మానసిక దృఢత్వాన్ని ప్రోత్సహించారు. ప్రతి యువకుడిలో అపారమైన శక్తి ఉందని, దేశ నిర్మాణం, ప్రపంచ మార్పులో వారే కీలకమని నొక్కి చెప్పారు, వ్యక్తిగత అభివృద్ధికి భౌతిక, సామాజిక, మేధోపరమైన, ఆధ్యాత్మిక అన్వేషణల ద్వారా సంపూర్ణ జీవితాన్ని గడపాలని సూచించారు.

'ఆధునిక యువతపైనే నాకు విశ్వాసం ఉంది.. నేను నిర్మించిన ఆదర్శాన్ని దేశ మంతా వ్యాప్తి చేసేది యువతే. బలిష్టులు, జవ సంపన్నులు, ఆత్మ విశ్వాసుల, రుజువర్తనులు కావాలి. ఇలాంటి వారు వంద మంది ఉన్నా చాలు, ఈ ప్రపంచాన్నే మార్చేయవచ్చు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్రసంకల్పితమైన మనస్సు అవసరం. బలమే జీవితం,బలహీనతే మరణం..' అన్నారు వివేకానంద. మీరు నిజంగా నా బిడ్డలే అయితే దేనికీ భయపడరు. ఎక్కడా ఆగిపోరు. మీరు సింహాల్లా ఉండాలి. మన దేశాన్నే కాక, ప్రపంచాన్నే జాగృతం చేయాలి. ఉద్యమ నిర్వహణలో అవసరమైతే అగ్నిలో దూకడానికైనా సంసిద్ధంగా ఉండాలి అని ఉద్బోధించారు.

స్వామి వివేకానంద జీవించినది కేవలం 39 సంవత్సరాలు. కానీ మన సనాతన ధర్మవైభవం మరో వేయేళ్లు సాగేందుకు అవసరమైన మరమ్మతులు చేసి పోయారు. ఆయన కన్న కలలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు భారతీయులుగా మనందరిపైనా బాధ్యత ఉంది.

స్వామీజీ తన జీవిత పర్యంతం సమాజాన్ని జాగృతం చేసేందుకు శ్రమించారు. దేశ యువతను తట్టిలేపారు. చేయాల్సిన కార్యాన్ని బోధించారు. అంతటి మహనీయుడి జయంతి సందర్భంగా జనవరి 12న భారతదేశం 'జాతీయ యువజన దినోత్సవం'ని జరుపుకుంటున్నాం.

★



డోన్యి-పోలో-తులోమ్ రుక్బో

వనవాసులలో జాతీయ చైతన్యం తీసుకు రావడానికి ఆర్ఎస్ఎస్ చేస్తున్న కృషి బయటి ప్రపంచానికి అంతగా తెలియదు. చత్తీస్‌గడ్ జష్‌పూర్ నుండి ఆర్ఎస్ఎస్ ఈ పని ఆరంభించింది. ఈ ఉద్యమం స్వర్ణోత్స వాలను కొద్దికాలం క్రితం నిర్వహించారు. ఈశాన్య రాష్ట్రాల వారు సహా, 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి దాదాపు 250 తెగలు, 200 గిరిజన జిల్లాల నుండి 3000 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 'సంస్కృతిని కోల్పోవడమంటే ఉనికి కోల్పోవ డమే' అనే నినాదంతో ఉద్యమం సాగుతు న్నది. తమ వారసత్వాన్ని చూసి వారు గర్వించేందుకు వీలుగా విదేశీయ పాలనకు వ్యతిరేకంగా కొండకోనలలో పోరాడి చెరగని ముద్రవేసిన చారిత్రక వ్యక్తుల జాబితాను విడుదల చేశారు. బీర్సాముండా, సిద్ధోకన్హు, రాణీ దుర్గావతి, పుంజాభాల్, అల్లూరి సీతా రామరాజు, రొప్పలియాని, బెగ్రాభల్, వీర్ తాంతియా, తులోమ్ రుక్బో, కార్తీక్ వరాన్, రాణి గైడిన్యులు ఆ జాబితాలో ఉన్నారు. నేటి తరం వనవాసీలు నక్సలైట్లతోనూ, వేర్పాటు వాదులతోను తలపడి జాతీయతా భావాన్ని చాటుకున్నారు.

మనిషి అమితమైన మేధాశక్తిని, ఆలోచనతో కూడిన అనురక్తిని, పురోగతి సాధించేందుకు కావలసిన అభివ్యక్తిని సమృద్ధిగా కలిగినవాడు. ఆ సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఒకరి మేలు కోసమో, జాతి పురోగతి కోసమో నిస్వార్థంగా కృషి చేసేవారి జీవితాలే సార్థకమవుతాయి. అలాంటివారికి ఏనాటికీ మరణం లేదని, భువిలో అమరులని అంటాడు భర్తృహరి. ఈ కోవలోనివాడే తులోమ్ రుక్బో. అరుణాచల్‌ప్రదేశ్ వేగుచుక్క ఆయనే. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా చరిత్రపుటలకు ఎక్కని గొప్ప దేశభక్తుల వీరగాథలను, సాంస్కృతిక వైభవాన్ని, సాధించిన విజయాలను నెమరు వేసు కున్నాం. ఆ విధంగా గిరిజన స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలకు, గతంలో ప్రాచుర్యంలో లేని గిరిజన చరిత్రకు ప్రాధాన్యం తెచ్చింది. ఫిబ్రవరి 20, 1987న అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంగా అవతరించింది.

అరుణాచలప్రదేశ్‌లో మొదలైన పునరుజ్జీవన మత ఉద్యమం 'డోన్యి-పోలో'. దీనికి పితామహుడే తులోమ్ రుక్బో. ఇది తాని (ఆది) అనిమిస్ట్ ఆధ్యాత్మి కతను పునర్ నిర్మించడానికి ప్రయత్నిస్తున్నది. ఈశాన్య భారతదేశంలో క్రైస్తవ మిషనరీల మోసపూరిత మత మార్పిడులను రుక్బో విమర్శించాడు. ఆదివాసి జీవన విధానానికి ఆయన చేసిన కృషి కారణంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం నిర్వహిస్తున్న వనవాసి కల్యాణ్ ఆశ్రమ ప్రాజెక్టుకు రుక్బో ప్రేరణగా నిలిచారు. ఆదివాసి ప్రజలను మతాంతరీకరణ చేసిన తరువాత అనిమిస్ట్ ఆచారాలను, వారి పండుగలను, వారి దేవుళ్లను సైతాన్ (దుష్టశక్తులు) అని విమర్శించాలని మిషనరీలు ఆదేశిస్తూ ఉంటాయి.

అరుణాచల్ ప్రదేశ్ అంటే ఉదయించే సూర్యుని భూమి అని అర్థం. పురాణాల ప్రకారం ఈ ప్రాంతం ప్రాచీన విదర్భలో భాగం. మహాభారతం, రామా యణం వంటి ప్రాచీన గ్రంథాలలో ఈ ప్రాంత ప్రస్తా వన ఉంది. లోహిత్ జిల్లాలోని పరశురామకుండంలో పరశురాముడు తన పాపాలను కడిగివేసుకున్నాడని, ఇక్కడే వ్యాస మహర్షి తపస్సు చేశాడని, శ్రీకృష్ణుడు రుక్మిణిని ఇక్కడ నుండే వివాహం చేసుకున్నాడని నమ్ముతారు. ఇక్కడ సుమారు 25 తెగలున్నాయి. అవి- ఆది, ఆక, అపతని, మిష్మి, నిషిమనస్, పన్‌గ్గీ, కర్‌కో మొదలైనవి. దీనిలో ఆది అంటే హిల్‌మాన్ అని అర్థం. వీరికి వ్యవసాయం ప్రధాన వృత్తి. వీరి ప్రధాన పండగలు-సోలుంగ్, మోపిన్, ఎటోర్, యూనియింగ్, దోన్‌జున్. నిజానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈశాన్య భారతదేశాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితమే వేర్పాటువాదంతో కూడిన మిషనరీ కార్యకలాపాలు. వీటిని ప్రతిఘటించిన సంస్థ వనవాసీ కల్యాణ ఆశ్రమం. మిషనరీల మత మార్పిడి కార్యకలాపాలకు ప్రత్యామ్నాయంగా, గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షిస్తూ వారి సంక్షేమం కోసం వనవాసి కళ్యాణ్ ఆశ్రమం (వీకేఏ) రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అనుబంధ సంస్థగా డిసెంబరు 26,1952న ప్రారంభమైంది. మధ్యప్రదేశ్ (నేటి చత్తీస్‌ఘడ్)లోని జష్‌పూర్ అనే గిరిజన ప్రాంతంలో రమాకాంత్ కేశవ్ దేశ్‌పాండే ఆ సంస్థను ప్రారంభించారు. జష్‌పూర్‌లోని రాజా విజయభూషణ్ జుడావో సహకారంతో శిథిలావస్థలో ఉన్న రాజ్ భవన్‌లో కొద్దిమంది గిరిజన బాలురతో ఒక హాస్టల్‌ను ప్రారంభించారు.

ఈ సంస్థ కార్యకలాపాలు విజయవంతం కావడంతో 1977లో ఇది అఖిల భారత సంస్థగా గుర్తింపు పొందింది. అప్పటి నుండి అఖిల భారతీయ వనవాసి కల్యాణ్ ఆశ్రమమైంది. విద్య, ఆరోగ్యం, వ్యవసాయాభివృద్ధి, గ్రామీణక్రీడలు, మహిళా సాధికారత, సాంస్కృతిక పరిరక్షణ, స్వయం ఉపాధి వంటి వివిధ రంగాలలో సేవాకార్యక్రమాలను నిర్వహి స్తున్నది. వనవాసి సమాజాన్ని జాతీయ స్రవంతిలో భాగం చేయడం, తద్వారా వారు విద్యావంతులుగా స్వావలంబన కలిగిన వారుగా ఎదగడానికి సహాయం చేయడం ఆశ్రమం ప్రధాన లక్ష్యం. లక్ష్యసాధన కోసం నిశ్శబ్దంగా పనిచేయడానికి అది ఇష్టపడుతుంది.

ఆదివాసీల పట్ల ఆదరణ, వారిని జాతీయ స్రవంతిలో అంతర్భాగంగా ఉంచే కృషి వెనుక గొప్ప నిర్మాణాత్మక దృష్టి ఉంది. అరుణాచల్ క్రీ॥శ॥ 5 లేక 6 శతాబ్ది కాలంలో మోన్పా రాజ్య నియంత్రణలో ఉండేది. 1826 యాండబు ఒప్పందం ప్రకారం బ్రిటిష్ నియంత్రణలోకి వచ్చింది. 1838 నాటికి బ్రిటిష్ పాలనలోనికి వచ్చింది. అప్పుడు దీన్ని నార్త్ ఈస్ట్ ప్రాంటియర్ ఏజెన్సీ (NEFA) అని పిలిచేవారు. 1914లో సిమ్లా ఒప్పందం ద్వారా టిబెట్, చైనా, బ్రిటిష్ ఇండియా మధ్య మెక్‌మోహన్ రేఖ సరిహద్దుగా నిర్ణయించారు. భారత్-చైనాకు మధ్య 550 మైళ్ల (890 కిలోమీటర్లు) పొడవైన సరిహద్దు రేఖ ఉంది. బ్రిటిష్ ఇండియా కాలంలో భారత్ చైనాల మధ్య నేరుగా సరిహద్దు లేదు. మధ్యలో టిబెట్ ఉండేది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ 1951 అక్టోబరులో టిబెట్‌ను ఆక్రమించంతో చైనాయే భారత్ సరిహద్దు దేశమయింది. అలాగే మెక్‌మోహన్ రేఖను అంగీక రించక అరుణాచల్ ప్రదేశ్ తమదేనని వాదిస్తూ, చైనా అప్పుడప్పుడూ ఆ లైన్‌ను అతిక్రమిస్తూ ఉంటుంది. అందువల్ల అరుణాచల్ ప్రదేశ్ ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది.

భౌగోళికంగా ఈశాన్య భారతదేశాన్ని ప్రధాన భారత భూభాగంతో కలిపి ఉంచేదే సిలిగురి కారిడార్. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి నుండి 20 లేక 22 కిలోమీటర్ల వెడల్పు, 200 కిలోమీటర్ల పొడవున ఇది ఉంటుంది. కోడిమెడ ఆకారంలో

ఉంటుంది కాబట్టి చికెన్‌నెక్ కారిడార్ అంటారు. ఈశాన్య భారతంలో అస్సాం, అరుణాచలప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మేఘాలయలను 7 సిస్టర్స్ (ఏడుగురు అక్కాచెల్లెళ్లు) అని పిలుస్తారు. చికెన్‌నెక్ పశ్చిమాన నేపాల్ ఉత్తరాన భూటాన్, తూర్పు బంగ్లాదేశ్ దేశాలతో సరిహద్దులను పంచుకుంటుంది. చికెన్‌నెక్ లేకుంటే ఈశాన్య రాష్ట్రాలకు భారత్‌తో భౌతికంగా సంబంధాలు తెగి పోతాయి. అందుకే చికెన్‌నెక్ భారత్‌కు వ్యూహాత్మకంగా రాజకీయంగా కీలకం. కాన్‌స్టాంట్‌నోపుల్ (నేటి ఇస్తాంబుల్) టర్కీకి ఎలా కీలకమో అలాగే చికెన్‌నెక్ కారిడార్ భారత్‌కు అంతే కీలకం. ఈ కారిడార్‌ను కోల్పోతే ఈశాన్య రాష్ట్రాల రక్షణ భారత్‌కు కష్టమే. ఈ చికెన్‌నెక్ కారిడార్ రవాణా వాణిజ్యం, సైనికుల తరలింపులకు ప్రధాన మార్గం. ఒక్క మాటలో–ఈ కారిడార్ భారత్ అభివృద్ధికి జీవనాడి. చికెన్‌నెక్ భారత్ చైనా సరిహద్దుకు సమీపంలో ఉంది. మరీ ముఖ్యంగా అరుణాచల ప్రదేశ్‌లోని తవాంగ్ ప్రాంతానికి దగ్గర (6వ దలైలామా ఇక్కడే

– వనవాసి కల్యాణ్ ఆశ్రమం

జన్మించారు). 1962లో భారత్–చైనా యుద్ధంలో డ్రాగన్ సైన్యం ఈ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పుడు దీని ప్రాముఖ్యత తెలిసింది. ఇక్కడ నుండి అక్రమ వలనలు, ఆయుధాల స్మగ్లింగ్, తీవ్రవాద కార్యకలాపాలు జరిగే అవకాశాలు అధికం. వీటిని గట్టిగా నియంత్రిచడం ద్వారా భారత్ సార్వ భౌమాధికారాన్ని, జాతీయభద్రతను కాపాడుకో గలుగుతుంది.

ఈ కారిడార్ ద్వారా ఈశాన్య రాష్ట్రాలకు వస్తువులు ముఖ్యంగా తేయాకు, చమురు, కలప మొదలైన సరుకులు రవాణా చేస్తున్నారు. ఒకవేళ ఈ చికెన్‌నెక్ కారిడార్ లేకపోతే భారత ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుంది. ఈ కారిడార్ ఇరుకైనది కావడం వల్ల పొరుగున వున్న శత్రుదేశాలు సులభంగా లక్ష్యం చేసుకునే అవకాశం వుంది. అందుకే ఇక్కడ భారత్ బలమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. మొత్తంగా ఈ చికెన్‌నెక్ భారత్ ఐక్యతకు, భద్రతకు, ఆర్థిక అభివృద్ధితోపాటు ఈ ఈశాన్య సరిహద్దు ప్రాంత సమగ్రతను కాపాడుతుంది. ఇలాంటి కీలక ప్రాంతంలో జాతీయ భావాలతో వేర్పాటువాదాన్ని అరికట్టినవారే రుక్బో.

డోన్యి–పోలో అంటే అర్థం 'సూర్యుడు చంద్రుడు' (డ్యోని అంటే సూర్యుడు, పోలో అంటే చంద్రుడు). ఇది క్రైస్తవ మత విస్తరణను ప్రతిఘటిస్తూ 1970లో సంస్థాగత రూపం పొందిన ప్రకృతి ఆధారిత విశ్వాసం. వీరు సూర్యచంద్రులను దైవాలుగా పూజిస్తారు. రాష్ట్ర జనాభాలో అధికులు ఈ మతాన్ని అనుసరిస్తారు. అరుణాచల్ ప్రదేశ్ గిరిజన తెగల సాంప్రదాయ విశ్వాసాల నుండి ఉద్భవించిన డోన్యి పోలో క్రైస్తవ మతవ్యాప్తిని అరికట్టడంలో సఫలీకృత మైంది. అక్కడి ఇళ్లలో ఎర్రసూర్యుని చిహ్నంతో తెల్లటి జెండా చూడవచ్చును. వీరు చర్చి తరహాలోనే ఆదివారం ప్రార్థనా సమావేశాలు నిర్వహిస్తారు. వీరు తమని తాము సూర్యచంద్రుల సంతానంగా అభివర్ణిస్తారు.

భగవంతుడు సర్వాంతర్యామి, కాబట్టి వారిని దేవాలయంలో బంధించరాదని వీరి నమ్మకం. ప్రజలను మంచి మార్గంలో నడపడానికి 'న్యుబు' లేక 'శామన్లు' ఆధ్యాత్మిక మార్గ దార్శనికులు ఉంటారు. వీరు పూజలు, వైద్యం చేస్తారు. వీరి మతం విడాకులకు అంగీకరించదు. నైతిక ప్రవర్తనలో తేడా వస్తే మొత్తం కుటుంబాన్నే డోన్యో నాశనం చేస్తాడని నమ్మకం. కాబట్టి నీతిమంతులుగా జీవనం గడుపుతారు.

వీరు సోలుంగ్, న్యోకుమ్‌డీ వంటి పండుగలు నిర్వహిస్తారు. అవి పంటలు బాగా పండాలనీ, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షిస్తాయి. వరి ప్రధానమైన పంట. దానికి కృత్రిమ ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడరు. కారణం వీరు వరిపొలాన్నే చేపల చెరువుగా తయారు చేసుకుం టారు. కాబట్టి ప్రకృతికి హాని తలపెట్టేవాటిని వీరు వాడరు. కావలసిన కూరగాయలను వారే పండించు కుంటారు. పర్యావరణ పరిరక్షణ కూడా వీరికి ఒక ఆదర్శం.

తులోమ్ రుక్బో డిసెంబర్ 1,1938న (అరుణా చల్ ప్రదేశ్) పసిఘాట్ జిల్లాలో జన్మించారు. మిషనరీల మతమార్పిడులకు నిరసనగా తులోమ్ రుక్బో 1976లో తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామాచేసి తన పూర్తి కాలాన్ని సామాజిక సేవకు అంకితం చేశాడు. 1986లో డోన్యో పోలో అను చరులు సంస్కృతిని, సాహిత్యాన్ని, మత సిద్ధాంతాలను వ్యాప్తి చేయడానికి మూడు సంస్థలను ప్రారంభిం చారు. 1. తనీ జాగృతి ఫౌండేషన్ (2) డోనీ పోలో యూత్ ఫెడరేషన్ (3) డోన్యో పోలో యీలమ్ కెబాంగ్ (డి.పి.వై.కె). వీరు రుక్బో (డోనీపోలోయిజమ్ పిత) సిద్ధాంతాలను ప్రచారం చేయడం, సాహిత్యాన్ని అభివృద్ధి చేయడం, దేవాలయాలను నిర్మించి ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 31 తేదీని డోన్యోపోలో దినంగా నిర్వహిస్తున్నారు.

మూలం:

1) స్వరాజ్య మేగజైన్‌లో "How Arunachala Pradesh is Dharmic Heritage negates" by Jaideep Majundar.
2) Indian Journal of Anthropological Research in Dongi Pole as an Indegenerous religion in Arunachala Pradesh by Kamal K. Mishra.
3) Adivasi or Vanavasi Tribal India and the politics of Hinductvas by Kamal Narayan Choubey.
4) Talom Rukbo and the Donyipolo Yelam Kebang Restruring by Scheid claire International Asian Forum.
5) Economic Times Sept 4, 2004.
6) Religious nationalism, Christianisation and Institutionalism of indegeneous faiths in contemporary Arunachala Pradesh, India by Basawathi Boryhain & Mekroy Dodum.
7) Donyi Poloism : Aneco spiritual way of life by Age Kurian - IJCRt international journal of creative research thoughts - 7 2022. Vol-10.

డా. కాశింశెట్టి సీత్యనారాయణ

విశ్రాంత ఆచార్యుడు

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రత్యర్థులు జనవరి 30, 1948న ఢిల్లీలో జరిగిన గాంధీజీ హత్యోదంతాన్ని ఏడున్నర దశాబ్దాల తరువాత కూడా వారి వారి రాజకీయాలకు అనుగుణంగా ఉపయోగించుకునే ప్రయత్నం కొనసాగిస్తున్నారు. గాంధీజీ హత్య తరువాత నాడు ఆ నిందను మోస్తూ ఆర్ఎస్ఎస్ ఎదుర్కొన్న పరిస్థితులు బాధాకరమైనవి. ఇక హత్యోదంతం పట్ల కాంగ్రెస్ వైఖరి అప్పటికే ధ్వంసమైన ఆ సంస్థ సామాజిక, రాజకీయ విలువలకు అద్దం పడుతుంది. దారుణమైన అణచివేతకు నాటి నెహ్రూ ప్రభుత్వం ఒడిగట్టింది. ప్రథమ ప్రధాని చెప్పిన ఉదారవాదం, ప్రజాస్వామ్యం కేవలం మేడిపండు చందమేనని ఆనాడే రుజువు చేసుకున్నారు. వేలాది మందిని అరెస్టు చేసింది. కేవలం స్వయంసేవకులు కావడమే వారు చేసిన పాపం. గాంధీజీ హత్య జరిగిన ఏడు రోజుల తరువాత, ఫిబ్రవరి 6,1948న సంఘం మీద నిషేధం విధించారు. స్వతంత్ర భారతదేశంలో ఆర్ఎస్ఎస్ ఎదుర్కొన్న తొలి నిషేధం ఇదే. ఆ సమయంలో సర్‌సంఘచాలక్ పరమపూజనీయ ఎంఎస్ గోల్వాల్కర్ ప్రభుత్వానికి ఒక్కటే సవాలు విసిరారు. ఆర్ఎస్ఎస్ మీద ప్రభుత్వం చేసిన ఆరోపణలను రుజువు చేయాలి. చేయలేకపోతే నిషేధం ఎత్తివేయాలి. దీనికి ప్రభుత్వం నుంచి స్పందనే లేదు. జైలులో, బయట కూడా స్వయం సేవకులను కాంగ్రెస్, పోలీసులు సమంగా వేధించిన దాఖలాలు కనిపిస్తాయి.

ఆ అణచివేత, అక్రమ నిర్బంధాలకు, సంస్థ నిషేధానికి నిరసనగా డిసెంబర్ 9,1948 నుంచి స్వయంసేవకులు దేశంలో సత్యాగ్రహాలు ప్రారంభించారు. ఈ మధ్యలో ఎంఎస్ గోల్వాల్కర్ అరెస్టు కూడా జరిగింది. అప్పటి నుంచి 1949 జూలై వరకు ఆయన మధ్యప్రదేశ్‌లోని సియోనీ కారాగారంలో ఉన్నారు. కేంద్రంతో చర్చలన్నీ ఇక్కడ ఉండగానే జరిగాయి. నిషేధం ఎత్తివేతకు ఆర్ఎస్ఎస్ పెద్ద ఉద్యమమే నడిపింది. ఆ ఉద్యమం ఎంత పారదర్శకంగా, చట్ట బద్ధంగా జరిగిందో, ఎందరు పెద్దలు మధ్యవర్తి త్వంతో నిషేధం ఎత్తివేత సాధ్యమైందో గమనించడం అవసరం. అంతిమంగా తేలినది గాంధీజీ హత్యకూ, ఆర్ఎస్ఎస్‌కూ ఎలాంటి సంబంధం లేదనే. ఇదే చరిత్ర కూడా రుజువు చేసింది. 1966లో నియమించిన జీవన్‌లాల్ కపూర్ కమిషన్ కూడా ఇదే ధ్రువీకరించింది.

తాను నష్టపోతున్నా సంఘం దేశంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని అనుకోలేదు. డిసెంబర్ 9,1948న స్వయంసేవకులు ప్రారంభించిన సత్యాగ్రహాలు నెలన్నర పాటు జరిగి, జనవరి, 1949 మూడోవారంలో ముగిశాయి. సుమారు లక్షకు పైగా నిర్బంధాలకు గురయ్యారు (జాగృతి, 29.1.1949). కేంద్రానికీ, సంఘానికీ మధ్య చర్చల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో గురూజీ పిలుపు మేరకు సత్యాగ్రహాలు ఆపారు. చాలా చిత్రంగా ఆర్ఎస్ఎస్‌లో మహిళలు సభ్యులు కారు. అయినా స్త్రీలను కూడా నిర్బంధంలోకి తీసుకున్నారు.

ఎలాంటి వాతావరణంలో చర్చల ప్రక్రియ ప్రారంభమయింది? నాటి కేంద్రం ఆరోపించిన నేరాలను బహిరంగంగా రుజువు చేయాలనీ, లేకుంటే నిషేధం ఎత్తివేయాలని సంఘం కోరింది. దీనికి ప్రభుత్వం సమాధానం ఏమిటి? తమ జాతీయ దృక్పథానికే, అంటే కాంగ్రెస్ దృక్పథానికే, ఇంకా ప్రజాతంత్ర సూత్రాలకు ఆర్ఎస్ఎస్ ధోరణి విరుద్ధం కాబట్టి నిషేధం తొలగించే వీలు లేదని చెప్పింది. కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ ప్రభుత్వం దృక్పథంతో ఏకీభావం లేకుంటే నిషేధం విధిస్తారా? జైళ్లలో ఉంచి చంపుతారా? ఇది భిన్నత్వంలో ఏకత్వం అన్న సూత్రానికీ, పౌరహక్కులకు భంగం కాదని నెహ్రూ అంతటి అంతర్జాతీయ ప్రజాస్వామికవాది ఎందుకు భావించలేకపోయారు?

ఆర్ఎస్ఎస్ సత్యాగ్రహం వల్ల దేశంలో ఏర్పడిన క్లిష్ట పరిస్థితిని నివారించడానికి అనేకమంది లబ్ధప్రతిష్ఠులు రంగంలోకి దిగారు. నిజానికి సంఘం మీద నిషేధం ఎత్తివేయించడానికి 1948, ఆగస్ట్–నవంబర్ మాసాల మధ్య గురూజీయే తన వంతు ప్రయత్నం ప్రారంభించారు. కానీ అది సాగనీయలేదు. అయితే సంఘం మీద నిషేధం ఎత్తి వేయించడానికి ఆ సంవత్సరం డిసెంబర్ నుంచి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. సర్దార్ పటేల్ సన్నిహితుడు, మధ్య పరగణాల హోం మంత్రి డీపీ మిశ్రా, బొంబాయి శాసనసభ్యుడు ఎస్ఎల్ కరందీకార్, ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు డీఆర్ లిమాయే, కేసరి పత్రిక సంపాదకుడు జీవీ కేత్కర్, మద్రాస్‌లో ప్రముఖ న్యాయవాది టీఆర్ వేంకటరామశాస్త్రి, కేంద్ర హోం శాఖ కార్యదర్శి హెచ్‌వీఆర్ అయ్యంగార్ (ఐసీఎస్) తదితరుల పాత్ర ఇందులో కనిపిస్తుంది. గోకుల్‌చంద్ నారంగ్, సిబ్బన్‌లాల్ సక్సేనా, జయకర్ వంటివారి సలహా మీద కేత్కర్ సర్కార్‌కూ, సంఘానికీ నడుమ సయోధ్య ఏర్పరచడానికి ముందుకు వచ్చారు. సత్యాగ్రహాల విరమణకు కేత్కర్ చొరవ ఉపకరించింది. కేత్కర్ మొదట సియోనీ జైలులో గురూజీని కలుసుకుని,

రాజకీయా

సత్యాగ్రహం, దేశంలో నాటి పరిస్థితులపై అది చూపుతున్న ప్రభావాల గురించి వివరించారు. దీనితో గురూజీ ప్రభుత్వం నిషేధం విషయం ఆలోచించడానికి అవకాశం కల్పిస్తూ తాత్కాలికంగా సత్యాగ్రహాలు విరమించాలని పిలుపునిచ్చారు. నాడు సత్యాగ్రహోద్యమానికి నాయకత్వం వహించిన వారు మహావీర్‌జీ. ఆయనే గురూజీ పిలుపును స్వయంసేవకులకు అందచేశారు. మహావీర్‌జీ ఇచ్చిన ప్రకటనను బట్టి సత్యాగ్రహం నాటి దేశ పరిస్థితుల మీద గట్టి ప్రభావమే చూపింది. నిజానికి ఆనాడు ఉన్న పరిస్థితులు అలాంటివి. ఒక పక్క కాందిశీకుల సమస్య, ఇంకో పక్క గాంధీజీ హత్య, వీటికి తోడు పాకిస్తాన్ సైన్యం దొంగదాడి. నిజానికి మహావీర్‌జీ ప్రకటన గమనించదగినది. ఇప్పుడున్న పరిస్థితులలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం తమ ఉద్దేశం కానేకాదని పేర్కొన్నారాయన. అయితే ప్రజాస్వామిక లేదా ప్రజాతంత్రంతో కూడిన స్వాతంత్ర్యాన్ని ప్రతిష్ఠించడానికి మాత్రమే తాము సత్యాగ్రహం చేశామని స్పష్టం చేశారు.

నిషేధం నేపథ్యంలో సంఘం మీద నాడు కేంద్రం చేసిన ఆరోపణలు ఏమిటి? 'మత విరహిత', అంటే సెక్యులర్ రాజ్యానికి సంఘ్ వ్యతిరేకమన్నది ఒకటి. సంఘం ఒక ప్రత్యేక సైన్యం, జాతీయ పతాకాన్ని అవమానపరుస్తుందన్నది మరొకటి. ప్రభుత్వాన్ని కూలదోయడమే ఆశయంగా ఉన్నదని, అందుకే తన నియమావళినీ, ప్రణాళికనూ బహిర్గతం చేయదన్నది మరొకటి. ఇదంతా బ్రిటిష్ చట్టాలకి

సియోనీ కారాగారం

అనుగుణంగా, స్వాతంత్ర్య సమరయోధుల మీద స్వతంత్ర భారత తొలి ప్రభుత్వం చేసిన ఆరోపణల మాదిరిగానే కనిపిస్తాయి. ఆ ఆరోపణలకు గురూజీ ఎప్పటికప్పుడు సమాధానాలు ఇస్తూనే ఉన్నారు. తాము సెక్యులరిస్ట్ స్టేట్‌కు వ్యతిరేకం కాదనే చెప్పారు. సంఘంలో ఇచ్చే శిక్షణ స్వీయరక్షణకు సంబంధించినదే తప్ప, ప్రత్యేక సైన్యంగా ఏర్పడే ఉద్దేశం లేదని తెలియచేశారు. ఇక త్రివర్ణ పతాకాన్ని రక్షించడానికి అవసరమైతే స్వయంసేవక్ ప్రాణాలనైనా ఇస్తాడని ఆయన చెప్పడం గమనార్హం. ప్రతి కార్యక్రమం సంఘం పెద్దల సమక్షంలోనే చేసిందనీ, ప్రభుత్వం పట్టుబడితే సంఘ నియమ నిబంధనావళిని సమర్పించడానికి అభ్యంతరమే లేదని కూడా గురూజీ తేల్చి చెప్పారు. ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర చూసిన నెహ్రూ సర్కార్‌కు సంఘస్థాన్‌లకు గాంధీజీ, డాక్టర్ అంబేద్కర్ వంటివారు అప్పటికి చాలాకాలం క్రితమే హాజరైన సంగతి తెలియదని అనుకోగలమా? వారే కాదు, కట్జూ, కేఎం మున్షీ, నాటి బిహార్ గవర్నర్ ఆణే, మద్రాస్ ప్రధాన న్యాయమూర్తి రాజమన్నార్ సంఘస్థాన్‌లకు వచ్చారు. ఈ వాస్తవాన్ని నెహ్రూ ప్రభుత్వం సౌకర్యంగా మరుగుపరచిందని నిరభ్యంతరంగా చెప్పవచ్చు. అలాగే జాతీయ పతాకాన్ని రాజ్యాంగ పరిషత్ దేశానికి నిర్దేశించింది, ఆ నిర్ణయాన్ని ఎవరూ ప్రశ్నించలేరు అన్నది గురూజీ సమాధానం.

లు, రాయబారాలు

సంఘం ప్రారంభించిన సత్యాగ్రహాలను సమర్థించి, కేంద్రం సత్వర నిర్ణయం తీసుకోవాలని సూచించిన ప్రముఖులలో టీఆర్ వేంకటరామశాస్త్రి కూడా ఉన్నారు. తిరువలంగాడు రాజు వేంకటరామ శాస్త్రి (టీవీఆర్) 1924-1928 మధ్య మద్రాస్ అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. ఉదారవాది. నిషేధం ఎత్తివేతకు నెహ్రూ ప్రభుత్వాన్ని ఒప్పించే పనిలో వేంకటరామశాస్త్రి చొరవ అధికంగా కనిపిస్తుంది. 1949 మార్చి మొదటివారంలో ఆయన పటేల్‌ను కలుసుకోవడానికి న్యూఢిల్లీ వెళ్లారు. నిషేధం తొలగింపు, ఆర్ఎస్ఎస్ నుంచి ప్రభుత్వం కోరుతున్న నియమావళి రూపురేఖల గురించి పటేల్‌తో చర్చించడానికే ఆయన వెళ్లారు. జాగృతి, 19.3.1949 సంచికలో ప్రచురించిన వార్త ప్రకారం గురూజీ ఆమోదం కోసం సంఘ నియమావళిని శాస్త్రి తీసుకుని సియోనీ జైలుకు వెళ్లారు. ఆ నియమావళిని సంఘ నేతలు కూడా ఆమోదించారు. సంఘ నేతలే కాకుండా ఇతర పార్టీల నాయకులు కూడా ఈ నియమావళిని శ్లాఘించారు. కానీ నిషేధం వెంటనే ఎత్తివేసే ఉద్దేశం నెహ్రూ ప్రభుత్వానికి లేదు. తమ వాదనలు, నియమావళి కేంద్రం ముందు ఉంచే అధికారం గురూజీ శాస్త్రికి అప్పగించారు. నియమావళికి గురూజీ తన ఆమోదంతో ఒక లేఖను కూడా జతపరిచారు. ఆ తరువాతే శాస్త్రి కేంద్రానికి అందించారు. గురూజీ ఆమోదించిన నియమావళిని శాస్త్రి తీసుకువెళ్లినప్పటికీ ఏవో సాకులతో కాలయాపన చేసింది. ప్రఖ్యాత న్యాయవాదులు, కార్మిక నాయకులు, కొన్ని పార్టీల నాయకులు కూడా నియమావళికి ఆమోదం తెలియచేయడంతో అప్పుడు మధ్యవర్తుల రాక కేంద్రానికి కన్నెర్రగా మారిందని అనిపిస్తుంది. అప్పటిదాకా మధ్యవర్తుల ప్రమేయాన్ని అనుమతించిన కేంద్రం సమస్య కొలిక్కి వస్తుండగా నిషేధం ఎత్తివేత ప్రయత్నంలో వారికి న్యాయంగా ఎలాంటి అధికారం లేదని కొత్త వాదన తెచ్చింది. ప్రణాళిక రావలసిన తీరుగా సంఘ అధికారుల నుంచి నేరుగా తమకు రాలేదని, ప్రణాళికను అందచేయవలసినది సియోనీ జైలులో ఉన్న గురూజీయే గాని మధ్యవర్తులు కాదని మెలిక పెట్టింది. చర్చల ప్రక్రియకు మొదట సహకరించినప్పటికీ తరువాత డీపీ మిశ్రా కూడా ఏవో సాకులు చూపడం మొదలుపెట్టారు.

జూన్, 1949 ప్రాంతానికి దేశంలో వాతావరణం బాగా మారిపోయింది. ఇందుకు నాగపూర్ హైకోర్టు న్యాయవాదులు చేసిన పత్రికా ప్రకటనే సాక్ష్యం. న్యాయవాదులు సీకేవీ నాయుడు, శ్రీనివాస రావ్, ఠాకూర్ రామచంద్రసింహపవార్, సోస్‌టక్కే, జీబీ గంధే, ఎన్‌కే పెన్స్‌దే తదితరులు విడుదల చేసిన ఆ ప్రకటన చాలా విషయాలు వెల్లడించింది. గాంధీజీ హత్యానంతరం నెలకొన్న అవాంఛనీయ పరిస్థితులు ఇప్పుడు లేవు. అయినా ఆర్ఎస్ఎస్ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ప్రజలను విస్మయానికి లోను చేస్తోంది. గాంధీ పంథాలో సత్యాగ్రహం చేస్తున్న ఆర్ఎస్ఎస్ వారిపైన కాంగ్రెస్ వాదులు హింసాయుత ధోరణిని అవలంబించారని ఆ న్యాయవాదులు పేర్కొనడం విశేషం. కేంద్రానికి పంపించిన ప్రణాళికను తాము కూడా చూశామని అది శాస్త్రబద్ధంగా, నిర్దుష్టంగా ఉందని వారు చెప్పారు. న్యాయశాస్త్రం ప్రకారం ఆ ప్రణాళికను కాదనలేమని కూడా అంగీకరించారు. హిందువుల లోని విరుద్ధ ప్రవృత్తులను నాశనం చేయడానికి ఆర్ఎస్ఎస్ చేసిన కృషిని చూసైనా నిషేధం ఎత్తివేయాలని కోరారు. వేంకటరామశాస్త్రి పట్ల ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని సుప్రసిద్ధ మరాఠీ దినపత్రిక హితవాది సంపాదకుడు ఏడీ మణి తప్పు పట్టారు కూడా. ఢిల్లీ నుంచి వెలువడే 'స్టేట్స్‌మన్' పత్రిక సంఘ ప్రణాళిక మీద వ్యక్తం చేసిన అభిప్రాయం ఇలా ఉంది. ఇది హిరణ్యయ్ లాల్ వ్యాఖ్య. 'సంఘ ప్రణాళికను అనుసరించి సంఘం రాజకీయాలతో సంబంధం లేకుండా కేవలం ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక సామాజిక కార్యకలాపాలకే కట్టుబడి ఉంటుందని విదితమవుతున్నది. ఆ ప్రణాళికలోనే హిందూ ధర్మానికీ, సంస్కృతికి చిహ్నమైన భగవద్ధ్వజాన్ని సంఘ ధ్వజంగా స్వీకరించిందనీ, దానితో పాటే రాజధ్వజం పట్ల కూడా సంపూర్ణ విశ్వాసం చూపుతుందని స్పష్టంగా పేర్కొన్నారు. ఇంత స్పష్టంగా చెప్పిన తరువాత రాజధ్వజం పట్ల (సంఘం) తక్కువ గౌరవం ప్రదర్శించిందన్న ప్రశ్నే రాదు... మిగిలిన సంస్థలన్నీ కాకుండా ఒక్క సంఘాన్ని మత సంస్థగా చూడడం హర్షించదగ్గదిగా లేదు. కొన్ని విషయాలలో పక్షపాతాల ఆరోపణల నుంచి కాంగ్రెస్ తప్పించుకోలేదు' అని రాసింది. ఆపై ప్రభుత్వం కొంత పట్టు వీడింది, 1949 జూన్ మొదటివారంలో దీనదయాళ్ ఉపాధ్యాయను, శ్రీలేఖరాజ్, మరొక ముగ్గురు ప్రముఖులను నెల రోజుల నిర్బంధం తరువాత విడుదల చేసింది.

కానీ తన మధ్యవర్తిత్వం విఫలమయిందని చెబుతూ వేంకటరామశాస్త్రి ఒక వివరణ ఇచ్చారు. దానిని జాగృతి, 13.7.1949 సంచికలో ప్రచురించింది. సంఘ నిర్మాణం, నాయకత్వ ఎన్నిక వంటివన్నీ అప్రజాస్వామికంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తన వద్ద ప్రస్తావించినట్టు శాస్త్రి పేర్కొన్నారు.

కాంగ్రెస్ సుద్దుల వివరాలు వచ్చే సంచికలో..

వికసిత భారతాన్ని విస్పష్టం

మతం-విజ్ఞానం భిన్న స్వభావం కలిగినవంటారు. జ్ఞానం ఆధ్యాత్మికమైనది, అంతరంగానికి సంబంధించినది. విజ్ఞానం బైటకు కనిపించేది. అది ప్రామాణికం, మానవ అనుభవసారంతో కూడినది. ప్రతి ఒక్కరూ సత్య ప్రమాణ పూర్వకమైన దానినే నిజమైన విజ్ఞానంగా స్వీకరించాలి అన్నారు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భగవత్. 2025 డిసెంబర్ 26-29 మధ్య తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా ఏడవ భారతీయ విజ్ఞాన సమ్మేళనం వైభవంగా జరిగింది. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా డాక్టర్ భాగవత్ హాజరయ్యారు. 'సమగ్ర వికాసానికి భారతీయ చింతన' అనే అంశంపై జరిగిన ఈ అద్భుత సమ్మేళనంలో 32 రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1250 మంది ప్రతినిధులు హాజరయ్యారు. విజ్ఞానభారతి ఈ కార్యక్రమం నిర్వహించింది.

డాక్టర్ భాగవత్ తన ప్రసంగంలో ఇంకా, అందరి వికాసమే నిజమైన వికాసమని, భారతదేశం విశ్వాభివృద్ధికి ఎంతో చేయాలనే లక్ష్యంతోనే భారతీయ ధర్మదృష్టి ఉంటుందని గుర్తు చేశారు. భారత్ విశ్వగురు స్థానంలో నిలవడంలోని పవిత్ర ఉద్దేశం జ్ఞాన పిపాసకు వివేకం తోడై విజ్ఞానం ప్రపంచ శ్రేయస్సు కోసం వినియోగపడాలనేదని అన్నారు. ప్రస్తుతం భారతీయ జ్ఞాన పరంపర ఇండియన్ నాలెడ్జ్ సొసైటీ ద్వారా 2000 సంవత్సరాలకు పూర్వం మన రుషులు రచించిన అత్యంత నిగూఢమైన శాస్త్ర సాంకేతిక విషయాలు వెలికి తీసి భావితరానికి అందిస్తున్నదని చెప్పారు. విదేశీ ఆక్రమణల వల్ల స్వదేశీ విజ్ఞాన వికాసం కుంటుపడిందని, మరలా దానిని సరైన మార్గంలో ముందుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రతి వ్యక్తి శారీరక మానసిక ఆధ్యాత్మిక వికాసం పొంది జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెబుతూ, అప్పుడే భారతదేశం ప్రగతిపథంలో దూసుకుపోతూ, విశ్వగురు కలను సార్ధకం చేసుకుంటుందని అన్నారు.

ప్రొఫెసర్ ఐ. వాసు మార్గదర్శకత్వంలో కొంత మంది ప్రముఖ శాస్త్రవేత్తలు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బాంబే)లో స్వదేశీ సైన్స్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం క్రమంగా 'విజ్ఞాన భారతి' అనే జాతీయ సంస్థగా అవతరించింది. స్వదేశీ విజ్ఞానాన్ని సమాజానికి చేరువచేసి, దేశ సమగ్ర వికాస సాధనకు కృషి చేస్తున్నది. ఆ క్రమంలోనే విజ్ఞాన భారతి, భారతీయ విజ్ఞాన సమ్మేళనం, విద్యార్థి విజ్ఞాన సమ్మేళనం, విభావాణి, శిక్షశిల్పి, టెక్ ఫర్ సేవ, సైన్స్ ఇండియా (పత్రిక) ప్రచురణ వంటి అనేక కార్యకలాపాలను దిగ్విజయంగా నిర్వహిస్తోంది. స్వదేశీశాస్త్రాల అభివృద్ధికి విజ్ఞానభారతి బహుముఖీన మైన కార్యకలాపాలను ఏర్పాటు చేస్తోంది. ఈ శాస్త్ర సాంకేతిక యుగంలో సంప్రదాయక , ఆధునిక శాస్త్రాల మధ్య వారధిగా పనిచేస్తుంది. గతంలో భోపాల్ (2007), ఇండోర్ (2009), జలంధర్ (2012), పణజీ (2015), పుణే (2017), అహ్మదాబాద్ (2023)లలో ఆరు విజ్ఞాన సమ్మేళనాలను నిర్వ హించింది. ఏడవది, ఆధ్యాత్మిక విద్యా రాజధానిగా పిలుచుకునే తిరుపతి వేదికగా జరగడం విశేషం.

డిసెంబర్ 26న ఆరంభమైన సమ్మేళనంలో డాక్టర్ భాగవత్; విశిష్ట, గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర శాస్త్రసాంకేతిక మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్, డీఆర్‌డీఓ పూర్వ చైర్మన్ సతీష్‌రెడ్డి, సీఎస్ఐఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్ మాండే హాజరయ్యారు. నాలుగు రోజుల సమ్మేళ నంలో శాస్త్రవేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో సుమారు 900 మంది ప్రతినిధులు.. నూతన ఆవిష్కరణలు భారతీయ విజ్ఞాన వైభవం గురించి భారతీయ భాషలలో పరిశోధనాత్మ కమైన ఆలోచనాత్మకమైన పరిశోధనా పత్రాలను, పోస్టర్లను సమర్పించారు. శాస్త్ర సాంకేతిక అధ్యయనా నికి ఇంగ్లీష్ మాత్రమే కాదు భారతీయ భాషలు కూడా మాధ్యమంగా ఉండగలవని ఈ సమ్మేళనం చాటి చెప్పింది.

విజ్ఞానం ఆధునిక కాలపు పాశ్చాత్యుల నుండే వచ్చిందన్న అభిప్రాయం ఉంది. కానీ, ఈ సమ్మేళనం ద్వారా 12 ప్రత్యేక అంశాలతో ప్రాచీన భారత దేశంలో ఖగోళ గణిత సిద్ధాంత- వేదాంత, జ్యోతిష, పరిపూర్ణ ఆరోగ్య విజ్ఞానం వాస్తు, భాష, వ్యవసాయం పశుపాలన, ధాతు, శక్తి వనరుల సంరక్షణ విజ్ఞానం, జీవవైవిధ్యం, ప్రకృతి వనరుల సంరక్షణ, పర్యావరణ వాతావరణ సముద్ర విజ్ఞానం, భారతీయ కళా విజ్ఞాన వైభవం, పారంపరిక సంప్రదాయ విజ్ఞానం వంటి అనేక జ్ఞాన విజ్ఞాన సంప్రదాయాలు ఏ విధంగా ఉండేవో, ఉన్నాయో.. ప్రస్తుత ప్రపంచానికి తెలియజేస్తూ భారతీయ వారసత్వ సంపద ఘనతను చాటి చెప్పడం ఈ సమ్మేళన లక్ష్యంగా సాగింది. ఇందులో విజయవంతమైంది. ఇంకా శాస్త్ర సాంకేతిక పరిశోధనా నిపుణులైన వారి ఆసక్తికరమైన చర్చా కార్యక్రమాలు, ముఖాముఖి, సైన్స్ బుక్ ఫెయిర్, సైన్స్ అండ్ మ్యాజిక్ షోల రూపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను వివిధ రకాల పోటీలు నిర్వహించడమే కాకుండా, భారతీయతను చాటి చెప్పే సాంస్కృతిక కార్యక్రమాలకు ఇది వేదికగా పనిచేసింది.

డిసెంబర్ 26న నేషనల్ సెక్యూరిటీ సలహా మండలి సభ్యులు డీఆర్‌డీఓ పూర్వ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. తర్వాత సీఎస్ఐఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్ మాండే విజ్ఞానభారతి, ఏడవ సమ్మేళనం ఉద్దేశాలను వివరించారు. కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తుత ప్రభుత్వం సాధించిన శాస్త్ర సాంకేతిక విజయాలను స్పృశిస్తూ.. ప్రస్తుతం భారతదేశంలో ఈ రంగాలలో 35వ స్థానంలో ఉందని, 100 పరిశోధనా పత్రికలలో 20 మన దేశం నుండే

చేసిన విజ్ఞాన సమ్మేళనం

వెలువడుతున్నాయని, చైనా, అమెరికా తర్వాత మూడవ స్థానంలో భారతదేశం ఉందని తెలియ చేశారు. ప్రతి ఒక్కరికి శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడం కోసం శాస్త్రసాంకేతిక అంశాల గ్రంథాలను ప్రాంతీయ భాషల్లో కూడా అనువాదాలు చేసి ప్రచారం కల్పిస్తున్నామని చెప్పారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ 2000 ఏళ్ల క్రితమే ప్రపంచానికి నాగరికతను పరిచయం చేసిన భారత్ త్వరలో సూపర్ పవర్ కావడం ఖాయమని అన్నారు. వేల ఏళ్ల క్రితమే అర్బన్ ప్లానింగ్ అంటే ఏమిటో హరప్పా నాగరికత చాటి చెప్పిందని, 2600 ఏళ్ల క్రితమే మన దేశం ఆయుర్వేదం ద్వారా వైద్యసేవలను అందించిందని గుర్తు చేశారు. ప్రపంచ ఖ్యాతిని ఆర్జించిన తక్షశిల విశ్వవిద్యాలయం నిర్మించుకున్న దేశం మన దేశమేనని, ఖగోళ శాస్త్రంలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరక, అర్థశాస్త్రంలో కౌటిల్యుడు వంటి గొప్పవారు జన్మించిన వైజ్ఞానిక ధాత్రి మనదే అన్నారు. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీతో సహా వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు చేపడుతూ క్వాంటం, ఏఐ, వంటి వాటితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతూ త్వరలో స్పేస్ సిటీ డ్రోన్ సిటీ ఏరోస్పేస్ సిటీ ఎలక్ట్రానిక్ సిటీ మెడిటెక్ పార్క్ వంటి వాటిని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా విజ్ఞానభారతి, ఇండియన్ నాలెడ్జ్ సొసైటీ డివిజన్, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ప్రచురించిన 'భారతీయ జ్ఞాన పరంపర' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమ సంచాలకులుగా విజ్ఞాన భారతి ప్రధాన కార్యదర్శి వివేకానంద పాయ్ వ్యవహరించారు. అనంతరం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రాంగణంలో విశిష్ట అతిథులు, సైన్స్ టెక్నాలజీ ఎక్స్పో ప్రారంభించారు. ఇందులో ఉన్న 90 స్టాల్స్‌ని సమ్మేళనం జరిగిన నాలుగు రోజులు కూడా సందర్శకులు వీక్షించారు.

రెండవ రోజు కార్యక్రమాలలో వికసిత భారత లక్ష్యంతో 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ అప్లికేషన్స్' అనే అంశం మీద ప్రత్యేక సదస్సు జరిగింది. డాక్టర్ జయంత్ వసంత్ జోషి సైన్స్ మ్యాజిక్ షో విద్యార్థుల్లో కొత్త ఆలోచనలని రేకెత్తించింది. ఈ సదస్సులో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యురాలు శామిక రవి (ప్రామాణిక మైన గణాంకాల ద్వారా) ఆర్థిక ప్రగతి ద్వారా 30 కోట్ల మంది ప్రజలు తమ ఆర్థిక స్థితిని మెరుగు పరుచుకున్నారని పేదరిక నుండి బయటపడ్డారని, ప్రసూతి మరణాలు, శిశుమరణాల సంఖ్య గణ నీయంగా తగ్గిందని, ఆత్మనిర్భర్ భారత్‌గా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ఇంకా ఎగుమతులు- దిగుమతులు, నిరుద్యోగం, సంపద పంచడం వంటి పలు ఆర్థిక సామాజిక అంశాలపై సాధికారికంగా వివరించారు.

ఓపెన్ సైన్స్ పబ్లిషింగ్ రౌండ్ టేబుల్ సదస్సులో భారతీయ పరిశోధనా పత్రాలు ప్రచురణ ప్రామాణిక తల గురించి ఆచార్యులు, అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు ప్రసంగించారు.

'సంప్రదాయ వైద్యపద్ధతుల పరిశోధన' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆంధ్రప్రదేశ్ వైద్య కుటుంబ సంక్షమ, వైద్య విద్యామంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయుష్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు కేటాయించిందని, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా, నేచురోపతి సంస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కౌశల్ కార్యక్రమం గురించి మంత్రి వివరించారు.

విజ్ఞానభారతి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఏపీ సీ ఓఎస్‌టీ, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కౌశల్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీని ప్రధాన లక్ష్యం- ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో దాగిన సహజ ప్రతిభా సామర్థ్యాలను వెలికి తీయడం. విజ్ఞానం, గణితం, భూగోళశాస్త్రాలలో భారతీయ శాస్త్రజ్ఞుల చేసిన కృషి గురించి, వివిధ పరిశోధనా సంస్థల గురించి అవగాహన కల్పించడం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 2018 నుండి క్విజ్, పోస్టర్ పోటీలు నిర్వహిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా రీల్స్ పోటీ ద్వారా పదవ తరగతి విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తున్నారు. 60 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పరీక్షలు ఆన్లైన్, ప్రోక్టరింగ్ విధానంలో జరుపుతున్నారు. భవిష్యత్ పోటీ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం, డిజిటల్ అవగాహన విద్యార్థులకు కలుగుతుంది. విజేతలకు జిల్లా స్థాయిలో రూ. నాలుగు లక్షలు, రాష్ట్ర స్థాయిలో 1.5 లక్షల నగదు బహుమతులు అందజేస్తున్నారు. వక్తలు, విజేతలకు పురస్కార ప్రదానంచేస్తూ.. గ్రామీణ నేపథ్యంతో ఉన్న విద్యార్థులు, గిరిజన విద్యార్థుల ప్రతిభను చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పుడు దేశంలో స్టార్టప్ ఇండియా, సైన్స్ ఇండియా, స్కిల్ ఇండియా, కౌశల్ ఇండియా మొదలైన రంగాలలో తమ తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు అపారమైన అవకాశాలు ఉన్నట్లు వక్తలు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లోని 2,580 పాఠశాలల నుండి 37వేల మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 312 మంది విద్యార్థులు ఈ కౌశల్ కార్యక్రమంలో మైనింగ్ స్టార్‌గా ఎంపికయ్యారు. ఇందులో ప్రథమ బహుమతిని పల్నాడు జిల్లా, ద్వితీయ బహుమతిని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కడప జిల్లా తృతీయ బహుమానాన్ని గెలుచుకున్నాయి.

చివరగా 'భారతీయ ప్రాచీన శాస్త్రవిజ్ఞానం- ఆధునికకాలంలో దాని సంరక్షణ-చతుర్విధ పురుషార్థాల నుండి తెలుసుకోవలసిన విషయాలు' అనే అంశంపై శాస్త్రార్థ గోష్టి జరిగింది.

ఆనాటి సాంస్కృతిక కార్యక్రమాలలో పద్మశ్రీ పురస్కార గ్రహీత జి. పద్మజారెడ్డి బృందం 'సమామి గంగే' నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది.

మూడవరోజున 'వికసిత్ భారత్ కోసం సెమీ

కండక్టర్స్ అండ్ ఫ్యాబ్' అన్న అంశంపై చర్చ జరిగింది. పారిశ్రామిక వికాసం– వికసిత్ భారత్ సాధనలో ముఖ్యమైన అంశంగా ప్యానలిస్టులు సోదాహరణంగా విశ్లేషించారు. 'వికసిత్ భారత్ కోసం క్వాంటం, కంప్యూటర్ అండ్ అప్లికేషన్స్' అనే అంశం మీద జరిగిన సదస్సులో, ప్రస్తుతం కంప్యూటర్ ప్రపంచంలో సరికొత్త పంథాను సృష్టిస్తున్న 'క్వాంటం కంప్యూటర్ అండ్ అప్లికేషన్స్' వికసిత్ భారత సాధనలో కీలకంగా మారనుందని పానెలిస్టులు ప్రామాణికంగా వివరించారు. 'నీ వారసత్వ సంపదని తెలుసుకో' అనే అంశం మీద జరిగిన ప్రత్యేక పోటీకి దేశంలోని పలు రాష్ట్రాల నుండి 240 ఎంట్రీలు రాగా వాటిలో 40 ఎంట్రీలు ఎంపికయ్యాయి. ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మొదలైన రాష్ట్రాల నుండి వచ్చి ప్రత్యక్షంగా పోటీలో 26 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చారిత్రక కట్టడాలు, ఆలయాలు, ప్రకృతి, పక్షులు ఇలాంటి ఎన్నో అంశాలని పోస్టర్ మాధ్యమంలో, రీల్స్ మాధ్యమంలో విద్యార్థులు ప్రదర్శించి న్యాయ నిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. 'అకడెమిక్ లీడర్స్– సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎడ్యుకేషన్ విత్ భారతీయ పర్స్పెక్టివ్', వైజ్ఞానిక బోధనలో గుణాత్మకమైన మార్పు కోసం భారతీయ దృక్కోణం– వైజ్ఞానిక విద్యా కార్యక్రమంలో బోధనా పద్ధతిలో తీసుకురావాల్సిన మార్పుల గురించి వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులు చర్చించారు. చివరగా ఆనాటి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గణిత ఆధారిత నాటకం, యోగాసనాల ప్రదర్శన, మహాకాళి కూచిపూడి నృత్య ప్రదర్శన, ఘంటావధానం, నేత్రావధానం, 'సంకల్ప బలం', 'భగవదజ్జుకం' నాటకాల వీడియో ప్రదర్శనలు, యాంటీ రాగింగ్ వీడియో షో, ప్రేక్షకుల్ని విశేషంగా అలరించాయి.

చివరిరోజున (29 డిసెంబర్) 'శాస్త్ర సాంకేతిక విద్యలో భారతీయ జ్ఞాన పరంపర' అనే అంశంపై లోతైన చర్చ జరిగింది. భారతీయ జ్ఞాన పరంపర ఆధారంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన సంబంధంలో సరికొత్త ఆవిష్కరణలు జరగాలని వక్తలు అభిప్రాయ పడ్డారు. ఇందుకు సంబంధించిన వివిధ అంశాలపై 700 మంది అధ్యాపకులు పరిశోధకులు, విద్యార్థులు సమర్పించిన పోస్టర్స్‌ను ప్రదర్శించి విశ్లేషించారు. ఆచార్య కె. సుబ్రహ్మణ్యన్ (ఐఐటి బాంబే) 'టూల్స్ అండ్ గాడ్జెట్స్' 'ఆర్థిక ప్రగతి' వంటి పలు విషయాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు.

ముగింపు సమావేశానికి ఆచార్య కె.సుబ్రహ్మణ్యన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భావ కాలుష్యం లేని, అవినీతి రాహిత్యం, విలువలు పాటించడం తోడైనప్పుడే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో వికసిత్ భారత్ సాధించగలమని ఆయన అన్నారు. జ్ఞాన విజ్ఞానాల సమన్వయంతోనే సుస్థిరాభివృద్ధిని సాధించ గలమని 'విజ్ఞానభారత్' జాతీయ సంఘటన కార్యదర్శి డాక్టర్ శివకుమార్ శర్మ అన్నారు. జీవన సాఫల్యం కన్నా, జీవన సార్థకత గురించి ఆలోచించా లన్నారు.

ఈ సమ్మేళనంలో మొత్తం నాలుగు ప్లీనరీ సెషన్స్, 28 అకడమిక్ సెషన్స్ జరిగాయి. వాటిలో 250 పరిశోధనా పత్ర సమర్పణలు, 700 పోస్టర్స్ ప్రజెంటేషన్లు జరిగాయి. భారతీయ విజ్ఞానానికి మూలమైన సంస్కృత భాషా సాహిత్యాలను బోధిస్తున్న, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(డీమ్డ్ యూనివర్సిటీ) వేదికగా, ఏడవ భారతీయ విజ్ఞాన సమ్మేళనం జయప్రదంగా ముగియడం పట్ల నిర్వాహకులు ప్రతినిధులు ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేశారు.

మల్లేశ్వరరావు ఆకుల
ఆకాశవాణి మాజీ ఉద్యోగి
79818 72655

అమెరికా చేతి

అట్లాంటిక్ అంతటా భారీ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు నెలకొన్ని ఉన్నత రుణంలో, అమెరికా వెనుజులాపై తీవ్రమైన స్థాయిలో సైనికదాడిని ప్రారంభించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ దాడిని సమర్థించుకుంటున్నారు. కరేబియన్ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించినట్టు గొప్పగా చెప్పుకున్నారు. అట్లాంటిక్‌లో అగ్ర రాజ్యాల బల ప్రదర్శన పోటీలో ఈ ప్రాథమిక మార్పు, కారకాస్, విస్తృత పసిఫిక్, అట్లాంటిక్ ప్రాంతంలో అపారమైన ఇంధన వనరులపై ఆధిపత్యాన్ని ట్రంప్ ఆకాంక్షిస్తున్నారు. ఈ వ్యూహాత్మక చదరంగంపైన ఆయన కదిపిన మొదటి బంటుగా మదురోను బంధించడాన్ని భావిం చాల్సి ఉంటుంది. అందుకే ఇలా పరాయి దేశాధ్యక్షులను ఎత్తుకురావడమనే ఆందోళనకర మైన సంప్రదా యానికి అమెరికా నాంది పలికిందని ఐక్యరాజ్యసమితి వాపోయింది.

21వ శతాబ్దపు బల ప్రదర్శన పోటీలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధిపత్యాన్ని కోరుకునే లక్ష్యంతో అపారమైన శక్తి, ఆశయాలు కలిగిన వ్యక్తిగా ఉద్భవించారు. ఈ అతి లావాదేవీల వ్యూహాత్మక గణనలో, ట్రంప్ లక్ష్యంగా చేసుకున్న తాజా బంటు కరేబియన్ దేశం వెనుజులా. భౌగోళిక రాజకీయ వేదికపై అత్యంత సంపన్నమైన చమురు నిక్షేపాలు కలిగిన దేశం. అయితే, ఇంధన ఆశయా లను కప్పిపుచ్చడానికి ట్రంప్ ఉపయోగించే వ్యూహా త్మక ముసుగు "మాదకద్రవ్యాలపై యుద్ధం". దక్షిణ అమెరికా దేశం వెనుజులా మాదకద్రవ్యాల కేంద్రంగా ఉందని, అధ్యక్షుడు నికోలస్ మదురో 'మాదకద్రవ్య నియంత' అని ఆయన పదే పదే పేర్కొన్నారు.

వెనిజులాలో సాగే ఈ నార్కో వ్యాపారం అమె రికాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఎందుకంటే ఆ దేశం మాదకద్రవ్యాలు, స్మగ్లర్లతో నిండిపోయింది. అందువల్ల వాషింగ్టన్ డీసీ పసిఫిక్ దేశంపై దాడిని ప్రారంభించిందని ట్రంప్ అన్నారు. అయితే, దీని వెనుక ఉన్న నిజమైన కారణాలు మాదకద్రవ్యాలపై యుద్ధం కంటే ఇంధన ఆశయాలు, ఆధిపత్య ఆకాం క్షలు, పసిఫిక్, అట్లాంటిక్ నమూనాపై నియంత్రణ కలిగి ఉండాలనే ఆకాంక్షల గురించి ఎక్కువగా వెల్లడిస్తున్నాయి. అమెరికా కారకాస్ సార్వభౌమత్వాన్ని స్పష్టంగా ఉల్లంఘించడం, భౌగోళిక రాజకీయ చదరంగంలో ఒక భారీ ఎత్తుగడగా భావించాల్సి ఉంటుంది.

లో వెనుజులా అధ్యక్షుడు బందీ

అమెరికా అరాచకం

జనవరి 3వ తేదీ శనివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో, వెనుజులా రాజధాని కారకాస్‌లో కనీసం 7 పేలుళ్లు, తక్కువ ఎత్తులో విమానాల శబ్దాలు వినిపించాయి. కారకాస్‌లోని ఒక సైనిక స్థావరం నుండి భారీ పొగ వెలువడటం కనిపించింది. మరో సైనిక స్థావరం కూడా ధ్వంస మైంది. అమెరికా లక్ష్యంగా చేసుకున్న నగరం కేంద్ర బిందువులో లా కార్లోటా, ఫ్యూర్టే టియునా కీలకమైన సైనిక స్థావరాలు. ఆకస్మిక పేలుళ్లతో పొరుగున ఉన్న ప్రజలు భయాందోళనకు గురై వీధుల్లోకి పరుగులు తీశారు. "మొత్తం భూమి కంపించింది. ఇది భయం కరమైనది. మేము పేలుళ్లు, విమానాల శబ్దాలు విన్నాము. గాలి మమ్మల్ని డీకొంటున్నట్లు మాకు అనిపించింది" అని ప్రత్యక్ష సాక్షులలో ఒకరు వివరించారు.

వెనుజులాలో అత్యవసర పరిస్థితి విధింపు

భారీ సైనిక దాడుల తర్వాత, వెనుజులా ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని విధించింది. ఈ ఉద్రిక్తతను అమెరికా "తీవ్రమైన సైనిక దురాక్రమణ"గా ప్రభుత్వం ఆరోపించింది. "అమెరికా ప్రస్తుత ప్రభుత్వం వెనిజులా భూభాగం, ప్రజలపై చేస్తున్న అత్యంత తీవ్రమైన సైనిక దురాక్రమణను వెనిజులా అంతర్జాతీయ సమాజం ముందు తిరస్కరి స్తుంది, తిరస్కరిస్తుంది, ఖండిస్తుంది" అని వెనుజులా ప్రభుత్వం నొక్కి చెప్పింది. 'శాంతికర్త' ట్రంప్ 'సామ్రాజ్యవాద దురాక్రమణ'కు వ్యతిరేకంగా ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చింది.

ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా వెనిజులాపై, దాని అధ్యక్షుడు నికోలస్ మదురోపై పెద్ద ఎత్తున దాడిని విజయవంతంగా నిర్వహించింది. ఆయన భార్యతో పాటు ఆయనను బంధించి దేశం నుండి తరలిం చారు" అని రాశారు.

ఇదే విషయమై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో మాట్లాడుతూ "మదురో వెనుజులా అధ్యక్షుడు కాదు. అతని ప్రభుత్వం చట్టబద్ధమైన ప్రభుత్వం కాదు. మదురో ఒక దేశాన్ని స్వాధీనం చేసుకున్న నార్కో-టెర్రర్ సంస్థ కార్టెల్ డి లాస్ సోల్స్ అధిపతి. అతడిపై అమెరికాకు మాదకద్రవ్యాలను రవాణా చేశాడనే అభియోగం ఉంది" అని పేర్కొన్నారు. అలాగే, అమెరికా విడుదల చేసిన ఒక ఫొటో మదురోను యుఎస్ ప్రత్యేక దళాలు అరెస్టు చేసినట్లు చూపిస్తుంది. మదురో, అతని భార్య సిలియా న్యూయార్క్‌లోని దక్షిణ జిల్లాలో నార్కో-టెర్రర్‌ను ప్రోత్సహించడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అక్రమ పడవల ద్వారా యుఎస్‌లోకి స్మగ్లర్లను ప్రవేశపెట్టడం వంటి నేరాలకు పాల్పడినట్లు యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండి తెలిపారు. వాషింగ్టన్ డిసిని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో మెషిన్ గన్స్, ఇతర విధ్వంసక పరికరాలను కలిగి ఉన్నందుకు కూడా మదురోపై అమెరికా ఆరోపణ చేసింది. "వారు అమెరికన్ కోర్టులలో అమెరికన్ గడ్డపై అమెరికన్ న్యాయం పూర్తి ఆగ్రహాన్ని ఎదుర్కొంటారు" అని అటార్నీ జనరల్ స్పష్టం చేశారు.

కరేబియన్ దేశం లక్ష్యంగా ట్రంప్ చర్యలు

డొనాల్డ్ ట్రంప్ తన మొదటిసారి అధ్యక్షుడు అయిన నాటి నుండి వెనుజులా, దాని అధ్యక్షుడు నికోలస్ మదురోపై అవిశ్రాంతంగా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అయితే, రెండవ దఫా పదవీ కాలంలో లక్ష్యం మరింత పదునైనది. వెనుజులాలోని డ్రగ్ కార్టెల్స్ అమెరికా జాతీయ భద్రతకు ముప్పు అని ట్రంప్ ఆరోపించారు. ఆయన మదురోపై "నార్కో-నియంత" ముద్ర వేశారు. మదురోపై అమెరికా 50 మిలియన్ డాలర్ల రివార్డును ప్రకటిం చింది. మాదకద్రవ్యాల డీలర్లు, స్మగ్లర్లు, ఖైదీలు, మానసిక ఆరోగ్య కేంద్రాల నుండి మతిస్థి మితం లేనివారితో పాటుగా వేలాది మంది ఇతర అక్రమ వలసదారులు అమెరికాలోకి చొరబడటానికి వెనుజులా కూడా కారణమని ట్రంప్ ఆరోపించారు.

ఒక దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువ కాలం నుండి వెనుజులా నుండి దాదాపు 80 లక్షల మంది పారిపోయి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించారని ట్రంప్ ఆరోపించారు. మదురో "దేశంలోని జైళ్లు, మానసిక ఆరోగ్య కేంద్రాలను ఖాళీ చేసాడు. వాటిని అమెరికాకు తరలించాడు అని విమర్శించారు. ట్రంప్ తన రెండవసారి అధ్యక్ష హయాంలో ఈ ఆరోపణలు భయంకరమైన స్థాయికి చేరుకున్నాయి. వెనుజులాపై ఆర్థిక ఆంక్షలు కూడా విధించారు. వెనుజులా నుండి డజన్ల కొద్దీ మాదకద్రవ్యాల పడవలను కూడా అమెరికా లక్ష్యంగా చేసుకుంది. దీని ఫలితంగా వందలాది మంది మరణించారు. మాదకద్రవ్యాల పడవలను ధ్వంసం చేయడానికి అమెరికన్ యుద్ధ నౌకలను కరేబియన్ దేశం పరిసరాల్లో మోహరిం చారు.

ప్రస్తుతం వెనుజులా పరిసరాల్లో 15,000 కంటే ఎక్కువగా అమెరికా పటాలాలు మోహరించి ఉన్నాయి. ఇది ఇటీవలి దశాబ్దాలలో కరేబియాలో అమెరికా అతిపెద్ద సైనిక స్థావరంగా నిలిచింది. డిసెంబర్ 2025లో, ట్రంప్ వెనుజులాపై విదేశీ ఉగ్రవాద సంస్థ అనే ముద్ర వేశారు. అమెరికా ఆంక్షలు విధించిన అన్ని చమురు ట్యాంకర్లను కారకాస్‌లోకి ప్రవేశించకుండా నిరోధించారు. వెనుజులా అమెరికా లోని ఫ్లోరిడా తీరం నుండి కేవలం 2,000 కిలో మీటర్ల దూరంలో ఉంది.

అట్లాంటిక్ ప్రాంతంపై ఆధిపత్యం కోసం

ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన "మాదకద్రవ్యాలపై యుద్ధం" వెనుక ఒక ఆధిపత్య అజెండా ఉంది. ట్రంప్ కరేబియన్ దేశంలో అరాచకత్వాన్ని లేవ నెత్తడం ద్వారా, వెనుజులా నాయకత్వం, పరిపాలనను బలహీనపరచడం ద్వారా ఆ దేశపు సంపన్న చమురు, ఇంధన రిపోజిటరీపై నియంత్రణను వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని భౌగోళిక రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. తద్వారా, మొత్తం పసిఫిక్, అట్లాంటిక్ ప్రాంతాన్ని, దాని విస్తారమైన ఇంధన వనరులను హస్తగతం చేసుకో వడం లక్ష్యం. వెనుజులా ప్రపంచంలోనే అతిపెద్ద నిరూపితమైన చమురు నిల్వలను కలిగి ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తిదారు. ప్రపంచ నిల్వలలో 17 శాతం వాటాను కలిగి ఉంది. సౌదీ అరేబియా కంటే పెద్దది.

– జాగృతి డెస్క్

పశ్చిమ బెంగాల్ శాసనసభకు ఎన్నికలు జరగడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, రాష్ట్రం తీవ్రస్థాయి రాజకీయ ప్రచారాలతో వేడెక్కిపోతోంది. రాజకీయ ఎత్తులు, పై ఎత్తులు, వ్యూహాలు, ప్రతివ్యూహాలతో మార్మోగి పోతూ యావద్దేశం దృష్టినీ ఆకర్షిస్తోంది. ప్రతి రాజకీయ పార్టీ తన సత్తాను నిరూపించుకునేందుకు, వీలైతే అధికారంలోకి వచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తోంది. అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీయే కాక, కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతా పార్టీ, వామపక్షలు సర్వశక్తులూ వొడ్డి పోరాటం సాగిస్తున్నాయి. రాష్ట్రంలో తన ప్రాభవాన్ని, ప్రాధాన్యాన్ని పూర్తిగా కోల్పోయి, తన మనుగడ కోసం, కనీస అస్తిత్వం కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలను కలుపుకుని పోవడానికి నానా అవస్థలూ పడుతోంది.

కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో కాస్తో కూస్తో పట్టు, పలుకుబడి ఉన్న అధీర్ రంజన్ చౌధురి ప్రయత్నా లను, వ్యూహాలను చూసినవారికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏమిటనేది పూర్తిగా అర్థమవు తుంది. అధీర్ రంజన్ చౌధురి ఒకప్పుడు పశ్చిమ బెంగాల్‌లో ఒక వెలుగు వెలిగిన వ్యక్తి. కేంద్రంలో కూడా ఆయన మాటకు ఎదురుండేది కాదు. ప్రస్తుతం ఆయన తన ముర్షీదాబాద్ నియోజకవర్గంలో బలం కూడగట్టుకోవడానికి చెమటలు కక్కుతున్నారు. ఆయన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షునిగా, గతంలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడుగా కూడా పని చేశారు. ఆయన తన స్థానాన్ని కాపాడుకోవడానికి నానా తిప్పలూ పడుతుండగా, ఆయనను ఎటువంటి పరిస్థితుల్లోనూ గెలవనివ్వరాదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గట్టి పట్టుదలతో ఉన్నారు. ఈ విషయంలో ఆమె ఇతర పార్టీలను కూడా కలుపుకునిపోయే ప్రయత్నంలో ఉన్నారు.

జి.రాజశేఖర్
సీనియర్ జర్నలిస్ట్

అమీ తుమీ పోటీ

గతంలో కూడా అధీర్ రంజన్ చౌధురిని మమతా బెనర్జీ ఈ విధంగా ఓడించడం వల్లే ఆయనకు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పట్టుపోయింది. కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను దాదాపు మరచిపోయింది. ఆయన స్థానంలో కాంగ్రెస్ పార్టీ మరో నాయకుడిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. ఆ తర్వాత ఆయనను కూడా మార్చి, మళ్లీ చౌధురినే పార్టీ అధ్యక్షుడిని చేసింది. ఈ ప్రయోగాల వల్ల కాంగ్రెస్ పార్టీకి పశ్చిమ బెంగాల్‌లో మరింత దుర్దశ దాపురించింది. ప్రస్తుతం ఆ పార్టీ అక్కడ నామరూపాల్లేని పరిస్థితిలో ఉంది. నిజానికి, రాష్ట్రంలో మమతా బెనర్జీ అధికారం లోకి వచ్చిన తర్వాత నుంచి ఒక కొత్తరకం రాజకీయ పునరేకీకరణ చోటు చేసుకోవడంతో, కాంగ్రెస్ పార్టీకి ప్రాధాన్యం పోవడంతో పాటు, దాని ఓటు బ్యాంకు కూడా పూర్తిగా క్షీణించిపోయింది.

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉండి, రాజీవ్ గాంధీ ప్రోద్బలంతో అంచెలంచెలుగా ఎదిగిన మమతా బెనర్జీ ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వేటాడడమే తన ప్రధాన లక్ష్యంగా చేసుకున్నారు. రాజీవ్ అండ దండలతో ఆమె పార్టీలో ఎదడగమే కాకుండా, మొదటిసారిగా విదేశాలకు వెళ్లడం కూడా జరిగింది. అయితే, ఆమె ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకి వచ్చి, అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పేరుతో సొంత కుంపటి పెట్టుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని పూర్తిగా తుడిచిపెట్టడానికి కంకణం కట్టుకున్న మమత ఆ విషయంలో కృతకృత్యు రాలు కావడమే కాక, కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం ఓటు బ్యాంకును పూర్తిగా తన వైపునకు తిప్పు కున్నారు. ఈ ప్రయత్నంలోనే ఆమె అనేక విధాలుగా హద్దులు దాటారు. కాంగ్రెస్ నుంచే కాక సి.పి.ఐ(ఎం)లో ఉన్న ముస్లింలను కూడా ఆమె తృణమూల్ కాంగ్రెస్ పార్టీలోకి తీసుకు రాగలిగారు.

ఓటు బ్యాంకుకు గండి

ఆమె పార్టీలో ఆమె తరఫున పోరాడేవారిలో ఎక్కువ మంది సి.పి.ఐ(ఎం) నుంచి వచ్చినవారే. అయితే, ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా ఆమె ఆ తర్వాత వారినందరినీ దూరం పెట్టేయడం ప్రారంభించారు. వారంతా తమ పూర్వ వాసనల నుంచి బయటపడడం లేదని ఆమె భావించారు. ఇతర పార్టీల నుంచే కాక, రాష్ట్రంలోని ముస్లిం వర్గాలన్నింటిని ఆమె రక రకాల ప్రలోభాలతో తన వైపు తిప్పుకోవడం జరిగింది. ప్రస్తుతం ఆమె దాని పర్యవసానాలను అనుభవిస్తున్నారు. ఆమె పార్టీలోనూ, ఆమె ఆంతరంగిక వర్గంలోనూ పాతుకుపోయిన ముస్లింలకు ఆమె మించిన ఆశలున్నాయి. వారు

తృణమూల్

అత్యాశకు పోయి, పదవులను ఆశించడం, బాధ్యతలను ఆశించడం రాను రానూ ఎక్కువయింది. ఒక్కొక్కరు ఆమె మీద తిరుగుబాటు చేయడం కూడా ప్రారంభమైంది. ఇంత వరకూ బహిరంగ తిరుగు బాటుకు అవకాశం రాలేదు కానీ, అంతరంగికంగా మాత్రం వారు ఆమెకు ఎదురు తిరుగుతున్నారు. రాజకీయ ప్రతిఫలం కోసం వారు ఆమె మీద తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకు వస్తున్నారు. మమతా బెనర్జీ అడపా దడపా విదిలించే చిన్నా చితకా ప్రయోజనా లతో వారు సంతృప్తి చెందే అవకాశం కనిపించడం లేదు.

ఆమెకు దాదాపు కుడి భుజంగా ఉన్న హుమయూన్ కబీర్ తాను లేకపోతే మమతా బెనర్జీ లేరన్న అభిప్రాయానికి వచ్చేశారు. ఆయన మమత అధికారాన్ని సవాలు చేయడం ప్రారంభించారు. ఆమెతో విభేదించి బయటకు వచ్చేసిన కబీర్ సొంతగా పార్టీ పెట్టి, ఆమె పాలన మీద విమర్శలు సాగించడం జరుగుతోంది. ముస్లింలంతా తన వైపే ఉన్నారని కూడా ఆయన ఘనంగా చెప్పుకుంటున్నారు. ముస్లింలను పూర్తిగా తన వైపునకు తిప్పుకున్న పక్షంలో తాను ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుందని, ఇతర పార్టీలేవీ అధికారం లోకి వచ్చే అవకాశం లేదు కనుక తనకు ప్రాధాన్యం పెరుగుతుందని ఆయన భావిస్తున్నారు.

హిందువులకు గాలం

పశ్చిమ బెంగాల్‌లో ఒక వింతైన పరిస్థితి రూపు దిద్దుకుంటోంది. రాష్ట్రంలో ముస్లింలంతా

తత్తరపాటు!

గంపగుత్తగా ఏ పార్టీకీ మద్దతునిచ్చే అవకాశం కనిపించడం లేదు. ముస్లింలలో ఎక్కువ మంది సొంత పార్టీలు పెట్టుకోవడమో, తాము గతంలో ఉన్న పార్టీలకు తిరిగి వెళ్లిపోవడమో జరుగుతోంది. కాంగ్రెస్, సి.పి.ఐ(ఎం)ల నుంచి వచ్చిన ముస్లింలలో ఎక్కువ మంది ఇప్పటికే తమ పాత గూళ్లకు చేరుకుంటున్నారు. మమతా బెనర్జీకి ఈ విషయం బాగా అర్థమైంది. తాను పార్టీని ప్రారంభించిన మొదట్లో మాదిరిగానే ఆమె ఇప్పుడు హిందువులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేయడం కంటే హిందువులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేయడం వల్ల తప్పకుండా తాను తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆమె గట్టి నమ్మకంతో ఉన్నారు. హిందూ ఓటర్ల మద్దతు కూడగట్టుకోవడానికి ఆమె బహిరంగంగానే కొన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ఒడిశా సరిహద్దుల్లో, సముద్ర తీరానికి దగ్గరగా దిఘా అనే ప్రాంతంలో ఆమె ఒక అతి పెద్ద జగన్నాథ స్వామి ఆలయాన్ని నిర్మించారు. పూరీలోని జగన్నాథ స్వామి ఆలయాన్ని తలపించే విధంగా ఆమె ఈ ఆలయాన్ని నిర్మించడం జరిగింది. పూరీ జగన్నాథ స్వామి ఆలయంతో దీనికి ఏ విధంగానూ పోలిక లేనప్పటికీ, ఆమె మాత్రం పూరీ ఆలయాన్ని ఇది మించిపోతుందంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ ఆలయ నిర్వహణ బాధ్యతలను ఆమె ఇస్కాన్‌కు అప్పగించారు. ఆమె ఇక్కడితో ఆగలేదు. కోల్‌కతాలోని న్యూ టౌన్ ప్రాంతంలో దుర్గాంగన్ పేరుతో ఒక కొత్త ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. సాధారణంగా పశ్చిమ బెంగాల్‌లో దుర్గాదేవి అనే పేరుకు బెంగాలీలు బాగా విలువనిస్తారు. దుర్గాదేవి పేరుతో ఏది నిర్మాణమైనా దాన్ని ఆదరిస్తారు. ఆ ప్రాంగ ణంలో ఒక అతి పెద్ద దుర్గాదేవి ఆలయ నిర్మాణం ప్రారంభించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్న హిందువులను ఆకట్టుకోవడానికి ఆమె తన సహజ లక్షణాలకు విరుద్ధంగా పడరాని పాట్లు పడుతున్నారు.

దీదీ వ్యూహానికి ముస్లింలు అడ్డు

పశ్చిమ బెంగాల్ సీఎం అంచనాలకు వ్యతిరేకంగా దుర్గాంగన్ ఆలయ నిర్మాణ వ్యవహారం వివాదంలో పడింది. తమకు సంబంధించిన స్థలంలో దుర్గాదేవి ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నారంటూ కొందరు ముస్లిం నాయకులు హైకోర్టుకు వెళ్లారు. ఆలయ నిర్మాణాన్ని తక్షణం ఆపేయాలని, వేరే ప్రాంతంలో ఈ నిర్మాణం చేపట్టాలని వారు న్యాయస్థానాన్ని కోరడంతో ప్రస్తుతం అక్కడి ఆలయ నిర్మాణం ఆగిపోయింది. ప్రత్యామ్నాయ స్థలం కోసం అన్వేషణ జరుగుతోంది. ఆమె ఎన్నికల వ్యూహం అక్కడితోపూర్తి కాలేదు. ఒకపక్క ముస్లింలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూనే మరో పక్క హిందువులను ఆకట్టుకోవడానికి కూడా ఆమె ప్రయత్నాలు సాగిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ లో ఆమె వ్యూహాలు, ప్రతి వ్యూహాల ముందు ఇతర పార్టీల వ్యూహాలన్నీ బలాదూరేనని ఆమె అనుకూల పత్రికలు కూడా ఇతోధికంగా ప్రచారం చేస్తున్నాయి.

బీజేపీకి అనుకూల పవనాలు

భారతీయ జనతా పార్టీకి పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితులు అనుకూలంగా మారుతున్నట్టు సర్వేలు తెలియజేస్తున్నాయి. బీజేపీ చేపట్టిన విజయమా.. వినాశనమా? అనే నినాదం ప్రజల్లోకి బాగా వెడుతోందని పార్టీ వర్గాలు కూడా భావిస్తున్నాయి. రాష్ట్ర శాసనసభ ఎన్నికల కోసం ప్రత్యేక వ్యూహాలతో ముందుకువెడుతున్న బీజేపీ 2021లో చేసిన పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకున్నట్టు కనిపిస్తోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో బీజేపీ బృందంఒకటి ఇక్కడ రాత్రింబగళ్లు తీవ్రంగా ప్రచార వ్యూహాలను రూపొందిస్తోంది. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చే పక్షంలో రాష్ట్రం సర్వనాశనం కావడం ఖాయమని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. మమత హయాంలో రాష్ట్రంలో అవినీతి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటివి ఏ విధంగా పెరిగిపోయాయో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

అమిత్ షా చేపట్టిన అతి కీలకమైన వ్యూహం ప్రకారం, రాష్ట్రంలో ఈసారి ఎన్నికల ప్రచారం ఒకే వ్యక్తి మీద ఆధారపడి ఉండదు. సామిక్ భట్టాచార్య, సువేందు అధికారి, సుకాంత మజుందార్, దిలీప్ ఘోష్‌ల పేర్లను ప్రచారంలో ఉంచడం జరుగు తోంది. అమిత్ షా నాయకత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఈ నలుగురు నాయకులు కలిసి అవిశ్రాంతంగా ప్రచారం చేయడం, పర్యటనలు చేయడం జరుగుతుంది.

తమ ప్రచారంతో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేయాలన్నది వీరి వ్యూహం. అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యతతో పాటు, ప్రచార సరళిని రూపొందించే బాధ్యత కూడా అమిత్ షా బృందం మీదే ఆధారపడి ఉంటుంది. అమిత్ షా తరచూ కోల్‌కతా వచ్చి పార్టీ నాయకులతో సమావేశమై ఎప్పటికప్పుడు వ్యూహాలను రూపొందిం చడం జరుగుతోంది. శాసనసభ ఎన్నికల పోటీ అంతా మమతా బెనర్జీ, అమిత్ షాల మధ్యనే ఉందన్న ట్టుగా ఇప్పుడు అక్కడ పరిస్థితి మారిపోయింది. ★



కథ

"ఇక్కడ ధరలు అన్నీ ఆకాశం అంటుతున్నట్లే ఉన్నాయి. పిల్లలకి స్పెషల్ కోచింగ్ ఖర్చు భారం కూడా మొదలయ్యింది. తొందరగా ఉద్యోగం వెతుక్కోవాలి" బట్టలతో పాటు, గజిబిజిగా ఉన్న తన ఆలోచనలను, అవసరాలను కూడా ఒక పొత్తిగా చేసే ప్రయత్నంలో ఉంది నీలవేణి. ఆ ఫ్లాట్‌ను వాళ్లు మొన్నమొన్ననే కొనుక్కుని గృహప్రవేశం అయ్యారు. సెకండ్ హాండ్ ఫ్లాట్ అయినా బాగుందని పైగా సెంటర్లో ఉందని కొనుక్కున్నారు. ఈ మార్పిడిలో పిల్లవాడి కాలేజీ, భర్త ఆఫీసు దగ్గరైతే నీలవేణి పనిచేసే ప్రైవేట్ స్కూల్ మటుకు దూరమయ్యింది. సంసారంలో భారాన్ని సమర్ధించుకుంటూ, అంత దూరంలో ఉన్న స్కూల్‌కు పొద్దున్నే పరిగెత్తలేక ఉద్యోగాన్ని త్యాగం చేసింది.

మోగిన కాలింగ్ బెల్ శబ్దానికి ఆలోచనలను, చేస్తున్న పనిని వదిలి, తలెత్తి చూసింది నీలవేణి. గ్రిల్ డోర్ నుండి అవతల నిలుచుని ఉన్న మనిషి, 'ఆకుల మధ్య ఒదిగి ఉన్న కాయలాగా' పూర్తిగా కనపడటం లేదు. చేతిలో ఉన్న బట్టలను ప్రక్కన పెట్టి, లాక్ చేసి ఉన్న గ్రిల్ డోర్ కేసి నడిచింది.

ఎదురుగా, నవ్వు మొహంతో నిలబడ్డ ముప్పై ఏళ్ల అమ్మాయి.

'ఎవరు' అన్నట్లు చూసింది నీలవేణి.

కళ్లతో అడిగిన ఆ ప్రశ్నకు జవాబుగా

"అమ్మా, పనికి అడిగారట" అంది ఆ అమ్మాయి.

"ఎవరు పంపారు" ఆరాగా అడిగింది నీలవేణి.

సమన్వయం

సి.యమున

"మీ మావగారు,'మా కోడలికి పనికి మనిషి కావాలి' అని సెక్యూరిటీకి చెప్పారట. ఆ అబ్బాయే నన్ను పంపాడు"

ఆ మాటలకు భరోసాగా ఫీల్ అయ్యి, "అవునా" అంటూ గ్రిల్ తాళం తీసింది నీలవేణి.

మనిషిని పరిశీలనగా చూస్తూ "నీ పేరేమిటీ" అంది.

"కళ"

"పేరుకు తగ్గట్లు మనిషి కూడా కళగా,శుభ్రంగానే ఉంది" మనసులో ఓ అంచనా వేసుకుంది నీలవేణి.

"చెప్పండి, ఏమేమి పనులు చేయాలి?" ఇంటి నాలుగు వైపులా చూస్తూ అడిగింది కళ.

"ఇల్లు ఊడ్చి, తుడవాలి. అంట్లు తోమాలి. అంతే. కాకపోతే కాస్త పొద్దున్నే రావాలి. కుదురుతుందా"

"మా ఇల్లు ఈ పక్కనే. మీరు చెప్పిన టైంకు వస్తాను"

"హమ్మయ్యా, తొందరగా కూడా వస్తానంటోంది. నేను ఉద్యోగంలో చేరిన తరువాత కూడా ఇబ్బంది ఉండదు. పెందరాళే పని తెమిలిపోయి, సౌకర్యంగా ఉంటుంది" నీలవేణి మనసులో ఓ ఉపశమనం.

"సరే, జీతం ఎంత ఇవ్వాలి" ఆలోచనలు పక్కన పెట్టి అడిగింది.

"మూడు బెడ్ రూములు కదా"

"ఊ"

"పనికి వెయ్యి రూపాయలు. మీరు రెండు పనులు అడిగారు. అంటే 2000 లు ఇవ్వండి"

"మరీ అంతలేసి జీతాలా?"

"అన్నీ పెరిగిపోయాయి. మేమూ కూడా బ్రతకాలి కదాఅమ్మా"

"కొత్తగా కొనుక్కున్న ఈ ఫ్లాట్‌కి ఇప్పుడే మారాము. మాకు కూడా 'లోనులు,ఫ్లాట్ మెయింటనెన్స్... పిల్లల ఫీజులు'అలా ఎన్ని ఖర్చులో తెలుసా" అంటూ అదోరకంగా కళ్లెగరేసింది నీలవేణి.

"అలా అంటే ఎలా అమ్మా"

"మరి అత్యాశ గా అడిగితే ఇంకేమంటాను"

"ఈ చుట్టు పక్కల ఇంతే ధరలు ఉన్నాయి. కావాలంటే కనుక్కోండి"

"మనిషి నీట్‌గా ఉంది. పొద్దున్నే నాకు అనుకూలమైన సమయంలో వస్తానంటోంది. వదులుకుంటే మళ్లీ వేరే వాళ్లు దొరుకుతారా! కానీ జీతం ఎక్కువ అనిపిస్తోంది..." నీలవేణి మనసులో గుంజాటన.

''చెప్పండి. అవతల వనికి ఆలస్యమైతే కోప్పడతారు"

"మనిషీమాట తీరు కూడా బాగానే ఉంది. అంత కచ్చితంగా చెప్పుతోందంటే అందరూ అంతే జీతాలు ఇస్తుండొచ్చు" అంటూ మనసులో ఓ లెక్క వేసుకుని...

"జీతం ఏముందిలే, పని బాగా చేస్తే చాలు. చూశావుగా, ఇల్లు ఎలా ఉందో! ఈ గజిబిజిలో పని చేయటం కష్టం. రెండు రోజుల్లో ఇల్లు సర్దుకోవటం అయిపోగానే ఫోన్ చేస్తాను. అప్పుడు పని మొదలుపెడుదుగానీ. మొబైల్ నెంబర్ చెప్పి వెళ్లు

"సరే, అమ్మా" అంటూ నెంబర్ చెప్పింది కళ.

* * *

"సెక్యూరిటీ అతనికి చెప్పి వెళ్లాను.మంచిగా పని చేసే మనిషిఎవరన్నా ఉంటే పంపమని, పంపాడా?" కూరగాయల సంచీని నీలవేణి చేతికిస్తూ అడిగాడు సుగుణరావు.

"ఆ పంపాడు...మామయ్యా"

"నీకు నచ్చినట్లు ఉందా"

"మనిషి శుభ్రంగా పొందికగానే ఉంది. పొద్దున్నే కూడా వస్తానంటోంది"

"మరి ఇంకేం,పనికి మాట్లాడుకున్నావా"

"మాట్లాడుకున్నట్లే. కానీ జీతమే ఎక్కువ... "

"అంతా బాగుంటే ఓ వందో రెండు వందలో ఎక్కువైనా ఫరవాలేదులేమ్మా. మళ్లీ ఉద్యోగంలో కూడా చేరతానంటున్నావు. ఒప్పేసుకో" అంటూ నీలవేణి మాటలకు అడ్డు పడిపోయాడు.

రెండేళ్ల క్రితం అనారోగ్యంతో కొడుకు పంచన చేరాడాయన. తను కోలుకున్నాడు. కానీ గుండె పోటుతో హఠాత్తుగా భార్య దాటిపోయింది. తిరిగి సొంత ఊరు వెడతానన్నా, కొడుకు, కోడలు ఒప్పుకోక పోవటంతో ఉండిపోయాడు. దానితో వారితో మరింత గాఢమైన బంధం ఏర్పడింది.

ఎక్కడో ఉన్న కూతుళ్ల మీద ఉన్న ప్రేమ కూడా ఆయన కోడలి మీదే చూపుతాడు. చేదోడు వాదోడుగా ఉంటాడు.

"మీరన్నది నిజమే. కాకపోతే మన ఖర్చులు కూడా చూసుకోవాలిగా"

"కొన్ని తప్పవు కదా తల్లీ"

"అవును, తప్పవు. పైగా 'కావాలంటే చుట్టు పక్కల వాళక్లను అడిగి తెలుసుకోండి. ఇక్కడ ఇంతే ఉన్నాయి జీతాలు' అని ఖరాకండీగా చెప్పింది. ఇంకేమంటాను. అయినా, నేను ఎవరినడుగుతాను"

"ఇంతకూ ఏమి తేల్చుకున్నావు"

"'ఇల్లంతా సామాను కాలికీ వేలికీ అడ్డు వస్తున్నట్లు ఉంది కదా! రెండు రోజుల్లో కొంచెం ఇల్లు సర్దుకుని నీకు ఫోన్ చేస్తాను. అప్పుడు రా'" అని చెప్పాను.

"మంచి నిర్ణయం తీసుకున్నావు" మెచ్చుకోలుగా అన్నాడు ఆయన.

* * *

''ఏమ్మా, ఇల్లు నర్దటం అయ్యిందిగా. ఆ అమ్మాయికి కాల్ చేశావా మర్చి పోయావా'' సాయంత్రం నడక ముగించుకుని వచ్చిన సుగుణరావు ఆరాగా అడిగాడు.

"ఇందాకా ఫోన్ చేద్దామనుకున్నాను. కానీ అసలు విషయం తెలిసి ఇహ వద్దని నిర్ణయం తీసుకున్నాను"

"ఏమయ్యిందీ" ఆతృతగా అడిగాడు.

"మనల్ని పరిచయం చేసుకుందామని, ఇప్పుడే పక్క ఫ్లాట్ లో ఉంటున్న ఆవిడ వచ్చి వెళ్లారు"

"అయితే" అర్థంకానట్లు చూశాడు.

"మాటల మధ్యలో పని వాళ్ల జీతాల గురించి అడిగాను.

'మాదీ, మీ ఫ్లాట్‌లాగే మూడు బెడ్‌రూమ్‌లే. మీరు చెప్పిన పనులే నేను చేయించుకునేది కూడా! పనికి ఎనిమిది వందలు చొప్పున...రెండు పనులకి పదహారు వందలు ఇస్తున్నాను'అని చెప్పింది ఆవిడ"

"మనమ్మాయి ఎంత అడిగింది"

"చెప్పానుగా,పనికి వెయ్యి చొప్పున భయంకరంగా రెండు వేలు జీతం అడిగింది"

"వాళ్లకు ఎప్పటినుండో చేస్తోందేమో"

''అవును. రెండేళ్లుగా చేస్తోందట. 'జీతం పెంచమని గొడవ చేస్తుంటే, ఈ మధ్యే ఓ యాభై

"చాలా స్మార్ట్‌గా చెపుతున్నావే. నా బదులు ఇంటర్వ్యూకి నువ్వు వెడితే సరిపోతుందేమో" అంటూ నవ్వాడు మోహన్. "జోక్స్ పక్కన పెట్టి, చెప్పింది ఆలోచించండి" అని నొక్కి చెపుతూ భర్తకు 'ఆల్ ది బెస్ట్' చెప్పి పంపించింది నీలవేణి. అప్పటిదాకా జరిగింది అంతా విన్న సుగుణ రావు.. ఇహ ఆగలేనట్లు "జీతాలు ఇంతలేసి పెరగాలని మనం కోరు కుంటున్నపుడు, ఇళ్లల్లో పని చేసే కష్ట జీవులకి కూడా ఏడాదికి పదో, పదిహేనో శాతం జీతం పెంచటం న్యాయమేమో" అన్నాడు ఖంగున. జవాబు లేనట్లు చూసింది నీలవేణి.

రూపాయలు పెంచాను. అదేదో మీకు కథ చెప్పింది. నాకు తెలిసి, ఇంతకు మించి ఎవరూ జీతాలు ఇవ్వటం లేదు' అని చెప్పిందావిడ".

"ఓ"

"పైగా ఈ చుట్టు పక్కల, ఇంతకన్నా తక్కువకు ఎవ్వరూ చెయ్యరని దాని దబాయింపు ఒకటి. తలుచుకుంటే ఒళ్లుమండుతోంది."

'ఊపిరి పీల్చుకోవటానికా' అన్నట్లు ఒక్క క్షణం ఆగింది నీలవేణి.

" 'కళ' పేరుకు తగ్గట్లు కళగా ఉందనుకున్నాను కానీ ఈ అబద్దాల కళలు ఉన్నాయనుకోలేదు. ఎంత అన్యాయంగా అడిగింది. ఫోన్ చేసి వద్దని చెపుతాను" రెండు రోజుల క్రితం కళలో కనపడ్డ సద్గుణాలని కొట్టి పారేస్తూ కచ్చగా చెప్పింది నీలవేణి.

"నువ్వు ఏమనుకోకపోతే ఒక విషయం. కళది అన్యాయం అంటున్నావు. రెండేళ్లుగా చేస్తుంటే, జీతం యాభై రూపాయలేనా పెంచేది. అది మటుకు న్యాయమా?"

తనకు సానుకూలంగా మాట్లాడుతారనుకున్న మామగారు, అలా మాట్లాడేసరికి మరింత చిరాకు వచ్చింది నీలవేణికి.

దాంతో "నిన్నగాక మొన్న సిటీకి వచ్చిన మీకు ఇక్కడ విషయాలు అర్థం కావులెండి" అంటూ మామగారి మాటలను మధ్యలోనే కొట్టిపడేసింది నీలవేణి.

నిస్సహాయంగా నిట్టూర్పు విడిచాడు సుగుణరావు.

ఆ సాయంత్రం జరిగినది మొత్తం భర్త మోహన్ ముందు కూడా వెళ్లగక్కింది నీలవేణి.

"పైగా 'న్యాయం... అన్యాయం' అంటూ మీ నాన్నగారి సపోర్ట్ ఒకటి. పాపం, బతికున్న రోజుల్లో మీ అమ్మగారు 'పాలవాళ్ల దగ్గరనుండి పూల వాళ్ల దాకా... ప్రతి విషయంలో చొరబడతారు' అని మొత్తుకునేవారు. ఈయనతో ఎట్లా వేగారో నాకు అర్థం కాదు" అంటూ ఏడాది క్రితం చనిపోయిన అత్తగారి మీద సానుభూతి కూడా కుమ్మరించింది.

"ప్లీజ్,ఎవరో ఒకరిని చూసుకో. రేపటి ఫైనల్ రౌండ్ ఇంటర్వ్యూకి ప్రిపేర్ కావాలిగా. నన్ను డిస్టర్బ్ చేయకు" విసుగ్గా చెప్పాడు మోహన్.

"సారీ, బాగా ప్రిపేర్ అవ్వండి. మనకు డబ్బులు అవసరం కూడా మరింత పెరిగింది" అంది తేలికగా నవ్వేస్తూ.

* * *

"ఏమండీ, కొత్త కంపనీలో చివరి రౌండ్ ఇంటర్వ్యూ అంటే, దాదాపు సెలెక్ట్ అయిపోయి నట్లేగా"

"అలాగే అనుకోవచ్చు" షూ లేస్ బిగిస్తూ అన్నాడు మోహన్.

"నేనొకటి చెపుతాను వింటారా"

"చెప్పు"

"జీతం కాస్త దబాయించి ఎక్కువ అడగండి"

"ఏమిటీ దబాయించి అడిగేది? చేస్తున్న ఉద్యోగ వివరాలు, వస్తున్న జీతం పేమెంట్ స్లీప్ వాళ్లకు సబ్మిట్ చేశాను కదా! ఎంత అడిగినా ఇప్పటి శాలరీ మీద పదిహేను మహా అయితే ఇరవై శాతం మించి పెంచరు"

"ఇప్పుడు చేస్తున్న ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చి జీతం పెరగబోతోంది అని ఆ పెరగబోయే జీతాన్ని చెప్పండి"

"వాట్, ఇప్పట్లో నాకు ప్రమోషన్ వచ్చే ఛాన్స్ లేదని నీకు తెలుసుగా" అన్నాడు మోహన్.

''కానీ, అది ఆ కొత్త కంపనీ వాళ్లకు తెలియదుగా" ధీమాగా అంది నీలవేణి.

"అలా చెపితే ఏమిటీ లాభం" అయోమయంగా అడిగాడు మోహన్.

"హు, అన్నీ నేనే చెప్పాలా ? ఆ పెరగబోయే అంత జీతమే మీరు ఇచ్చేటట్లు అయితే నాకు లాభం ఏముండదు. అక్కడే కొనసాగిస్తాను. పైగా అలవాటు అయిన కంపెనీ. నాకు సౌకర్యంగా కూడా ఉంటుంది. నా పెరగబోయే జీతం మీద మీరు ఎంత పెర్సంటేజ్ ఎక్కువ చేసి ఇస్తారు? దాన్ని బట్టి నేను ఉద్యోగంలో చేరతాను అని చెప్పండి"

"చాలా స్మార్ట్‌గా చెపుతున్నావే. నా బదులు ఇంటర్వ్యూకి నువ్వు వెడితే సరిపోతుందేమో" అంటూ నవ్వాడు మోహన్.

"జోక్స్ పక్కన పెట్టి, చెప్పింది ఆలోచించండి" అని నొక్కి చెపుతూ భర్తకు 'ఆల్ ది బెస్ట్' చెప్పి పంపించింది నీలవేణి.

అప్పటిదాకా జరిగింది అంతా విన్న సుగుణ రావు.. ఇహ ఆగలేనట్లు "జీతాలు ఇంతలేసి పెరగాలని మనం కోరు కుంటున్నపుడు, ఇళ్లల్లో పని చేసే కష్ట జీవులకి కూడా ఏడాదికి పదో, పదిహేనో శాతం జీతం పెంచటం న్యాయమేమో" అన్నాడు ఖంగున. జవాబు లేనట్లు చూసింది నీలవేణి.

"శ్రమజీవుల కష్టం అర్థం చేసుకుని,దానిని గౌరవించటం మన అందరి బాధ్యత" తన మనసులోని అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు 'విశ్రాంత కార్మికుడు' సుగుణరావు.

ఆయన అంతర్గతం అర్థమయ్యి, అంతర్మథనానికి లోనైంది ఆమె.

కొన్ని నిమిషాల తరువాత, 'రేపటినుండి పనిలోకి రమ్మని' నీలవేణి నుండి కళకు కాల్ వెళ్లింది. ★



తెలుగురాష్ట్రాల మెరుపు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరగేసి ఓ అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచ చదరంగం రెండు విభాగాలలో కాంస్య పతకాలు సాధించడం ద్వారా చెస్ శిఖరం విశ్వనాథన్ ఆనంద్ సరసన నిలిచాడు.

అప్పుడు ఆనంద్.. ఇప్పుడు అర్జున్!

భారత చదరంగానికి, తెలుగు రాష్ట్రాలకు విడదీయరాని అనుబంధమే ఉంది. తెలుగు రాష్ట్రాల గ్రాండ్ మాస్టర్లు లేని భారత, విశ్వచదరంగాన్ని ఊహించడం అసాధ్యం.

పెంటేల హరికృష్ణ, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక లాంటి గ్రాండ్ మాస్టర్లు భారత, తెలుగు రాష్ట్రాల చదరంగ ఖ్యాతిని 'ఎవరెస్టు' ఎత్తుకు చేర్చితే..ఆ పరంపరను, సంప్రదాయాన్ని ఓరుగల్లు వీరుడు, తెలంగాణా సంచలన గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరగేసి పలు అరుదైన, సంచలన విజయాలతో కొనసాగిస్తున్నాడు.

2017లో ఆనంద్.. 2025లో అర్జున్

మేధోక్రీడ చదరంగం అనగానే సుదీర్ఘసమయం పాటు సాగే సంప్రదాయ ఎత్తుల సమరమే గుర్తుకు వస్తుంది. అయితే ..కాలానుగుణంగా చదరంగ క్రీడ సైతం మూడు విభాగాలుగా పరిణామం పొందింది. క్రికెట్ తరహాలోనే చదరంగం సైతం క్లాసికల్ (టెస్టు), బ్లిట్జ్ (వన్డే) ర్యాపిడ్ (టీ-20) అన్న మూడు రకాలుగా అభిమానులను అలరిస్తోంది. మెరుపువేగంతో వేసే ఎత్తులతో సాగిపోయే బ్లిట్జ్, ర్యాపిడ్ విభాగాలలో సైతం ప్రపంచ పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారు. సంప్రదాయ చెస్ తో పాటు ర్యాపిడ్, బ్లిడ్జ్ విభాగాలలో సైతం విశ్వవిజేతలుగా నిలిచే అవకాశం పురుషుల, మహిళా గ్రాండ్ మాస్టర్లకు దక్కింది.

ఐదుసార్లు విశ్వవిజేత, భారత తొలి సూపర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌కు జూనియర్ స్థాయి నుంచే మెరుపువేగంతో ఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను చిత్తు చేసే మొనగాడిగా పేరుంది. సంప్రదాయ చదరంగ విభాగంతో పాటు ర్యాపిడ్, బ్లిడ్జ్ విభాగాలలోనూ తిరుగులేని ఆటగాడిగా విశ్వనాథన్ ఆనంద్‌కు పేరుంది.

2017 ప్రపంచ చదరంగ బ్లిట్జ్, ర్యాపిడ్ విభాగాలలో పతకాలు సాధించిన భారత తొలి గ్రాండ్ మాస్టర్‌గా ఆనంద్ చరిత్ర సృష్టిస్తే..అర్జున్ సైతం 2025 ప్రపంచ చదరంగ పోటీల రెండు విభాగాలలో కాంస్యపతకాలు సాధించడం ద్వారా ఆనంద్ సరసన నిలువగలిగాడు.

గత కొద్ది సంవత్సరాలుగా అంతర్జాతీయ పోటీలలో భారత కీలక ఆటగాడిగా వ్యక్తిగత, టీమ్ విభాగాలలో నిలకడగా రాణిస్తూ పలు అరుదైన విజయాలు, ఘనతలు సాధించడం ద్వారా 22 సంవత్సరాల అర్జున్ తెలుగు రాష్ట్రాలకే గర్వకారణంగా నిలిచాడు.

దుబాయ్ వేదికగా జంట కాంస్యాలు

దుబాయ్ వేదికగా ముగిసిన 2025 ప్రపంచ ర్యాపిడ్ చదరంగ పోటీలలో భారత్ సాధించిన మూడుకు మూడు పతకాలు తెలుగు రాష్ట్రాల గ్రాండ్ మాస్టర్లే సాధించడం విశేషం. ఇందులో అర్జున్ సాధించినవే రెండు పతకాలు ఉన్నాయి. మహిళల విభాగంలో వెటరన్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి కాంస్య పతక విజేతగా నిలిచింది. పురుషుల ఓపెన్ విభాగం బ్లిట్జ్, ర్యాపిడ్ అంశాలలో అర్జున్ జంట పతకాలతో కంచుమోత మోగించాడు. ఈ క్రమంలో ప్రపంచ టాప్ ర్యాంక్ ఆటగాడు, సూపర్ గ్రాండ్ మాస్టర్ మాగ్నస్ కార్ల్ సన్‌ను సైతం అధిగమించ గలిగాడు.

గట్టిపోటీ ఎదుర్కొంటూ.. ప్రత్యేకతను కాపాడుకొంటూ...

భారత గ్రాండ్ మాస్టర్ల త్రయం గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీలతో పాటు పలువురు యువఆటగాళ్ల నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటూ అర్జున్ పలు అసాధారణ విజయాలతో తన ప్రత్యేకతను నిలబెట్టుకొంటూ వస్తున్నాడు.

2022 జాతీయసీనియర్ టైటిల్ నెగ్గడం ద్వారా చరిత్ర సృష్టించాడు. బ్లిట్జ్ విభాగంలో సూపర్ గ్రాండ్ మాస్టర్ ఆనంద్‌ను అధిగమించడం ద్వారా తొలిసారిగా నంబర్ వన్ ర్యాంకులో నిలువగలిగాడు. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో చిరుప్రాయం నుంచే చదరంగసాధన మొదలు పెట్టిన అర్జున్ 14 సంవత్సరాల 11 మాసాల, 13 రోజుల చిన్న వయసుకే గ్రాండ్ మాస్టర్ హోదా సాధించగలిగాడు. తెలంగాణా తొలి, భారత 54వ గ్రాండ్ మాస్టర్‌గా రికార్డుల్లో చేరాడు. చిన్నవయసు లోనే గ్రాండ్ మాస్టర్ హోదా పొందిన భారత చదరంగ క్రీడాకారులలో 32వ వాడిగా నిలిచాడు.

2015లో దక్షిణ కొరియా వేదికగా జరిగిన ఆసియా యువజన చెస్ టోర్నీలో రజత పతకంతో తన అంతర్జాతీయ పతకాలవేటకు శ్రీకారం చుట్టిన అర్జున్ ఆ తరువాత మరివెనుదిరిగి చూసింది లేదు. కేవలం మూడేళ్ల వ్యవధిలోనే గ్రాండ్ మాస్టర్ హోదా సంపాదించాడు. 2021లో బల్గేరియా వేదికగా ముగిసిన ప్రపంచ జూనియర్ చెస్‌లో రజత పతకం, 2021 లిండోర్స్ అబ్బే బ్లిట్జ్ టోర్నీలో కాంస్య పతకం సాధించిన ఘనతను సొంతం చేసుకున్నాడు. 2022సీజన్ కే ప్రపంచ చదరంగ ర్యాంకింగ్స్ మొదటి 100 స్థానాలలో చోటు సంపాదించ గలిగాడు. కేవలం ఇతడి ప్రతిభ కారణంగానే భారత్ విశ్వవిజేతగా నిలువగలిగింది. తెలుగురాష్ట్రాల చదరంగ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తున్న అర్జున్ రానున్నకాలంలో మరింతగా రాణించాలని, విశ్వవిజేతగా నిలవాలని కోరుకొందాం.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

ఆంధ్రప్రదేశ్‌లో హిందూ సమ్మేళనాలు (జనవరి, 2026)

బాపట్ల జిల్లా అద్దంకిలో జరిగిన సమ్మేళనంలో శ్రీశ్రీశ్రీ చండీశ్వర శర్మ పాల్గొని ఆశీఃప్రసంగం చేశారు. ఆంధ్రప్రదేశ్ సహప్రాంత ప్రచారక్ ప్రధానవక్త పాల్గొని ప్రసంగించారు. 3100 మంది హాజరయ్యారు.

ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం సమ్మేళనంలో మౌనస్వామీ పీఠం, శ్రీశైలం శ్రీ రుద్ర శివానంద స్వామిజీ, నవశక్తి క్షేత్ర పీఠాధిపతులు, గుంటూరు శ్రీ భవాని శంకరానంద స్వామీజీ అనుగ్రహభాషణం చేయగా, విభాగ్ శారీరక్ ప్రముఖ్ ముప్పూరి నాగశేఖర్ ప్రసంగించారు. 1016 మంది పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం సమ్మేళనంలో శ్రీశ్రీశ్రీ రామాయణం మహేష్ స్వామీజీ ఆశీఃప్రసంగం చేయగా, విభాగ్ ప్రచారక్ రాళ్లబండి నవీన్ ప్రసంగించారు. 1180 మంది పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గొల్లపల్లి సమ్మేళనంలో శ్రీ రుద్ర శివానంద స్వామిజీ, శ్రీ భవాని శంకరానంద స్వామీజీ, శ్రీ యోగిశ్రీనివాసప్రభు స్వామీజీ మార్గదర్శనం చేయగా నెల్లూరు విభాగ్ ప్రచార ప్రముఖ్ మక్కపాటి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. 650మంది పాల్గొన్నారు.

ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో వైద్యుల సమ్మేళనం

భాగ్యనగర్: ఆరోగ్యభారతి – తెలంగాణ ఆధ్వర్యంలో జనవరి 4న భాగ్యనగర్–ఎల్‌బినగర్‌లోని జిఎస్ఆర్ గార్డెన్స్‌లో వైద్యుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి విశిష్టఅతిథిగా రాష్ట్ర గవర్నర్ గౌ॥ జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘచాలక్ (ఆర్ఎస్ఎస్) సుందర్‌రెడ్డి, క్షేత్రప్రచారక్ భరత్, ఆరోగ్యభారతి అఖిల భారత ప్రధాన కార్యదర్శి డాక్టర్ సునీల్‌జోషి, సహ సంఘటన మంత్రి డాక్టర్ మురళీకృష్ణ, క్షేత్ర సంఘటన మంత్రి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈ సమ్మేళనంలో మారుతున్న జీవనశైలి గురించి, ప్రజల ఆరోగ్యం గూర్చి విశేషంగా చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని రకాల వైద్య విధానాలకు సంబంధించిన 600కు పైగా డాక్టర్లు హాజరయ్యారు.

నరసరావుపేట సమ్మేళనం

పల్నాడు జిల్లా నరసరావుపేట హిందూ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా శ్రీశ్రీశ్రీ స్వ స్వరూపానందగిరి స్వామీ, తిరుపతి ఆశీఃప్రసంగం చేశారు. గుంటూరు విభాగ్ ప్రచారక్ గౌతమ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి గౌరవాధ్యక్షులు నాగసరపు సుబ్బరాయ గుప్త, శారదాంబ జెవలరీస్, అధ్యక్షులు శాఖమూరి బాజీబాబు, కార్డియాలజిస్ట్ పాల్గొన్నారు. 1800 మంది పాల్గొన్నారు.

కామారెడ్డిలో శిశుమందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కామారెడ్డి : మన సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ముఖ్యవక్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శ్రీ సరస్వతీ శిశుమందిర్ కామారెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జనవరి 4న శిశుమందిర్‌లో వైభవోపేతంగా జరిగింది. ముఖ్యఅతిథి విద్యాపీఠం తెలంగాణ సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు శిశుమందిరాలని తెలిపారు. ఇందులో పాఠశాల అధ్యక్షుడు శ్యాంసుందర్, జిల్లాకార్యదర్శి గీరెడ్డిరాజారెడ్డి, భగత్‌సింగ్‌నగర్ శిశుమందిర్ అధ్యక్షులు ముప్పారపు ఆనంద్, పూర్వ విద్యార్థి క్షేత్ర సంయోజక్ హరిస్మరణ్‌రెడ్డి, సంచాలన సమితి అధ్యక్షులు బొడ్డు శంకర్ తదితరులతోపాటు పూర్వ ఆచార్యులు 105, పూర్వ విద్యార్థులు 540 మంది పాల్గొన్నారు.

భక్తాగ్రేసరులు

శేషాద్రిస్వామి



కంచిలో జన్మించిన శేషాద్రి స్వామి, రమణమహర్షి సమకాలికులు. వయసులో వారి కంటే పదేళ్ల పెద్ద. రమణులకు ఆత్మబంధువు. ఆయన బాల ప్రహ్లాదునిలా దైవభక్తి చూపేవారు. గంటల కొద్దీ ధ్యానంలో ఉండేవారు. ధ్యానానికి ఇంటి వద్ద అనుకూల వాతావరణం లేకపోతే శ్మశానానికి వెళ్లేవారట. తండ్రి మరణించినప్పుడు బంధువులు తీసుకువచ్చి ఒక గదిలో ఉంచి, ఉత్తరక్రియల అనంతరం చూస్తే అదృశ్యమై అరుణాచలం చేరారు. నిత్యం దేవీపూజ చేసేవారని, ఆ ఉపాసన బలమే ఆయనకు అద్భుతాన్నిచ్చిందని భక్తుల విశ్వాసం. ఒక్కోసారి నవ్వడం, పిల్లినో, ఉడుతనో తరుముకుంటూ వెళ్లడం లాంటి చేష్టలతో వింతగా ప్రవర్తించేవారట. అంబలిని ఇష్టంగా స్వీకరించేవారు. సద్గ్రంథాలు, స్తోత్ర పారాయణాన్ని ప్రోత్సహించేవారు. ఆకస్మికంగా దేహత్యాగం చేయగా పార్థివదేహాన్ని ఆశ్రమ సమీపంలో రమణమహర్షి ఆధ్వర్యంలో ఖననం చేశారు.

కథ

తొందరపాటుకు పశ్చాత్తాపం

ఒకరోజు ఒక సోమరి గొల్లభామ ఒక ఆకుపై కూర్చొని ఏవో కూని రాగాలు తీస్తోంది. అప్పుడు పూలు ఎక్కువగా ఉండటంచేత బాగా మకరందం తాగి సంతోషంతో గంతులేస్తోంది. హఠాత్తుగా దానికి ఒక చీమలదండు కన్పించింది. అవి ఏవో ఆహారపదార్థాల్ని మోసుకొనిపోతున్నాయి. అది చూసిన గొల్లభామకు ఆశ్చర్యమనిపించి "ఎందుకంత శ్రమపడిపోతున్నారు? ఈ చక్కటి గాలిని పీల్చుకొంటూ తిని, తాగి సంతోషంగా ఉండవచ్చుకదా!" అని వాటితో వేళాకోళమాడింది. చీమలు కష్టజీవులే కాదు...తెలివైనవి గూడా. 'ఇది చలికాలం! మంచు ఎప్పుడు కురుస్తుందో ఎవరికీ తెలియదు. ఆ రోజుల కోసం ఇప్పుడు ఆహారం నిల్వ చేసుకొంటున్నాం. మంచు కురిసిందంటే ఆపై ఆహారం దొరకదు' అన్నాయి చీమలు. 'ఎప్పుడో రాబోయేదానికి ఇప్పుడే బాధపోతున్నారు' అంటూ ఈల వేసుకొంటూ గొల్లభామ వెళ్లిపోయింది. అప్పుడు సరిగా తీవ్రమైన చలికాలం. చెట్ల ఆకులన్నీ రాలిపోయాయి. చీమలన్నీ నేలల్లోని పుట్టల్లోకి వెళ్లి ఉంటున్నాయి. పక్షులన్నీ దక్షిణ దిక్కుకు ఎగిరిపోయాయి. గొల్లభామకు తిండిలేకుండా పోయింది. చుట్టుపక్కల ఏ

పద్యం

నేర నన్నవాఁడు నెరజాణ మహిలోన
నేర్తునన్న వాఁడు నింద జెందు
ఊరుకున్న వాఁడె యుత్తమయోగిరా
విశ్వదాభిరామ! వినురవేమ!

భావం : తనకు ఏమీ రాదు అని చెప్పుకొనే వాడు నిజంగా తెలివైనవాడు. అన్నీ వచ్చు అని చేప్పేవాడు గౌరవాన్ని పొందలేడు. మౌనంగా ఉన్నవాడే ఉత్తమ యోగి అనిపించుకొంటాడు.

శ్లోకం

ఈశావాస్య మిదం సర్వం
యత్కించ జగత్యాం జగత్!
తేన త్యక్తేన భుంజీథాః
మా గృధః కస్యస్విద్ధనమ్!!

భావం : ఈ సృష్టి పరమాత్మునికి చెందినది. ఆయనకు సమర్పించగా మిగిలిన దానిని భగవత్ ప్రసాదంగా స్వీకరించాలి. అందులోనే ఆనందం ఉందన్నది పెద్దల మాట. ఇతరుల సంపదను ఆశించరాదు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

మడగాస్కర్	థాయ్‌లాండ్
డక్కా	రిపబ్లిక్ ఆఫ్ కాంగో
సియాం	మలగాసి
డచ్ గయానా	ఢాకా
జైర్	సూరినామ్

ఖంఱ
క్తఱ క్తక్లోఱం-క్తజై; క్తుఱఱ్ఱ-ఱుఱ్ఱ
క్తఱ క్తుంఱుక్తుఱ-ంఱ్ఱుఱ్ఱ; ఱుఱ-ోఱ్ఱ
క్తుఱఱ్ఱ-క్తోక్తుఱఱ్ఱ : ఱుఱుఱ్ఱుక్తు;

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

ఉడుపి రామచంద్రరావు



ప్రఖ్యాత అంతరిక్ష శాస్త్రవేత్త. యూఆర్ రావుగా ప్రసిద్ధుడైన ఆయన మార్చి 10,1932న కర్ణాటకలోని ఆడమారు గ్రామంలో జన్మించారు. మన దేశంలో స్పేస్ టెక్నాలజీ, శాటిలైట్ ప్రోగ్రాం అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ఇస్రోకు ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. ఈయన హయాంలో స్వదేశీ కమ్యూనికేషన్స్, రిమోట్ సెన్సింగ్, వాతావరణ సేవలు అందించే ఉపగ్రహాలను రూపొందించి, ప్రయోగించారు. భారతదేశ మొట్టమొదటి ఉపగ్రహమైన ఆర్యభట్ట ప్రయోగానికి మార్గదర్శకత్వం వహించారు.

జనరల్ నాలెడ్జ్

1. 'లోక్ నాయక్' బిరుదు కలిగిన ప్రముఖ నేత?
2. వాక్యూమ్ క్లీనర్‌ని కనుగొన్న శాస్త్రవేత్త?
3. దేశంలో మొట్టమొదటి డబల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ఎక్కడుంది?

సమాధానాలు: 1. జయప్రకాశ్ నారాయణ్; 2. థామస్ ఆల్వా ఎడిసన్; 3. హైదరాబాద్

మెదడుకు మేత

పచ్చపచ్చని తోటలో
ఎర్ర ఎర్రని
సిపాయిలు.. ఏమిటది?

సమాధానం : జామకాయ

ప్రాణీలేదు. నేలంతా మంచుతో నిండింది. ఎటూ పాలుపోని గొల్లభామ, చీమలవద్దకు వెళ్లి 'కొంచెం ఆహారం పెట్టండి' అని అడిగింది. ఆ గొల్లభామ తమను హేళన చేసిన సంగతి చీమలకు జ్ఞాపకం ఉంది. 'మేము మా ఇంట్లో క్షేమంగా ఉన్నాం. మా కష్టఫలాన్ని హాయిగా అనుభవిస్తున్నాం. మాకు తినడానికి బోలెడంత తిండి నిలవ ఉంది. నీవు మమ్మల్ని, చులకనచేసి మాట్లాడావు. ఆ సంగతి మేం మర్చిపోలేదు. అప్పుడు ఎండలో పాటలు పాడుతూ ఎగిరావు. మరిప్పుడు పాడటం లేదేం? ఇక్కడి నుంచి వెళ్లిపో! నీ వంటి సోమరులంటే మాకు గిట్టదు అయినా ఆకలితో ఉన్న వారిని ఆదరించటం కనీస ధర్మం. అందుకే భోజనం చేసి వెళ్లు' అన్నాయి. గొల్లభామ తన తప్పును తెలుసుకొని పశ్చాత్తాపం చెందింది. ★

మంచిమాట

ఆత్మాభిమానమే
అన్ని సుగుణాలకు
ఆధారం

వారఫలాలు

12-18 జనవరి 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. కొన్ని సమస్యలు తీరి ఊపిరిపీల్చుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులకు అనుకున్న లాభాలు తథ్యం. ఉద్యోగస్తులు కోరుకున్న మార్పులు పొందుతారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు విశేషంగా కలసివస్తుంది. 14,15 తేదీల్లో దూర ప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

పరిచయాలు మరింత పెరుగుతాయి. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని మంచీచెడ్డా విచారిస్తారు. వాహనసౌఖ్యం. మీ నిర్ణయాలపై కుటుంబంలో ఆమోదం లభిస్తుంది. వ్యాపారస్తులు గతం కంటే మరింత పుంజుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు ఊరటనిచ్చే ప్రకటన రావచ్చు. 17,18 తేదీల్లో వృథాఖర్చులు. స్నేహితులతో తగాదాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

నన్నిహితుల నుంచి శుభవార్తలు వింటారు. నూతన ఉద్యోగాన్వేషణలో విజయం సాధిస్తారు. పలుకుబడి పెరుగుతుంది. ఆస్తుల విషయంలో చిక్కులు తొలగుతాయి. వ్యాపారస్తులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు లేదా ఇంక్రిమెంట్లు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. 16,17 తేదీల్లో దూరప్రయాణాలు. అనుకోని ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ప్రముఖుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపా రస్తులు లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, పరి శోధకులకు అరుదైన ఆహ్వానాలు అందుతాయి. 12,13తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువులతో విభేదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆర్థిక విషయాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన కార్యక్రమాలు సజావుగా చేస్తారు. వ్యాపారులు సంస్థలను విస్తరిస్తారు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. పారిశ్రామిక వర్గాలకు ఉత్సాహ వంతంగా ఉంటుంది. కళాకారులు, రచయితలకు అవార్డులు. 15,16 తేదీల్లో దూర ప్రయాణాలు. అనుకోని ఖర్చులు. ఆంజనేయ దండకం పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

మీ ప్రతి పాదనలను కుటుంబసభ్యులు వ్యతిరేకిస్తారు. కొన్ని సమస్యలు సహనాన్ని పరీక్షిస్తాయి. ఆరోగ్యంపై దృష్టి సారించండి. విలువైన వస్తువులు చేజార్చుకుంటారు. ఉద్యోగులకు మరింత పని భారం తప్పదు. కళాకారులకు ఒత్తిడులు పెరుగుతాయి. పరిశోధకులు, రచయితలకు విదేశీ పర్యటనలు వాయిదా. 14,15 తేదీల్లో శుభవార్తలు. వాహన యోగం. విష్ణుధ్యానం చేయండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

జీవిత భాగస్వామి తరఫున ఆస్తిలాభం. కాంట్రాక్టర్లు, రియల్టర్లకు కలసివచ్చే కాలం. వ్యాపారులు తగినంత లాభాలు అందుకుం టారు. ఉద్యోగులకు ఉన్నత స్థితితోపాటు, మంచి గుర్తింపు లభిస్తుంది. రాజకీయ వేత్తలు, కళాకారులకు అనుకూలం. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరం. 17,18 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. అనారోగ్యం. కాలభైరవాష్టకం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వాహనాలు, ఆభరణాలు కొంటారు. మీ నిర్ణయాలను అందరూ స్వాగతిస్తారు. వివాహయత్నాలు కలసివస్తాయి. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు. ఉద్యోగులకు పదోన్నతులు రావచ్చు. పారిశ్రామిక వర్గాలకు ఆహ్వానాలు అందుతాయి. రచయితలు, పరిశోధకుల కృషిఫలిస్తుంది. 13,14 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. రుణఒత్తిడులు. దుర్గా స్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ముఖ్యమైన కార్యక్రమాలలో ప్రతిబంధకాలు తొలగుతాయి. స్నేహితులతో విభేదాలు సర్దుబాటు చేసుకుంటారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. వ్యాపారులు ఆశించినంతగా లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులకు ప్రశంసలు. రచయితలు లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయవేత్తలు, కళాకారులకు మరింత అనుకూలత. 16,17 తేదీల్లో భూవివాదాలు. ఖర్చులు అధికం. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న విధంగా ధనలాభాలు కలుగుతాయి. అందరితోనూ సంతోషంగా గడుపుతారు. విమర్శల నుంచి బయట పడతారు. వ్యాపారులకు పెట్టుబడులు సకాలంలో అంది ఊరట చెందుతారు. ఉద్యోగులకు విధి నిర్వహణ సాఫీగా సాగుతుంది. పారిశ్రామిక వేత్తలు, పరిశోధకులకు మరింత అనుకూలత. 13,14 తేదీలలో విచిత్ర సంఘటనలు. అనారోగ్య సూచనలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

విద్యార్థుల యత్నాలు అనుకూలిస్తాయి. సమాజ సేవలో భాగస్వాములవుతారు. అవసరాలకు డబ్బు అందుతుంది. ఆదర్శవంతంగా నిలుస్తారు. వ్యాపారులు లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులకు విధుల్లో మరింత ప్రోత్సాహం. రాజకీయవేత్తలు, పరిశోధకులకు మరింత సానుకూల సమయం. కళా కారులకు నూతన అవకాశాలు. 16,17 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. విష్ణుధ్యానం చేయండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

నూతనంగా పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. మీ మనోగతాన్ని అందరితోనూ పంచుకుంటారు. అనూహ్యంగా కాంట్రాక్టులు. ఇంటి నిర్మాణాలు చేపడతారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. కుటుంబంలో సంతోషకరంగా గడుపుతారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు దక్కే సూచనలు. పారిశ్రామికవేత్తలు, రచయితలకు ప్రోత్సాహకరం. 12,13 తేదీలలో కుటుంబంలో చికాకులు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

పదరసం-546



ఆధారాలు

1. సంక్రాంతికి సూర్యుడు ప్రవేశించే రాశి (3)
4. ఒకటి అడ్డంకు అధిపతి/గ్రహం (2)
7. ధనుర్మాసంలో ఈ దాసులు కనిపిస్తారు (2)
8. బహుమానం (3)
9. ఈ గారెలు బలే రుచి (3)
10. ఆలయ విధివిధానాలు చెప్పే శాస్త్రం (3)
11. మొదటి రాశి (2)
13. కథే...వికృతి (2)
14. ఏడు రోజులు (2)
15. విరూపాక్ష దేవాలయం గల పట్టణం (2)
16. చేతితో వేసే కొలత (2)
18. సపర్యలే...తడబడ్డాయి (3)
20. అజ్ఞాతవాసంలో ధర్మరాజు పేరు (4)
21. వర్షం (2)
22. ఊదే ఒక వాద్యం (2)
25. మూల్యం, ధర (3)
26. ఈ ఆయుధానికి తిరుగులేదట (4)
28. కోటలో ఇది వేస్తే పని సులువే (2)
29. ముని (2)
30. పసిడితోపాటే...(2)
31. కెరటం (3)
32. శివయ్యకు ఇష్టమైన వారం (2)

నిలువు

1. మహాత్మ్యమే...(3)
2. మకరి బాధిత మృగం (2)
3. సంక్రాంతి తరువాత (3)
5. అరవై సెకన్లు (3)
6. అపకారికి కూడా చేయాలట (4)
8. దివిటీ (3)
11. ఆహారం/గ్రాసం (2)
12. వానరసైన్యం..బహువచనం (5)
13. బంగారం (3)
17. నగ, అలంకరణ (4)
19. అక్క భర్త..తలకిందులయ్యాడు (2)
21. సమరయోధుడు గోపాలకృష్ణయ్య ఇంటిపేరు (4)
23. శ్రీకృష్ణజన్మస్థలి (4)
24. విద్వాంసురాలు (3)
27. కూపం (2)
28. కొత్త కాదు...(2)
29. అంగదుని పినతల్లి (2)

పదరసం - 545 సమాధానాలు



గత ఏడాది సంక్రాంతికి సీనియర్ హీరోలు బాల కృష్ణ, వెంకటేశ్‌తో పాటు యంగ్ హీరో రామ్ చరణ్ పోటీపడ్డాడు. జనవరి 10న 'గేమ్ ఛేంజర్' విడుదలైతే రెండు రోజుల విరామంతో 12న 'డాకు మహారాజ్', ఆ తర్వాత రెండు రోజులకు 14న 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలయ్యాయి. కేవలం మూడు సినిమాలు మాత్రమే గత సంవత్సరం సంక్రాంతి సీజన్‌లో విడుదలయ్యాయి. ఇందులో 'గేమ్ ఛేంజర్' పరాజయం పాలు కాగా, 'డాకు మహారాజ్' హిట్‌గా, 'సంక్రాంతికి వస్తున్నాం' సూపర్ హిట్‌గా నిలిచాయి. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది.

ఈ సంక్రాంతి విజేత ఎవరో!?

గత డిసెంబర్ మాసంలో 'అఖండ 2' సినిమా విడుదలకు ముందు జరిగిన సంఘటనల నుంచి తెలుగు సినిమా రంగం ఇంకా కోలుకోలేదు. ఆ నెల 5న విడుదల కావాల్సిన ఆ సినిమా నిర్మాతల గత చిత్రాల ఒప్పందాల కారణంగా విడుదలకు నోచుకోక, ఆ తర్వాత రకరకాల ప్రయత్నాలతో 12న బయటపడింది. విడుదల తర్వాత కూడా ఓ మాదిరిగానే విజయాన్ని అందుకోవడంతో తెలుగు సినిమా పరిశ్రమపై ఆ ప్రభావం బాగా పడింది. ముఖ్యంగా అది సంక్రాంతికి విడుదల కాబోతున్న సినిమాల బిజినెస్ మీద చూపిస్తోంది. ఈసారి సంక్రాంతికి ఊహించని విధంగా క్రేజీయెస్ట్ ప్రాజెక్ట్స్ జనం ముందుకు వస్తున్నాయి. అందులో మొదటిది ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్'. ఈ పాన్ ఇండియా సినిమా నిజానికి ఎప్పుడో విడుదల కావాల్సింది. కానీ వీఎఫ్ఎక్స్ వర్క్ అనుకున్న సమయంలో జరగకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడీ సినిమా జనవరి 9న సంక్రాంతి సీజన్‌లో ముందు రాబోతోంది. ఈ సినిమా నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్‌కూ గత కొంతకాలంగా సాలీడ్ హిట్ అనేది లేదు. దాంతో ఏ వైపు నుండి ఎలాంటి సమస్యలు వచ్చిపడతాయో అనే సందేహాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. 'అఖండ -2' సంఘటన తర్వాత 'ది రాజాసాబ్'కు అలాంటి సమస్య ఉత్పన్నం కాదని, అన్ని రకాలుగా ఈ సినిమా విడుదలకు మార్గం సుగమం చేసి ఉంచామని నిర్మాత హామీ ఇచ్చారు. (ఈ వ్యాసం రాసే సమయానికి ఆ సినిమా జనవరి 9న విడుదల అయ్యేందుకు అన్ని రకాల చర్యలను పూర్తి చేసుకుంది)

ఈ యేడాది సంక్రాంతి సీజన్ లో వస్తున్న మరో క్రేజీ మూవీ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు'. చిరంజీవి సినిమా వచ్చి రెండేళ్లయిపోయింది. చిరు రీ-ఎంట్రీ తర్వాత ఆరు సినిమాల్లో నటిస్తే అందులో కేవలం 'ఖైదీ నంబర్ 150', 'వాల్తేరు వీరయ్య' మాత్రమే విజయం సాధించాయి. 'సైరా, ఆచార్య, గాడ్ ఫాదర్, భోళా శంకర్' సినిమాలు పరాజయం పాలయ్యాయి. పైగా 'భోళా శంకర్' తర్వాత వస్తున్న సినిమా కావడంతో 'మన శంకర వరప్రసాద్ గారు'పై అందరి దృష్టి ఉంది. గతంలో చిరంజీవితో నయనతార స్క్రీన్ రెండు సార్లు పంచుకుంది. అందులో ఒకటి 'సైరా'కాగా మరొకటి 'గాడ్ ఫాదర్'. మొదటి సినిమాలో వీరిద్దరిపై డ్యూయెట్స్ లేవు, ఇక 'గాడ్ ఫాదర్'లో చిరంజీవి సోదరి తరహా పాత్రలో ఆమె కనిపించింది. కాబట్టి వీరిద్దరూ అవుట్ అండ్ అవుట్‌గా కమర్షియల్ సాంగ్స్‌లో చేసిన సినిమా 'మన శంకర వర ప్రసాద్ గారు'. అందువల్ల ఈ సినిమాకు వీరిద్దరి కాంబినేషన్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుందని మెగాభిమానులు భావిస్తున్నారు. అలానే దర్శకుడు అనిల్ రావిపూడి ఇంతవరకూ పరాజయం అనేది చూడలేదు. ఇక సీనియర్ హీరో వెంకటేశ్ సైతం ఇందులో కీలకమైన అతిథి పాత్ర పోషించడం మరో ప్లస్ పాయింట్. ఈ సినిమాను జనవరి 12న విడుదల చేస్తున్నారు. ఇంత క్రేజ్ ఉన్న ఈ సినిమా బిజినెస్ మీద కూడా 'అఖండ-2' ఎఫెక్ట్ పడిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

ఈ సంక్రాంతికి వస్తున్న మరో సినిమా రవితేజ నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాను జనవరి 13న విడుదల చేస్తున్నారు. రవితేజకు విజయం లభించి చాలా ఏళ్లు గడిచాయి. చిరంజీవితో కలిసి చేసిన 'వాల్తేరు వీరయ్య' తర్వాత ఆ స్థాయి విజయం మరే సినిమాకూ దక్కలేదు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలే నెలకొన్నాయి. ఇందులో ఇక జనవరి 14న రెండు సినిమాలు రాబోతున్నాయి. నవీన్ పోలిశెట్టి నటించిన 'అనగనగా ఒక రాజు' సినిమాను సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ సినిమా వినోదాల విందును వడ్డిస్తుందనే ఆశతో జనాలు ఉన్నారు. చిత్రంగా అదే రోజు సాయంత్రం నుండి శర్వానంద్ నటించిన 'నారీ నారీ నడుమ మురారి' సినిమా రాబోతోంది. ఇందులో సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించారు. ఇలా ఈ సంక్రాంతికి ఐదు సినిమాలు ఒక దానితో ఒకటి పోటీ పడబోతున్నాయి. ఇందులో 'ది రాజా సాబ్' ఒక్కటే హారర్ కామెడీ మూవీ. మిగిలినవన్నీ ఫ్యామిలీ ఎంటర్ టైనర్సే!

సహజంగా సంక్రాంతి సీజన్ అంటే తమిళ డబ్బింగ్ సినిమాలు సైతం తెలుగులో వస్తుంటాయి. గత యేడాది అలా ఏ సినిమా కూడా రాలేదు. అక్కడ పొంగల్ కు విడుదలైన రెండు మూడు సినిమాలు ఓ వారం, రెండు వారాల గ్యాప్ తర్వాత తెలుగులో వచ్చాయి. కానీ ఈసారి విజయ్ నటిస్తున్న చివరి సినిమా 'జన నాయగన్'... 'జన నాయకుడు' పేరుతో తెలుగులో జనవరి 9నే వస్తోంది. బాలకృష్ణ 'భగవంత్ కేసరి'లోని కోర్ పాయింట్‌ను తీసుకుని, విజయ్ పొలిటికల్ ఎంట్రీని దృష్టిలో పెట్టుకుని కాస్తంత మార్పులు చేర్పులతో ఈ సినిమాను తెరకెక్కించారు. ఇక తమిళనాట పొంగల్‌కు విడుదల అవుతున్న మిగిలిన సినిమాలేవీ ఈసారి సంక్రాంతికి తెలుగులో విడుదలయ్యే ఛాన్స్ కనిపించడం లేదు.

ఏది ఏమైనా ఈ యేడాది సంక్రాంతి సీజన్‌లో ఐదు స్ట్రయిట్ తెలుగు సినిమాలతో పాటు ఓ తమిళ డబ్బింగ్ సినిమా జనం ముందుకు వస్తున్నాయి. మరి వీటిలో ఏది విజేతగా నిలుస్తుందనేది చూడాలి.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

1857
స్వరాజ్య
సమరానికి పునాది
ఆ నెత్తుటి
తర్పణకు నూరేళ్లు
RSS స్ఫూర్తితో
ఈ గ్రామం చేసిన
అద్భుతం ఇది
శివాజీ విగ్రహావిష్కరణకు
రాకుండా నెహ్రూని
అడ్డుకోవాలనుకుం
గురూజీ చేసిందే
అమ్మ భాషకు
ఆదరణ
ఎంత?
జానకిరాముల
పరిణయం
జగత్కల్యాణం
ఆధ్యాత్మికతతోనే
ఆరోగ్యం
ఉగాది సారం
జాగృతి
TV
చేరండి
మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.
www.youtube.com/@Jagrititv
చెప్పండి
మెచ్చండి
పంచండి

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 13

Shrutham
SCHOOL - INTERNATIONAL
WISDOM | HARMONY | DHARMA

BLENDING
INDIAN ETHOS WITH
INTERNATIONAL
EXCELLENCE



Campus Highlights

- Nestled in a lush & green 10+ acre campus
- The Neighborhood of Neopolis, Financial District, Tellapur, Mokila and Narsingi
- Designed with advanced, state-of-the-art infrastructure.

At Shrutham, we don't just prepare students for college.
We prepare them for life on the world stage.

ADMISSIONS OPEN

For more details call:
75 99 69 3333
or visit www. shruthamschools.com

scan for website

Near Neopolis, Narsingi Municipality, Hyderabad, Telangana-500075 info@shruthamschools.com